1,102 పనులు రద్దు

జిల్లాలో రూ.696.77 కోట్ల వ్యయంతో మంజూరు చేసిన 2,571 జేజేఎం పనులలో ప్రారంభం కాని, 25శాతంలోపు మాత్రమే జరిగిన రూ.412.89 కోట్ల విలువైన 1,102 పనులను ప్రభుత్వం రద్దు చేసింది. రాష్ట్రంలో ఇలాంటి వాటితోపాటు వైసీపీ ప్రభుత్వంలో టెండర్లు ఖరారు చేసి పనులు చేపట్టని రూ.7,910,10 కోట్ల విలువైన ఐదు మల్టీ విలేజ్ స్కీంలను కూడా రద్దు చేసింది. అందులో జిల్లా పశ్చిమప్రాంతంలోని మార్కాపురం, ఎర్రగొండపాలెం, గిద్దలూరు, కనిగిరి నియోజకవర్గాలకు తాగునీటి సరఫరా కోసం గత వైసీపీ ప్రభుత్వం రూ.1,290 కోట్లతో ప్రకటించిన భారీ పథకం కూడా ఉంది.



మల్టీ విలేజ్ స్కీం కింద గొట్టిపడియ వద్ద నిర్మాణంలో ఉన్న ఇన్‌టేక్ వెల్ (ఫైల్)

- పశ్చిమ ప్రాంతంలో రూ.1,290 కోట్ల ఎంవీఎస్ పనులు కూడా క్యాన్సిల్
- గత ఐదేళ్లలో పట్టించుకోని ఫలితం
- తిరిగి కొత్త ప్రతిపాదనలు సిద్ధం

వైసీపీ నిర్లక్ష్యం జనానికి శాపం

అనుకున్నంతా అయ్యింది.. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. గ్రామీణవాసుల తాగునీటి కష్టాలకు ఇప్పట్లో శాశ్వత పరిష్కారం లభించే పరిస్థితి కనిపించడం లేదు. జిల్లాలో గడిచిన ఐదేళ్లలో జల్ జీవన్ మిషన్(జేజేఎం)కు సకాలంలో రాష్ట్రప్రభుత్వం వాటా నిధులు విడుదల చేయక పథకం నత్తనడకన సాగింది. జిల్లాలో మూడో వంతు పనులు కూడా ముందుకు సాగలేదు. నిజానికి వర్షాకాలంలోనూ తాగునీటి కోసం తల్లడిల్లే పరిస్థితి ఉన్న మన జిల్లాలాంటి ప్రాంతానికి వరంలాంటిది జేజేఎం పథకం. అయితే గత వైసీపీ ప్రభుత్వ ఉదాసీన వైఖరితో ఆ పథకాన్ని పెద్దగా ఉపయోగించుకోలేని పరిస్థితి నెలకొంది. దీంతో రూ.412.89 కోట్ల పనులు రద్దయ్యాయి.

రూ.412.89 కోట్ల జలజీవన్ మిషన్ పనులు రద్దు

ఒంగోలు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో చేపట్టిన జలజీవన్ మిషన్ పథకం పనులు పూర్తిచేయడంలో గత వైసీపీ ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యం జిల్లాలోని గ్రామీణ ప్రాంతంలో గొంతెండుతున్న ప్రజలకు శాపంగా మారింది. వారి దాహార్తిని తీర్చేందుకు ఈ పథకం కింద చేపట్టిన పనులలో మూడో వంతు కూడా కేంద్రం ఇచ్చిన గడువు ముగిసేలోపు పూర్తిచేయలేకపోయింది. దీంతో ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ పనులను రద్దు చేసింది. అందుకు సంబంధించిన ఉత్తర్వులు అధికారులకు అందాయి. అందులో జిల్లాలో రూ.412.89 కోట్ల విలువైన 1,102 పనులు ఉన్నాయి. అలాగే పశ్చిమప్రాంతంలోని నాలుగు నియోజకవర్గాల్లో తాగునీటి సరఫరా కోసం వైసీపీ ప్రభుత్వం రూ.1,290 కోట్లతో ఆర్భాటంగా ప్రకటించిన మల్టీ విలేజ్ స్కీం(ఎంవీఎస్)కు కూడా టెండర్లు పిలిచి పనులు చేయని కారణంగా ప్రస్తుత ప్రభుత్వం రద్దుచేసింది.



జల్ జీవన్ పథకం పనుల కోసం తెచ్చిన పైపులు (ఫైల్)

రాష్ట్రం వాటా ఇవ్వకనే..

కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం 2019లో రెండోసారి అధికారంలోకి వచ్చాక దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ తాగునీటి సరఫరా కోసం జలజీవన్ మిషన్ పేరుతో భారీ పథకాన్ని చేపట్టింది. ఇందుకు అవసరమైన నిధుల్లో 50శాతం రాష్ట్రాలు భరిస్తే మిగిలిన 50శాతం గ్రాంటుగా కేంద్రం ఇచ్చింది. ఐదేళ్లలో మొత్తం పనుల పూర్తికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించి చేసిన పనులకు అనుగుణంగా నిధులను కేంద్రం

మిగతా 6వ పేజీలో



కేక్ కట్ చేస్తున్న మంత్రి స్వామి, పక్కన కలెక్టర్ అన్సారియా, మేయర్ సుజాత, జేసీ గోపాలకృష్ణ తదితరులు

సందడిగా సెమీ క్రిస్మస్

మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ఒంగోలులోని కలెక్టరేట్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు వైభవంగా జరిగాయి. సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పాల్గొని కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తు బోధనలు అనుసరణీయమన్నారు. ప్రేమ, సహనం, కరుణ మూర్తీభవించిన రూపమే జీసస్ అన్నారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా, మేయర్ గంగాడ సుజాత, జేసీ గోపాలకృష్ణ, మైనారిటీ సంక్షేమశాఖ అధికారి పార్థసారథితోపాటు పలుశాఖల అధికారులు, వివిధ క్రైస్తవ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. అంతకుముందు ఐజక్‌బాబు, పి.విలియంకేరి, టి.ప్రేమ్‌చంద్, కె.స్రామ్రాట్, కె.నతానియల్, డీఎస్ పాల్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

-ఆంధ్రజ్యోతి, ఒంగోలు కలెక్టరేట్

క్రిస్మస్ కాంతులు

- మొదలైన పండుగ సందడి
- విద్యుత్ వెలుగులు విరజిమ్ముతున్న చర్చిలు
- రేపు ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు
- సేవా కార్యక్రమాల్లో చారిత్రాత్మక మందిరాలు

7



విద్యుత్ కాంతులతో మార్కాపురం బాప్టిస్టు చర్చి

ఇన్‌చార్జి సెక్టోరల్ సిబ్బంది నియామకం

- డీఈవో కిరణ్‌కుమార్ ఉత్తర్వులు

ఒంగోలు విద్య, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు ఇన్‌చార్జి సెక్టోరల్ సిబ్బందిని నియమిస్తూ డీఈవో కిరణ్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. నలుగురు సభ్యుల కమిటీ ఇంటర్వ్యూలు నిర్వహించి వీరిని ఎంపిక చేసింది. సీఎంవోగా సంతనూతలపాడు జడ్పీ హైస్కూలు హిందీ స్కూలు అసిస్టెంట్ కె.సోనీరూత్, ఎంఐఎస్‌అండ్ ప్లానింగ్ కోఆర్డినేటర్‌గా పచ్చవ జడ్పీ హైస్కూలు గణితం అసిస్టెంట్ ఎం.జాలరత్నం, ఏఎల్ఎస్ కోఆర్డినేటర్‌గా దేవరపాలెం హైస్కూలు గణితం అసిస్టెంట్ డి.నాగరాజు ఎంపికయ్యారు. జీసీడీవోగా చిమట ఎంపీయూపీ స్కూలు ఇంగ్లీషు అసిస్టెంట్ కె.హేమలత, ఐఈ కోఆర్డినేటర్‌గా వైపాలెం జీహెచ్ఎస్ గణితం అసిస్టెంట్ పి.నాగేంద్రనాయక్, ఏఎస్ఓగా కలుజువ్వలపాడు జడ్పీ హైస్కూలు పీఎస్ అసిస్టెంట్ బి.శ్రీనివాసరావులు ఎంపికయ్యారు. సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టులో ఇన్‌చార్జిలుగా పనిచేసేందుకు వీరిని వారు పనిచేస్తున్న పాఠశాలల నుంచి రిలీవ్ చేసి పంపాలని హెచ్ఎంలను డీఈవో ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

వెలుగు పీడీ బదిలీ

- శ్రీకాళహస్తి ఈటీసీలో ఇన్‌స్ట్రక్టర్‌గా నియామకం

ఒంగోలు నగరం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్ టి.వసుంధర మరోసారి బదిలీ అయ్యారు. ఆమెను శ్రీకాళహస్తికి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. నెలక్రితం ప్రభుత్వం వసుంధరను నెల్లూరు జిల్లా డీఎల్‌డీవోగా బదిలీ చేసింది. కానీ అక్కడ పనిచేస్తున్న డీఎల్‌డీవో విధుల నుంచి రిలీవ్ కాకపోవడంతో ఈమె ఇక్కడ పీడీగానే కొనసాగుతున్నారు. ఈనేపథ్యంలో వసుంధరను కాళహస్తిలోని ఈటీసీలో గజిటెడ్ ఇన్‌స్ట్రక్టర్‌గా నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.



క్యారమ్స్ పోటీల్లో మెడల్స్ సాధించిన జిల్లా విద్యార్థులు

ఓవరాల్ చాంపియన్ ప్రకాశం

6

- రాష్ట్రస్థాయి క్యారమ్స్ పోటీల్లో జిల్లా విద్యార్థుల సత్తా
- వివిధ విభాగాల్లో 13 మందికి మెడల్స్



కుమ్మతెగులు సోకడంతో మిర్చి పంటలో ముడుచుకుపోయిన ఆకులు

రైతుల్లో కలవరం

- మారుతున్న వాతావరణం
- మళ్లీ జిల్లా అంతటా మంగుపట్టి.. పంటలపై తెగుళ్లు, పురుగుల ఉధృతి
- రెండు, మూడు రోజులు వాన పడే అవకాశం
- పంటలు దెబ్బతింటాయని రైతుల ఆందోళన

ఒంగోలు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రస్తుతం నెలకొన్న వాతావరణం రైతులను కలవరపెడుతోంది. దీనికితోడు రానున్న రెండు, మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ సంకేతాలు వారిని మరింత ఆందోళనకు గురిచేస్తోంది. గత పది రోజులుగా జిల్లాలో చలిగాలులు, మంచు తీవ్రత అధికంగా ఉంది. అంతకుముందు వర్షాలు కురవడంతో చాలా ప్రాంతాల్లో పంటలపై పురుగులు, తెగుళ్ల దాడి పెరిగింది. రెండు రోజులు కాస్తంత తెరపి ఇచ్చి ఎండ కనిపించినా తిరిగి మంగు వాతావరణం నెలకొంది. ప్రస్తుతం ఖరీఫ్‌లో వేసిన వరి కోతలు జరుగుతుండగా కంది పిందె దశలో ఉంది. పత్తి, మిర్చి కోతలు జరుగుతున్నాయి. ఇక రబీలో వేసిన పొగాకు, వరి, శనగ, మినుము, అలసంద, ఇతరత్రా పైర్లు ఎదుగుదల దశలో ఉన్నాయి. మిర్చి తోటలపై వైరస్ దాడి అధికంగా ఉంది. ఇతర పంటల పరిస్థితి అదేవిధంగా ఉంది. ఇలాంటి కీలక సమయంలో నెలకొన్న మంగు వాతావరణంతో పంటలపై చీడపీడల దాడి మరింత పెరిగి తీవ్రంగా దెబ్బతినే పరిస్థితి నెలకొంది.

మళ్లీ వాన భయం

ఈనెల తొలివారంలో కురిసిన వర్షాలతో కొన్ని ప్రాంతాల్లో పంటల సాగు జాప్యమైంది. కాగా అల్పపీడనాల ప్రభావంతో ఎప్పటికప్పుడు జిల్లాలో వర్షం పడేలా ఆకాశం మేఘావృతవుతోంది. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో శనివారం రాత్రి ఒక మోస్తరు వర్షాలు పడి పంటలు దెబ్బతిన్నాయి. తిరిగి బంగాళాఖాతంలో నాలుగు రోజుల క్రితం ఏర్పడిన వాయుగుండం బలహీనపడినట్లే పడి తిరిగి దిశ మార్చుకొని వాయుగుండంగా మారి దక్షిణ, కోస్తా వైపు పయనిస్తుందని, మంగళవారం నుంచి గురువారం వరకు ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సంకేతాలు ఉన్నాయి. సోమవారం మధ్యాహ్నం తర్వాత వాతావరణంలో మార్పు కనిపించింది. తుఫాన్ సమయంలో ఉండే మాదిరి చలిగాలులు వీస్తున్నాయి. ఈ వాతావరణ పరిస్థితులతో వర్షాలు పడితే అన్నిరకాల పంటలు దెబ్బతినడంతోపాటు ఇంకా వేయాల్సిన వాటి సాగు మరింత ఆలస్యమవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మూడో రోజూ భూప్రకంపనలు

- ముండ్లమూరు మండలంలో ఒకే రోజు మూడు సార్లు
- పరుగులు తీసిన ప్రజలు
- వరుస ప్రకంపనలతో ఆందోళన

వివరాలు మెయిన్‌లో..

నూరుశాతం బయోమెట్రిక్ హాజరు

- అందరూ పాటించే విధంగా చర్యలు తీసుకోవాలి
- సచివాలయ ఉద్యోగులపై ప్రత్యేక దృష్టి సారించాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది అందరూ వంద శాతం బయోమెట్రిక్ హాజరు వేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి సోమవారం సాయంత్రం మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. సచివాలయ ఉద్యోగులు బయోమెట్రిక్ హాజరును ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు ప్రతిరోజూ పర్యవేక్షించాలన్నారు. ఉద్దేశపూర్వకంగా దీర్ఘకాలిక సెలవులు పెట్టిన వారిపై దృష్టి సారించాలన్నారు. బయోమెట్రిక్ హాజరును జీతాలకు అనుసంధానం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

చేయాలని జడ్పీ సీఈవోను ఆదేశించారు. ఈ నెలాఖరు నాటికి జియోట్యాగింగ్ ప్రక్రియను పూర్తిచేయాలన్నారు. అందరి బ్యాంకు ఖాతాలను ఎన్‌సీఐతో మ్యాపింగ్ చేయాలని, హౌస్‌హోల్డ్ క్లస్టర్లను ఆయా ఆవాసాలు, గ్రామ పంచాయతీలు, రెవెన్యూ గ్రామాలతో మ్యాపింగ్ చేయాలని సూచించారు. సచివాలయాల వారీగా 0 నుంచి ఆరేళ్ల వయస్సు ఉన్న పిల్లల ఆధార్ అప్‌డేషన్ ప్రక్రియను వందశాతం పూర్తిచేయాలన్నారు. స్కూళ్లలో మరుగుదొడ్ల నిర్మాణాలను లక్ష్యం మేరకు పూర్తిచేయాలని ఎంపీడీవోలను ఆదేశించారు. త్వరలో సామూహికంగా ఇళ్ల ప్రారంభోత్సవాలు చేస్తున్న నేపథ్యంలో జిల్లాలోనూ లక్ష్యాన్ని పూర్తిచేయాలన్నారు. మొత్తం 3,800 ఇళ్ల నిర్మాణాలు లక్ష్యంకాగా ఇప్పటివరకు 2,101 పూర్తి చేశారన్నారు. మిగిలినవి కూడా పూర్తికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. గ్రామాల్లో అవసరమైన తాగునీటి అవసరాలను గుర్తించి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. జిల్లాలో సూక్ష్మ, చిన్నతరహా సంస్థల స్థాపనకు పక్కాగా సర్వే నిర్వహించాలన్నారు. జిల్లాలోని 73 సచివాలయాల్లో ఈ సర్వే చేయాలన్న కలెక్టర్.. వెంటనే చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో అధికారులు చిరంజీవి, బాలశంకరరావు, శ్రీనివాసప్రసాద్, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, హేన సుజన, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



మర్రిపూడి గ్రామం వ్యూ

ఆస్తులున్నా అమ్ముకోలేరు!

దేవదాయశాఖ అధికారుల నిర్లక్ష్యం.. మర్రిపూడి ప్రజలకు నష్టం

- ఊరు మొత్తం ఆలయ భూమిగా నమోదు
- పదేళ్లుగా నిలిచిపోయిన రిజిస్ట్రేషన్లు
- అవసరాలకు ఇళ్లు, స్థలాలు విక్రయించుకోలేక అల్లాడుతున్న గ్రామస్థులు
- పిల్లల చదువులు, వివాహాలకు ఇక్కట్లు
- ప్రస్తుత రెవెన్యూ సదస్సుల్లోనైనా సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి

మర్రిపూడి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : దేవదాయశాఖ అధికారుల నిర్లక్ష్యం మర్రిపూడి ప్రజలకు శాపంగా మారింది. గ్రామంలోని మొత్తం భూమిని దేవదాయ శాఖకు చెందినదిగా నమోదు చేయించడంతో ఆస్తి ఉన్నా వారు అమ్ముకోలేని దుస్థితి నెలకొంది. పదేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొంది. అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. దీంతో ఎంత అవసరం, కష్టం వచ్చినా... ఇల్లు, స్థలం ఉన్న వారు వాటిని అమ్ముకోలేకపోతున్నారు. అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స చేయించుకోలేక కొందరు ప్రాణాలు కోల్పోయారు. పిల్లల విద్య, వివాహాలకు సైతం ఉన్న ఆస్తిని అమ్ముకోలేక అనేక మంది అవస్థపడుతున్నారు.

ఏం జరిగిందంటే..

2014వ సంవత్సరంలో రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం మీభూమి పేరుతో గ్రామ సభలు నిర్వహించింది. ఆసమయంలో దేవదాయశాఖ అధికారులు చేసిన తప్పిదం గ్రామస్థులను ఇబ్బందుల్లోకి నెట్టింది. మర్రిపూడి గ్రామం 545 సర్వేనంబర్‌లో 43.70 ఎకరాల్లో విస్తరించి ఉంది. గ్రామంలో రాజుల కాలంలో నిర్మించిన

మిగతా 6వ పేజీలో

రైతులకు సేఫ్టీ కిట్లు పంపిణీ

త్రిపురాంతకం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రైతుదినోత్సవం సందర్భంగా కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో మండలం లోని కొత్తముడివేముల గ్రామంలో స్టీవార్డ్ వే నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులతో సమావేశం ఏర్పాటు చేసి పురుగుమందులు పిచికారీ చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం మందులు పిచికారీ చేసే సమయంలో వాడే సేఫ్టీ కిట్లను రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోరమాండల్ కంపెనీ మార్కెటింగ్ అధికారి డి.ఖాశింవలి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

టెన్నిస్‌బాల్ ఇండియా క్రికెట్ జట్టుకు జిల్లా కుర్రాడు


సృజన్

ఒంగోలు, కార్పొరేషన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) :టెన్నిస్ బాల్ క్రికెట్ ఇండియా జట్టుకు జిల్లా కుర్రాడు దార్ల సృజన్ ఎంపికైనట్లు ఆంధ్రప్రదేశ్ టెన్నిస్‌బాల్ క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్‌డీ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇండో-నేపాల్‌లో జరిగే క్రికెట్ పోటీలలో సృజన్ ఇండియా జట్టు తరుఫున పాల్గొంటున్నట్లు తెలిపారు. గతంలో అనేక మ్యాచ్‌లు ఆడి రాణించిన ఆయన ఇండియా జట్టుకు ఎంపిక కావడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈమేరకు సృజన్ సోమవారం శాప్ ఛైర్మన్ రవినాయుడుని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

31లోపు అపరాధ రుసుం లేకుండా పరీక్ష ఫీజు చెల్లించాలి

ఒంగోలు విద్య, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 2024-25 విద్యా సంవత్సరానికి పదో తరగతి, ఇంటర్ మీడియేట్ కోర్సులకు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఈనెల 31వతేదీలోపు ఫీజు చెల్లించవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 1నుంచి 4వతేదీ వరకు రూ. 25 అపరాధ రుసుం, 5నుంచి 8వ తేదీ వరకు రూ. 50 అపరాధ రుసుంతో పరీక్ష ఫీజు చెల్లించవచ్చన్నారు. పదవ తరగతిలో ఒక్కొక్క సబ్జెక్టుకు రూ. 100 వంతున, ఇంటర్‌లో ఒక్కొక్క సబ్జెక్టుకు రూ. 150 వంతున పరీక్షఫీజు చెల్లించాలని ఆయన కోరారు. ఓపెన్ స్కూలు కో ఆర్డినేటర్లందరూ తమ వద్ద అడ్మిషన్లు పొందిన విద్యార్థులందరిచేత పరీక్ష ఫీజు చెల్లింపజేయాలన్నారు.

అర ఎకరా స్థలం చూపిస్తే చెరువు ఏర్పాటు చేస్తాం

టంగుటూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఏ గ్రామంలోనైనా అర ఎకరా స్థలం చూపిస్తే అమృత్ సరోవర్ పథకం కింద చెరువు నిర్మించి వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తామని ఉపాధి హామీ ఏపీవో సుభాషిణి ఒక ప్రకటనలో తెలిపారు. దాతల సహకారంతో ట్రాక్‌పై బల్లలు వేస్తామన్నారు. తాను గ్రామానికి అర ఎకరా ప్రభుత్వ భూమి చూపించాలని నెల క్రితమే తహసీల్దార్ ఆంజనేయులును కలిసి కోరానని తెలిపారు. ప్రస్తుతం రెవెన్యూ సదస్సులు జరుగుతున్నాయని, అవి ముగియగానే స్థలాలను గుర్తిస్తామని తహసీల్దార్ చెప్పారన్నారు.

గుప్తనిధుల ఆశచూపి టోకరా

మార్కాపురం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): తన పొలంలో రూ.కోట్ల విలువైన గుప్త నిధులున్నాయని వాటిని వెలికితీసేందుకు ఆర్థికసాయం చేస్తే ఒకటికి మూడు రెట్లు డబ్బులిస్తానని నమ్మబలికిన ఓ వ్యక్తిపై మార్కాపురం పట్టణ ఎస్సై సైదుబాబు సోమవారం కేసు నమోదు చేశారు. ఆయన కథనం మేరకు, స్థానిక విద్యానగర్‌కు చెందిన ముటుకుల సుబ్రహ్మణ్యం ఓ న్యాయవాది వద్ద గుమస్తాగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో పొలంవివాదం నేపథ్యంలో పెద్దారవీడు మండలం కలనూతలకు చెందిన గోద నడిపయ్య న్యాయవాది వద్దకు వస్తుండేవాడు. ఈ క్రమంలో గుమస్తా సుబ్రహ్మణ్యంతో నడిపయ్యకు పరిచయం ఏర్పడింది. వివాదంలో ఉన్న పొలంలో రూ.కోట్ల విలువైన గుప్త నిధులున్నాయని గుమస్తాకు నడిపయ్య తెలిపాడు. తన దగ్గర డబ్బులు లేవని రూ.10 లక్షలు ఇస్తే తాను మూడు రెట్లు తిరిగిస్తానని నమ్మబలికాడు. ఈ విషయంలో తనకు ఝాన్సీ, రవి అనే వాళ్ల సాయం చేస్తారని చెప్పాడు. దీంతో గుమస్తా సుబ్రహ్మణ్యం తన వద్ద రూ.6 లక్షలు మాత్రమే ఉన్నాయని సుబ్రహ్మణ్యం చెప్పాడు. ఆ డబ్బులను నడిపయ్య సూచన మేరకు గుప్తనిధులను తవ్వితీసే ఝాన్సీ అనే మహిళకు పంపించాడు. ఈ సంవత్సరం మార్చిలో ఫోన్‌పే ద్వారా విడతల వారీగా ఝాన్సీకి సుబ్రహ్మణ్యం నగదు పంపాడు. అయితే నెలలు కావస్తున్నా తాను పంపిన డబ్బుల గురించి నడిపయ్య సమాధానం చెప్పలేదు. దీంతో సెప్టెంబరులో సుబ్రహ్మణ్యం నిలదీశాడు. దీంతో పలువురు మధ్యవర్తుల సమక్షంలో నడిపయ్య రూ.6 లక్షలకు ప్రామిసరీ నోటు రాసిచ్చాడు. ఆ తర్వాత నుంచి నడిపయ్య కనిపించకపోవడంతో ఆందోళనకు గురైన సుబ్రహ్మణ్యం సోమవారం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై సైదుబాబు తెలిపారు.

అర్జీలను సహేతుకంగా పరిష్కరించాలి

కలెక్టర్ అన్సారియా ఆదేశం


అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మీకోసం కార్యక్రమంలో ప్రజలు అందజేసే అర్జీలను సహేతుకంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను ఆమె స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ మీకోసం అర్జీల పరిష్కారానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వాటిని పరిష్కరిస్తున్న తీరును ముఖ్యమంత్రి కార్యాలయ ఉన్నతాధికారులు సూక్ష్మంగా పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. మొక్కుబడి సమాధానాలు చెప్పి అర్జీదారులను పలు మార్లు కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటే సహించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. అర్జీదారులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్ కూడా కరెక్ట్‌గా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, డీఆర్వో చినఓబులేషు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు లోకేశ్వరరావు, వరకుమార్ తదితరులు ఉన్నారు.

- తన కుమారుడు మనోహరాచారి దివ్యాంగుడిగా జన్మించాడని, పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలని పీసీపల్లికి చెందిన మారెళ్ల నరసింహాచారి కోరారు. కనీసం సదరం సర్టిఫికెట్ కూడా ఇవ్వకపోవడంతో పింఛన్ తీసుకొనేందుకు అవకాశం లేకుండా పోయిందన్నారు.
- ప్రభుత్వ భూమిని ఆక్రమించి గ్రానైట్ ఫ్యాక్టరీ నిర్మించిన వారిపై చర్యలు తీసుకోవాలని సంతనూతలపాడుకు చెందిన కుంచాల వీరబ్రహ్మయ్య, తన్నీరు అంకయ్య, కే పాపారావు, కేవీ రామయ్య తదితరులు కోరారు. సంతనూతలపాడు మండలం పిడతలగుడిపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని పిడతలగుడిపాడు డొంకరోడ్డులో ఆరు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని అన్యాక్రాంతం చేశారని ఫిర్యాదు చేశారు.విచారణ చేసి అన్యాక్రాంతమైన భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరారు.


నిరసన తెలుపుతున్న భూ బాధితులు

మా భూమి ఇప్పించకపోతే ఆత్మహత్యే శరణ్యం

కుటుంబ సభ్యులతో కలెక్టర్ ఎదుట నిరసన

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి) : తమ భూమిని తమకు అప్పగించకపోతే కలెక్టరేట్ ఎదుట ఆత్మహత్య చేసుకుంటామని కొండపి మండలం పెట్లూరుకు చెందిన చెంచురామయ్య, చంద్రమౌళిలు హెచ్చరించారు. కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం గ్రీవెన్స్ హాలులో కలెక్టర్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 450 సర్వేనెంబరులోని 4.40 ఎకరాల భూమిని కొంతమంది ఆక్రమించుకున్నారని తెలిపారు. కోర్టు ఆదేశాలను కూడా ధిక్కరించి అక్రమంగా నిర్మాణాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక సార్లు అధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. గతంలో జేసీ, ఆర్డీవోలు ఆ స్థలంలోకి ఎవరూ వెళ్లరాదని బైండోవర్ చేసినా అవేమి పట్టించుకోకుండా నిర్మాణాలు చేస్తున్నారని తెలిపారు. తమకు న్యాయం చేసి ఆదుకోవాలని నినాదాలు చేశారు. గ్రీవెన్స్‌సెల్‌లో ఒక్కసారిగా అరుపులు, కేకలు హోరెత్తడంతో పోలీసులు జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పోలీసులు వారితో మాట్లాడి శాంతింపజేశారు.

అర్జీదారులకు ఉచితంగా రాగి జావా



గ్రీవెన్స్‌సెల్‌కు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజానీకానికి జిల్లాకలెక్టర్ ఆదేశాల మేరకు డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఉచితంగా రాగి జావను అందజేశారు. మధ్యాహ్న సమయంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు రాగిజావాతో మంచినీటిని కూడా అక్కడ ఏర్పాటు చేశారు.

దివ్యాంగులకు బాసటగా....



వివిధ సమస్యల పరిష్కారానికి వచ్చే దివ్యాంగులకు బాసటగా సంతనూతలపాడు మండలం మంగమూరుకుచెందిన దివ్యాంగుడు ఎస్‌కే సంథాని నిలిచారు. గ్రీవెన్స్ సెల్ వద్దకు వచ్చే దివ్యాంగులతో మాట్లాడి వారికి అవసరమైన అర్జీలను రాసి ఇవ్వడంతో పాటు వారిని కలెక్టర్ వద్దకు పంపే విధంగా తన వంతుసహకారానికి శ్రీకారంచుట్టారు. విద్యాసాగర్ ఫౌండేషన్‌లో అకౌంటెండెంట్‌గా పనిచేస్తున్న సంథాని సోమవారం రోజు సెలవు పెట్టుకొని తోటి దివ్యాంగులకు బాసటగా నిలిచారు.

వైభవంగా వేణుగోపాలస్వామి ప్రతిష్ఠోత్సవం




ఆలయంలో ప్రతిష్ఠించిన జీవధ్వజస్తంభం, శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి గొట్టిపాటి హర్షవర్ధన్, స్వామి శాంతి కల్యాణంలో క్రతువు నిర్వహిస్తున్న దంపతులు

గోవింద నామ స్మరణతో పులకించిన కొండమంజులూరు

కల్యాణాన్ని తిలకించి తరించిన భక్తజనం

పంగులూరు, డిసెంబరు, 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండమంజులూరు గ్రామంలో వేణుగోపాలస్వామి ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవం వైభవోపేతంగా జరిగింది. ఈ మహోత్సవాన్ని తిలకించేందుకు గ్రామంతోపాటు పరిసర ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో గ్రామం కిక్కిరిసింది. భక్తుల గోవింద నామంతో హోరెత్తింది. నిర్ణీత దివ్య ముహూర్తంలో ప్రముఖ వేద పండితులు రొంపిచర్ల వెంకట సత్యనారాయణాచార్యులు వారి పరివారంతో ఆలయ మూలవిరాట్ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి, ద్వారపాలకులు, విమాన శిఖర కలశ, జీవధ్వజ పీఠారోహణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. గాలి గోపురం, కలశ ప్రతిష్ఠాపనతో శోభను సంతరించుకున్న వేణుగోపాలస్వామి ఆలయాన్ని తిలకించిన భక్తులు భక్తి పారవశ్యంతో పూజలు చేశారు.

వేద మంత్రోచ్ఛరణతో స్వామి శాంతి కల్యాణం

దేవతామూర్తుల ప్రతిష్ఠాపన అనంతరం పీఠబంధనం, ప్రాతఃసవనం, వాస్తుశుద్ధి ప్రధాన హోమం, కలాన్యాసం, దృష్టికుంభం దేను దర్శనం, కుంభాభిషేకం, స్వామి దివ్య మంగళ విగ్రహ సందర్శనం, మహన్నివేదన, హారతి, ఆచార్యాది దక్షిణాదానం నిర్వహించి మహాపూర్ణాహుతిని గావించారు. అనంతరం రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి శాంతి కల్యాణ మహోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. శాంతి కల్యాణ మహోత్సవంలో 20 మంది సతీసమేతంగా పాల్గొని పూజలు చేశారు. వేదపండితులు వెంకట సత్యనారాయణాచార్యులు, వారి శిష్య బృందంతో పాటు అర్చక స్వాములు ప్రసాద్‌బాబు, శ్రీనివాస్, రాంబాబులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన హర్షవర్ధన్

ప్రతిష్ఠోత్సవంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తనయుడు హర్షవర్ధన్ స్వామి ఆలయ పునర్ నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఈవో కోటిరెడ్డితో పాటు చింతల సహదేవుడు, బత్తుల వెంకటరావు, రావుల బాపయ్య, కల్లూరి కోటేశ్వరరావు, బొప్పుడి నాగేశ్వరరావు, దొప్పలపూడి వీరయ్య, పలువురు స్థానిక నేతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కుక్కపల్లి ఏడుకొండలు, మస్తాన్‌వలి, ఓబుల్‌రెడ్డి, గుర్రం ఆదిశేఖర్, రావూరి రమేష్, భానుప్రకాష్ అశోక్, ఏఎంసీ మాజీ చైర్మన్ వైవీ భద్రారెడ్డి, జంపని రవిబాబు, పానెం నరసింహారెడ్డి, మన్నె రామారావు, రాజేష్, హరిబాబు పాల్గొన్నారు.

భారీ అన్నదానం

ప్రతిష్ఠోత్సవానికి గ్రామస్థులతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, బంధువులు, స్నేహితులు వేలాదిగా తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీవారు భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

వైసీపీ నిర్లక్ష్యం.. జనానికి శాపం

(5వ పేజీ తరువాయి)

ఇచ్చింది. ఈ పథకాన్ని పలు రాష్ట్రాలు సద్వినియోగం చేసుకోగా.. రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసింది. వాటా నిధులు ఇవ్వకపోవడంతో చాలావరకు పనులు ముందుకు సాగలేదు. దీంతో కాంట్రాక్టర్లు చేతులేత్తేశారు.

16శాతం మాత్రమే పూర్తి

అప్పట్లో జిల్లాకు జలజీవన్ మిషన్ కింద రూ.696.77 కోట్లతో 2,571 పనులను మంజూరు చేశారు. అత్యధిక గ్రామాల్లో భూగర్భ జలాలు, కొన్నిచోట్ల ఇతర వనరుల ఆధారంగా ప్రతిపాదించారు. అయితే 2019-24 మధ్య కాలంలో ఈ పనులు పూర్తిచేయాల్సి ఉండగా కేవలం రూ.110.39 కోట్లు విలువైన 1,103 పనులు మాత్రమే చేశారు. అంటే మంజూరుచేసిన పనుల విలువలో కేవలం 16శాతంలోపు మాత్రమే పూర్తయ్యాయి. మరో 294 పనులు వివిధ దశల్లో ఉండగా వాటి విలువ రూ.200 కోట్ల వరకు ఉన్నట్లు అంచనా. అంటే తక్కువ వ్యయం చేసే పనులు మాత్రమే పూర్తిచేశారని స్పష్టమవుతోంది. కాగా 291 పనులకు టెండర్లు ఖరారు చేసినా పనులు చేపట్టకపోగా మరో 883 పనుల విషయం అసలు పట్టించుకోలేదు.

రద్దుచేస్తే నిధులతోపాటు గడువు పెంచవచ్చు

ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జలజీవన్ మిషన్ పనులపై సీఎం స్థాయిలో సమీక్ష చేయగా అత్యధిక శాతం పనులు చేయకుండానే పథకం కాలం ఐదేళ్లు పూర్తయింది. దీంతో కేంద్రప్రభుత్వాన్ని మరికొంత గడువు కోరగా వచ్చే ఏడాది వరకు సమయం పెంచింది. అది కూడా సరిపోదని 2027 వరకు గడువు పెంచాలని కేంద్రాన్ని కోరుతూ రాష్ట్రప్రభుత్వం లేఖ రాసింది. ఈలోపు రాష్ట్రంలో జేజేఎం పనులు ముందుకు సాగక పోవడానికి కారణాలను పరిశీలించింది. కొత్త పనులను ప్రతిపాదిస్తే కేంద్రం నుంచి తాజా అంచనాల ప్రకారం నిధులు, సమయం కూడా వచ్చే అవకాశం ఉన్నట్లు తెలిసింది. దీంతో అందుకు వీలుగా వైసీపీ ప్రభుత్వ కాలంలో జేజేఎం కింద మంజూరైన ప్రారంభంకాని పనులను అలాగే 25శాతంలోపు మాత్రమే జరిగిన పనులను రద్దు చేయాలని నిర్ణయించింది. ఆ మేరకు ప్రభుత్వ ఉత్తర్వులు ఇచ్చింది.

గొట్టిపడియ వద్ద అసంపూర్తిగా ఉన్న వాటర్ ఇన్‌టేక్ పనులు


పనులు చేయని కాంట్రాక్టర్లు

వాస్తవానికి ఎంవీఎస్ పథకాన్ని 2014-19 మధ్య టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు కనిగిరితోపాటు మరో రెండు నియోజకవర్గాలకు కలిపి వెలిగొండ నీరు ఆధారంగా ప్రతిపాదనలు తయారయ్యాయి. అప్పట్లో రూ.వెయ్యి కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. నాటి పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా ఉన్న నారా లోకేష్ శంకుస్థాపన కూడా చేశారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ పథకాన్ని రద్దుచేసి నాలుగు నియోజకవర్గాలకు కలిపి రూ.1,290 కోట్లతో తిరిగి మంజూరు చేశారు. టెండర్లను కూడా పిలిచి తమకు అనుకూలురైన కాంట్రాక్టర్లకు కట్టబెట్టినా కూడా పనులు చేయలేదు. దీంతో ప్రస్తుతం కూటమి ప్రభుత్వం జేజేఎం పనులతోపాటు ఈ పథకం టెండర్లను కూడా రద్దుచేసింది. కాగా జేజేఎం పనులతోపాటు ఈ పథకాన్ని మరింత విస్తరించి కందుకూరు, కొండపి నియోజకవర్గాల్లోని కొన్ని ప్రాంతాలను కూడా కలిపి సరికొత్త ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా అధికారులను ప్రభుత్వం ఆదేశించింది.

ఆంధ్రకేసరి వర్సిటీ ఖోఖో జట్టు ఎంపిక

అవీఇవీ


ఎంపిక చేసిన ఆంధ్రకేసరి యూనివర్సిటీ పురుషుల ఖోఖో జట్టు

పంగులూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రకేసరి యూనివర్సిటీ పురుషుల ఖోఖో జట్టు ఎంపిక సోమవారం పంగులూరులో జరిగింది. ఈ ఎంపికకు ఉమ్మడి జిల్లాలోని డిగ్రీ కళాశాలలు, బీపీఈడీ కళాశాలల నుంచి 50 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఇంకొల్లు డీసీఆర్ఎం డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ సహకారంతో నిర్వహించిన ఎంపికకు ఆంధ్రకేసరి యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఐ.దేవీవరప్రసాద్ పరిశీలకులుగా వ్యవహరించారు. జట్టు ఎంపిక డాక్టర్ జి.సాయిసురేష్ డీసీఆర్ఎం డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ చిలుకూరి శ్రీధర్, ఎస్ఆర్ఆర్ అకాడమీ డైరెక్టర్, ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సీతారామిరెడ్డి పర్యవేక్షణలో జరిగింది.

ఎంపికయిన క్రీడాకారులు

ఆంధ్రకేసరి వర్సిటీ పురుషుల ఖోఖో జట్టుకు ఎంపికైన వారి వివరాలను డాక్టర్ జి.సాయిసురేష్ ప్రకటించారు. జీవీఎన్ శివ, షేక్ అహమ్మద్, ఎ.వీరాంజనేయులు, కె.రామ్మోహన్, యు.గణేష్(వివేకానంద బీపీఈడీ కళాశాల పొదిలి), బి.లక్ష్మీనారాయణ(సిద్ధమూర్తి బీపీఈడీ, సింగరాయకొండ), పి.గోపి, ఎం.ప్రసాద్, వై.సుధీర్, కె.వెంకటేశ్వర్లు, ఎస్.షాలెంరాజు, జె.నవీన్, ఐ.ఏలియా, వి.సిద్ధుప్రసాద్, ఎం.మంత్రూనాయక్ (డీసీఆర్ఎం డిగ్రీ కళాశాల ఇంకొల్లు) ఎంపికయ్యారు. ఈ జట్టు ఈ నెల 27 నుంచి 31 వరకు తమిళనాడులోని తిరువయ్యూర్‌లో జరిగే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఖోఖో పోటీలలో పాల్గొంటారని చెప్పారు. వర్సిటీ ఏర్పాటు చేసిన తరువాత తొలిసారిగా క్రీడా జట్టును పోటీలకు పంపుతున్న వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబులకు క్రీడాకారులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ స్థలం స్వాధీనం


ప్రభుత్వ స్థలంలో ఉన్న కంచెను తొలగించి స్వాధీనం చేసుకుంటున్న తహసీల్దార్

మార్కాపురంరూరల్, డిసెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోగులదిన్నె గ్రామంలో సోమవారం రెవెన్యూ సదస్సు తహసీల్దార్ చిరంజీవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థుల నుంచి పలు వినతులను స్వీకరించారు. గ్రామంలోని సర్వేనంబరు 71-4లో ఎకరాలు 1.89 సెంట్ల ప్రభుత్వ భూమిని, 53-2 సర్వేనంబరులో ఎకరాలు 2.80 సెంట్ల భూమిని అక్రమంగా మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎనిబెర కృపానందంలు ఆక్రమించినట్లుగా వచ్చిన ఫిర్యాదును పరిశీలించారు. క్షేత్రస్థాయిలో భూమిని పరిశీలించి ఆ భూమిలో అక్రమంగా వేసిన కంచెను ఎక్స్‌కవేటర్‌తో తొలగించి స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ప్రభుత్వ భూములు అక్రమంగా ఆక్రమణలు చేసుకున్న వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఓవరాల్ చాంపియన్ 'ప్రకాశం'

రాష్ట్రస్థాయి క్యారమ్స్ పోటీల్లో జిల్లా విద్యార్థుల సత్తా


క్యారమ్స్ ఆడుతున్న క్రీడాకారులు

సింగరాయకొండ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సింగరాయకొండ మండలంలోని పాకల జడ్పీ హైస్కూల్‌లో హోరాహోరీ జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-14, 17, 19 బాలబాలికల రాష్ట్రస్థాయి క్యారమ్స్ పోటీల్లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. ఓవరాల్ చాంపిన్‌షిప్‌ను సాధించారు. అండర్-14 బాలుర విభాగంలో వి.జీవన్‌కుమార్ (ప్రకాశం), జి.రాజేష్ (ప్రకాశం), జె.నిషాల్ (విశాఖ), పి.నరసింహ (కడప), బాలికల విభాగంలో కె.సోని (ప్రకాశం), ఎస్.హేమశ్రీ (గుంటూరు), బి.వెంకటేశ్వరమ్మ (ప్రకాశం), ఐ.మృదు (విశాఖ) ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ స్థానాల్లో నిలిచారు. అండర్-17 విభాగంలో కె.చందు (ప్రకాశం), కె.సిద్ధు (ప్రకాశం), కె.వెంకటసాయికుమార్ (ప్రకాశం), సిహెచ్.స్టీఫెన్ పాల్ (గుంటూరు), బాలికల విభాగంలో టి.గంగోత్రి (ప్రకాశం), ఎస్కే. మెబీరా (ప్రకాశం), ఎస్కే. గఫ్రీనా (నెల్లూరు), కె.అగన్య (ప్రకాశం) వరుస స్థానాలను కైవసం చేసుకున్నారు. అండర్-19 విభాగంలో ఎస్.కె. మస్తాన్ (ప్రకాశం), పి.పవన్‌కుమార్ (ప్రకాశం). టి.అశోక్ (ప్రకాశం), బి.యోను (గుంటూరు) బాలికల విభాగంలో ఎస్.ప్రియదర్శిని, (విశాఖ), కె.హరిత (నెల్లూరు), జె.ధారిక (విశాఖ), ఇ.మహి (నెల్లూరు) ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ స్థానాలను సాధించారు. మూడు విభాగాల్లో జిల్లాకు చెందిన 13 మంది విద్యార్థులు మొదటి నాలుగు స్థానాల్లో నిలిచి ఓవరాల్ చాంపియన్‌లుగా నిలిచారు. విజేతలైన విద్యార్థులకు హెచ్ఎం డీవీఎస్ ప్రసాద్, జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ ఎండీ హజీరా బేగం, వ్యాయామ ఉపాధ్యాయులు మెడల్స్‌ను అందజేశారు.

భాష్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు

టంగుటూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : టంగుటూరులోని భాష్యం హైస్కూల్‌లో సెమీక్రిస్మస్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. దైవ సేవకుడు షోహా కేక్ కట్ చేసి విద్యార్థులందరికీ పంచారు. అనంతరం దైవసందేశం ఇచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

ఆస్తులున్నా అమ్ముకోలేరు!

(5వ పేజీ తరువాయి)

వేణుగోపాలస్వామి, రామలింగేశ్వరస్వామి దేవాలయాలు కేవలం 40 సెంట్ల స్థలంలో ఒకే ప్రాంగణంలో నిర్మితమై ఉన్నాయి. అయితే దేవదాయ శాఖ అధికారులు అప్పట్లో ఆ దేవాలయాలు విస్తరించిన ఉన్న స్థలాన్ని సబ్ డివిజన్ చేయించుకోకుండా మీభూమి గ్రామసభలో 545 సర్వే నంబర్ మొత్తాన్ని తమ శాఖకు చెందినట్లుగా నమోదు చేయించుకున్నారు. దీంతో రిజిస్ట్రేషన్‌లు ఆగిపోయాయి. దశాబ్దకాలంగా గ్రామంలోని స్థలాలు, గృహాల క్రయవిక్రయాలు నిలిచిపోయాయి. స్థానిక బీసీ కాలనీకి చెందిన ఓమహిళ తీవ్రఅనారోగ్యానికి గురై ఇల్లు అమ్ముకోవాలని ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోవడంతో చికిత్స చేయించుకోలేక ప్రాణాలు కోల్పోయింది. ఇది మచ్చుకు ఉదాహరణ మాత్రమే. ఇలాంటి వారు మరికొంత మంది ఉన్నారు. చాలా మంది సదరు సర్వేంబర్‌తో సబంధం లేకుండా ఆస్తి హద్దులు చూపిస్తూ వేరే సర్వే నంబర్‌తో రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్నారు.

రెవెన్యూ సదస్సుల్లోనైనా సమస్య పరిష్కరించాలని వేడుకోలు

సమస్యపై ఇప్పటికే అనేక సార్లు అటు రెవెన్యూ, ఇటు దేవదాయశాఖ అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రెవెన్యూ సదస్సులు జరుగుతున్న తరుణంలో దేవదాయశాఖ అధికారులు చేసిన తప్పును సరిదిద్దాలని వేడుకొంటున్నారు. సబ్‌డివిజన్ చేసి దేవాలయాలను విడగొట్టి నిషేధిత జాబితా నుంచి గ్రామాన్ని తొలగించాలని కోరుతున్నారు. ఈసారి రెవెన్యూ సదస్సుల్లో పరిష్కారం చూపకపోతే ప్రత్యక్ష ఆందోళనకు దిగేందుకు కూడా వెనుకాడబోమని హెచ్చరిస్తున్నారు.

క్రిస్మస్ కాంతులు

- విద్యుత్ వెలుగులు విరజిమ్ముతున్న చర్చిలు
- రేపు ప్రత్యేక ప్రార్థనల ఏర్పాట్లలో నిర్వాహకులు
- సేవా కార్యక్రమాల్లో చారిత్రాత్మక మందిరాలు
- మొదలైన పండుగ సందడి

ప్రేమ, త్యాగానికి ప్రతిరూపం క్రిస్మస్. నెల రోజుల ముందు నుంచే క్రైస్తవులు ఆనందంగా జరుపుకునే అతి పెద్ద పండుగ ఇది. వందేళ్లకుపైగా చరిత్ర కలిగిన చర్చిలు, ఇతర క్రైస్తవ మందిరాలు సుందరంగా ముస్తాబవుతాయి. ఈనెల 25న క్రిస్మస్ సందర్భంగా రెండ్రోజుల ముందే చర్చిలన్నీ రంగురంగుల విద్యుత్ దీపాలతో కాంతులీనుతున్నాయి. అందమైన నక్షత్రాలు, ఆకుపచ్చని చెట్లు రూపంలో విద్యుత్ కాంతులు వెదజల్లుతున్నాయి. జిల్లాలోని ఒంగోలు జువెట్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చి, మిషన్ కాంపౌండ్‌లోని క్లౌ మెమోరియల్ చర్చి, కనిగిరి దుర్గం బాప్టిస్ట్ చర్చి, మార్కాపురం తెలుగు బాప్టిస్ట్ చర్చి, పొదిలి సెంటినరీ బాప్టిస్ట్ చర్చిలతోపాటు, ఆర్‌సీఎం చర్చీలు, పెంతెకోస్తు, పలు క్రైస్తవ చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు జరగనున్నాయి.

- ఒంగోలు, కార్పొరేషన్/అద్దంకి/కనిగిరి/మార్కాపురం/దొనకొండ/ పొదిలి/చీరాల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి)



కనిగిరి దుర్గం చర్చి వందేళ్ల వైభవం..

పీసీపల్లి మండలం తలకొండపాడుకు చెందిన యర్రగుంట్ల పేరయ్య కనిగిరి దుర్గం బాప్టిస్ట్ చర్చి నిర్మాణంలో ప్రధాన పాత్ర పోషించారు. 1892లో రెవరెండ్ డాక్టర్ జీహెచ్ బ్రాక్ దొర సహకారంతో ఈ చర్చిని నిర్మించారు. చర్చి శత వార్షికోత్సవాలను 1992లో నిర్వహించారు. ప్రతి సంవత్సరం క్రిస్మస్ పర్వదినం పురస్కరించుకొని ప్రార్థనలు, ఆట, పాట, సాంస్కృతిక కార్యక్రమాలను వేడుకగా జరుపుతారు.



కబాడీపాలెంలో నక్షత్రాల ఆకారంలో విద్యుత్ వెలుగులు

ఒంగోలు జేఎంబీ చర్చి ఎంతో ప్రత్యేకం

వందేళ్లకుపైగా చరిత్ర కలిగిన ఒంగోలు జువెట్ మెమోరియల్ బాప్టిస్టు చర్చి చరిత్ర ఎంతో ప్రత్యేకమైనది. విదేశీ మిషనరీల సేవకు చెరగని ముద్రగా నిలుస్తోంది. నెల్లూరు లోన్ స్టార్ చర్చీ కేంద్రంగా 1854 జనవరి 1వ తేదీన జేఎంబీ చర్చి ఆవిర్భవించింది. ప్రతి ఆదివారం పదివేలకుపైగా క్రైస్తవ పరిజనులు ప్రార్థనలో పాల్గొంటారు. కేవలం ఆదివారపు ఆరాధనలు మాత్రమే కాకుండా విలేజ్ మినిస్ట్రీ, ఉచిత వైద్య సేవలు, వృద్ధుల పరిచర్య, ఉద్యోగులకు ఇంగ్లీషు ఆరాధనలు నిర్వహిస్తూ జేఎంబీ చర్చి... బాప్టిస్టు చర్చిలలోనే అతి పెద్దదిగా గుర్తింపు పొందింది. ఈ చర్చిలో క్రిస్మస్ ఆరాధనలు పండుగకు నెల రోజుల ముందు నుంచే ప్రారంభం అయ్యాయి. బుధవారం జరగనున్న క్రిస్మస్ వేడుకలకు సర్వం సిద్ధమైంది.



సేవా కార్యక్రమాల్లో క్లౌ మెమోరియల్ బాప్టిస్టు చర్చి

ఒంగోలులోని పాత రిమ్స్ వెనుకవైపునున్న క్లౌ మెమోరియల్ బాప్టిస్టు చర్చి నాటి మిషన్ ఆసుపత్రిలో ఒక భాగం. అక్కడ పేద రోగులకు వైద్య సేవలు అందించేవారు. వైద్యులు ప్రత్యేకంగా ప్రార్థనలు చేసుకునేందుకు ఏర్పాటు చేసుకున్నదే ఈ చర్చి. ఆసుపత్రి మూతపడిన తర్వాత చర్చి పైకప్పు మరమ్మతులు చేయించి, క్లౌ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చిగా నామకరణం చేశారు. 1966 నుంచి ఇక్కడ ప్రతి ఆదివారం ఆరాధనలతోపాటు, చర్చి వార్షికోత్సవాలు, ఈస్టర్ పండుగలు, ప్రత్యేక సువార్త మహోత్సవాలు జరిపిస్తుంటారు. ఈ సంఘం ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేశారు. వెయ్యి మందికిపైగా ప్రార్థనల్లో పాల్గొంటున్నారు.





మార్కాపురం తెలుగు బాప్టిస్టు చర్చి

మార్కాపురం ఏబీఎం చర్చి ద్వారా సేవలు

మార్కాపురంలోని పురాతన చర్చీలలో ఏబీఎం చర్చీ ప్రత్యేక గుర్తింపు పొందింది. తర్లుపాడు రోడ్డులోని ఏబీఎం స్కూలు ఆవరణలో 115 సంవత్సరాల క్రితం దీనిని నిర్మించారు. ఈ చర్చి ద్వారా ఉచిత విద్య, ఆరోగ్య సేవలు, ప్రతి ఆదివారం ఆరాధనలు, పండుగ రోజుల్లో, వేసవి రోజుల్లో ప్రార్థనలు నిర్వహిస్తుంటారు. ఈ చర్చిలోనూ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిపేందుకు ఆలయ నిర్వాహకులు, సంఘ కాపరులు, పెద్దలు సంయుక్త నిర్వహణలో ముస్తాబు చేస్తున్నారు. బాప్టిస్టునగర్‌లోని చర్చిని అందంగా ముస్తాబు చేశారు.



ప్రధాన నడిబొడ్డులో దర్శనమిస్తున్న ఏబీఎం చర్చి

చరిత్రకు సాక్ష్యం దొనకొండ చర్చి

- దొనకొండ పట్టణ నడిబొడ్డులోని బెతేలు తెలుగు బాప్టిస్ట్ చర్చి 1932 సంవత్సరంలో నిర్మించారు. పేదలకు సాయం చేస్తూ, విద్యార్థులకు బోధనలు, నిరుద్యోగులకు, మహిళలకు చేతివృత్తుల్లో శిక్షణ ఇస్తుంటారు.
- బెల్ టవర్ బ్రిటీష్ దొరలు అమెరికా నుంచి భారతదేశానికి తరలించిన ఐదు ప్రత్యేక గంటలలో ఒకటి దొనకొండలో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం సంఘస్తులు బెల్‌టవర్ చర్చిని మరింత అభివృద్ధి చేశారు. అందులో క్రిష్టియన్ లైబ్రరీ గది, గడియారంలో సూచించే ప్రతి గంటకు కాలాన్ని తెలుపుతూ ఏసుక్రీస్తు బోధనలు ప్రజలు తెలుసుకొని ఆచరించేలా గంట గంటకు దేవుడి వాక్యం వినిపించేలా ఏర్పాటు చేశారు.
- దొనకొండలో ఆర్‌సీఎం సంఘం నేతృత్వంలో నిర్వహిస్తున్న పునీత అంథోనివారి చర్చి నూరు వసంతాలు పూర్తి చేసుకుంది. చర్చి ఆవరణలోని ఒక చిన్నకొండపై మేరీమాత దర్శనమిస్తుండటంతో ప్రతిరోజూ భక్తులు మేరిమాత ఆశీస్సులు, ప్రహరీ వద్ద ఏర్పాటు చేసిన అంథోనివారి విగ్రహం వద్ద భక్తుల దీవెనల కోసం ప్రార్థనలు చేస్తుంటారు.



జిల్లాలోని అతిపురాతన చర్చిలలో పొదిలి తెలుగు బాప్టిస్టు చర్చి ఒకటని సంఘపెద్దలు చెబుతున్నారు. 1894వ సంవత్సరంలో ఏర్పాటు చేసినట్లు సంఘస్తులు వివరిస్తున్నారు. బుధవారం జరగనున్న క్రిస్మస్ వేడుకల సందర్భంగా ఈ చర్చిని విద్యుత్ దీపాలతో అలంకరించారు.



అద్దంకి పట్టణంలోని పసుమర్తి పాలెంలో 113 సంవత్సరాల నాటి డాక్టర్ క్లౌ మెమోరియల్ సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ టౌన్ చర్చి ఉంది. కాలక్రమేణా పసుమర్తిపాలెం చర్చి మంచి ప్రాచుర్యం పొంది అద్దంకి ప్రాంతంలో అతి పురాతన చర్చిగా మారింది. వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా భారీగా కార్యక్రమాలు నిర్వహించారు. అప్పటి నుంచి డాక్టర్ క్లౌ మెమోరియల్ సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ టౌన్ చర్చిగా మార్పు చేశారు.

ముస్తాబైన ప్రాచీనమైన చర్చిలు



సెయింట్ మార్క్స్ లూథరన్ చర్చి

క్రీస్తు పర్వదినం సందర్భంగా చీరాల పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లోని పలు ప్రాచీన చర్చిలు ముస్తాబయ్యాయి. క్రైస్తవుల ప్రధాన పండుగ కావడంతో ఇంటిల్లిపాదీ నూతన వస్త్రాలు, బంగారం కొనుగోళ్లతో మార్కెట్‌లు, దుకాణాలు రద్దీగా మారాయి. 109 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సెయింట్ మార్క్స్ లూథరన్ చర్చి, 70 సంవత్సరాలు పూర్తి చేసుకున్న బెరాకా చర్చి రంగురంగుల విద్యుత్ దీపాలతో కాంతులు విరజిమ్ముతున్నాయి.



కాప్సికం ఆకారంలో బొప్పాయి

మండలంలోని మిట్టమీదిపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు సోమయ్య ఇంటిలో కాసిన బొప్పాయి ఇది. కాప్సికం ఆకారంలో ఉండి చూపరులను ఆకటుకొంది. సోమయ్య తన పెరటిలో బొప్పాయి మొక్క వేయగా అది పెరిగి ఇటీవలే కాయలను అందిస్తోంది. విచిత్రంగా ఒక బొప్పాయి క్యాప్సికం ఆకారంలో ఉండటంతో గ్రామస్తులు ఆసక్తిగా తిలకించారు. సుమారు 3 కిలోల బరువుతో ఉంది.

- గిద్దలూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి)

పేద విద్యార్థులకు దుస్తుల పంపిణీ

పొదిలి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు దాతృత్వంతో ముందుకు వచ్చి 253 మంది నిరుపేద విద్యార్థులకు దుస్తులు అందజేశారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్ర మంలో ఎంఈవో శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని 69 పాఠశాలల నుంచి తల్లిగానీ, తండ్రిగానీ లేని 240 మంది విద్యార్థులకు, తల్లిదండ్రులు ఇద్దరు లేని 8 మంది విద్యార్థులకు ఒక దుస్తులు అందించినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు అవసరమైతే విద్యార్థులకు ఎలాంటి సాయం చేయడానికైనా వెనుకాడరని నిరూపించారన్నారు. 12 రోజుల్లో సుమారుగా రూ.1.50 లక్షల నగదును సేకరించి విద్యార్థులను దుకాణాలకు తీసుకెళ్లి వారికి నచ్చిన దుస్తులు అందించామన్నారు. ఎంఈవో ఆధ్వర్యంలో ఇంతటి మంచి కార్యక్రమానికి మావంతు కృషి చేయడం ఎంతో సంతోషంగా ఉందని తోటి ఉపాధ్యాయులు ఆనందం వెలిబుచ్చారు. మానవతా స్వచ్ఛందసేవ సంస్థ అధ్యక్షులు సామంతపూడి నాగేశ్వరరావు సొంత నిధులతో ఎనిమిది మంది విద్యార్థులకు దుప్పట్లు అందజేస్తానన్నారు. కార్యక్రమంలో సీడీపీవో సుధామారుతీ, బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్‌వీఎస్ కుమార్, యూటీఎఫ్ నాయకులు పిల్లి.రమణారెడ్డి, పెమ్మని బాలవెంకటేశ్వర్లు, పి వెంకటే శ్వర్లు, సత్యానారాయణరెడ్డి, యోగిరెడ్డి, మానవత నాయకులు కల్లం సుబ్బారెడ్డి, బండి అశోక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. పదవతరగతి చదువుతున్న విద్యార్థులకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఎస్ఎస్‌సీ మెటీరియల్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. నగరపంచాయతీ పరిధిలోని ఎస్టీకాలనీ ఎంపీపీ స్కూల్‌లో ప్రధానోపాధ్యాయునిగా పనిచేస్తున్న బుజ్జిబాబు పదిమంది విద్యార్థులకు ఎంఈవో శ్రీనివాసరెడ్డి చేతులమీదుగా దుస్తులు పంపిణీ చేశారు.



పేద విద్యార్థులకు దుస్తులు అందజేస్తున్న ఎంఈవో శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు

రూ.64 కోట్లతో 'బీసీ' రుణ ప్రణాళిక

వచ్చే నెలలో గ్రామ సభల ద్వారా లబ్ధిదారుల ఎంపిక

ఒంగోలు నగరం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ద్వారా రూ.64 కోట్లతో లబ్ధిదారులకు రుణాలు అందించనున్నారు. ఈ మేరకు కార్పొరేషన్ అధికారులు కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. లబ్ధిదారులకు అందజేసే రుణంలో 35 శాతం నుంచి 50 శాతం వరకు సబ్సిడీగా ఇవ్వనున్నారు. ఇందులో కొన్ని బ్యాంకు లింకేజీ రుణాలు కాగా మరి కొన్ని కార్పొరేషన్ నుంచి నేరుగా అందజేసే రుణాలు ఉన్నాయి. రూ.22.76 కోట్లతో బ్యాంకు లింకేజీ రుణాలు, రూ.18.80 కోట్లతో మినీ డెయిరీ యూనిట్లు, రూ.1.92 కోట్లతో జనరిక్‌మెడికల్ దుకాణాల ఏర్పాటుకు బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలను అందించనున్నారు. ఇవి కాక కేంద్ర ప్రభుత్వ నిధులతో ఎన్‌బీసీఎఫ్‌డీసీ పథకం కింద రూ.9.53 కోట్లతో కార్పొరేషన్ ద్వారా రవాణా వాహనాలు, ట్రాక్టర్లు, ఎలక్ట్రిక్ ఆటోలను అందజేయనున్నారు. జనవరి నెలలో గ్రామ సభల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. యూనిట్లతో పాటు టైలరింగ్, ఈవెంట్ మేనేజ్‌మెంటు, ఆసుపత్రి నిర్వహణ, కార్పెంటరీ విభాగాల్లో నిరుద్యోగులకు కార్పొరేషన్ ద్వారా శిక్షణ ఇవ్వనున్నారు.

రూ.33.81 కోట్లతో ఈడబ్ల్యూఎస్ వర్గాలకు రుణాలు

బీసీకార్పొరేషన్ ద్వారా ఈ సారి అగ్రవర్ణాల్లో, ఆర్థికంగా వెనుకబడిన కులాల్లోని నిరుద్యోగులకు విరివిగా రుణాలను అందజేయనున్నారు. రూ.33.81 కోట్లతో రుణాలను వివిధ యూనిట్ల కింద అందజేయనున్నారు. ఈబీసీ, రెడ్డి, కమ్మ, ఆర్య వైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ కులాల్లోని వెనుకబడిన వారిని గుర్తించి వారికి మినీ డెయిరీలు, జనరిక్ మెడికల్ దుకాణాలు, ఇతర స్వయం ఉపాధి యూనిట్లను అందించనున్నారు. ఈడబ్ల్యూఎస్ వర్గాల లబ్ధిదారుల ఎంపికకు జనవరిలో గ్రామ సభలను నిర్వహించనున్నారు.



మబ్బా మాగాణం సయ్యాట!

నీలాకాశంలో వెండి మబ్బులన్నీ చెట్టపట్టాలేసుకుని పరిగెడుతూ చల్లని కబురేదో మోసుకొస్తున్నట్టు, దాన్ని చూసి మాగాణమ్మ మౌనంగా పరవశిస్తున్నట్టు, ఆ మాగాణం మధ్యలో నుంచి మోర ఎత్తి మబ్బులవైపు చూస్తూ తాటిచెట్లు సుకుమారంగా పిలుస్తున్నట్టు కనిపిస్తున్న ఈ దృశ్యం చుపరులకు కనువిందు చేస్తోంది. ప్రకృతి పలికించిన ఈ అందాలు ఆ దారిన వెళ్లేవారికి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. (ఊళ్లపాలెం నుంచి పాకల వెళ్లే రోడ్డు పక్కన పొలాల్లోని దృశ్యమిది)

- సింగరాయకొండ (ఆంధ్రజ్యోతి)

అవీ..ఇవీ


నూతన మార్కెటింగ్ చట్టం కాపీలను దహనం చేస్తున్న నేతలు

నూతన మార్కెటింగ్ చట్టంపై నిరసన

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్రం లోని ఎన్‌డీఏ ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన మార్కెటింగ్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య డిమాండ్ చేశారు. జిల్లా రైతు సంఘాల సమన్వయ సమితి, కార్మిక, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట జరిగిన నిరసన కార్యక్రమానికి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జయంతిబాబు అధ్యక్షత వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వెంకయ్య మాటాడుతూ న్యాయమైన డిమాండ్ల కోసం పోరాడు తున్న రైతులు, వేదికలతో చర్చలు, రైతులతో సంప్రదింపులు చేయాలని సుప్రీంకోర్టు కోరినా పట్టించుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు పమిడి వెంకట్రావు, హనుమారెడ్డి, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, లలితకుమారి, కే సుబ్బారావు, ఎస్‌డీ సర్దార్, కంకణాల ఆంజనేయులు, చావలి సుధాకర్, జీవీకొండారెడ్డి, పేరయ్య, పిన్నిక శ్రీను, లెనిన్, చీకటి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కమిటీ నేతలు

మార్కాపురం మెడికల్ కళాశాల నిర్మాణాన్ని కొనసాగించాలి

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 23 (ఆంధ్రజోతి) : రాష్ట్ర ప్రభుత్వం రద్దుచేసిన మార్కాపురం మెడికల్ కళాశాల నిర్మాణాన్ని కొనసాగించాలని ఆ కళాశాల పరిరక్షణ కమిటీ నాయకులు కోరారు. సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్‌తమీమ్ అన్సారియాను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. మెడికల్ కళాశాలను రద్దు చేసి ప్రైవేటు భాగస్వామ్యంతో ఏర్పాటు చేయాలని చూస్తున్న కూటమి ప్రభుత్వ చర్యలను విరమించుకోవాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో కమిటీ కన్వీనర్ అందె నారసరయ్య, కో కన్వీనర్ డీకేఎం రఫీ, సభ్యులు వి. సుదర్శన్, జీవీకొండారెడ్డి, అబ్దుల్ రజాక్ తదితరులు ఉన్నారు.


పశుపోషకులకు అవగాహన కల్పిస్తున్న జేడీఏ బేబిరాణి

పశుగ్రాస పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

నాగులుప్పలపాడు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నూరు శాతం సబ్సిడీపై అందిస్తున్న పశుగ్రాస పథకాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని జేడీఏ బేబిరాణి సూచించారు. ఉప్పుగుండూరు గ్రామంలోని రైతులు, పశుపోషకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాడి పరిశ్రమపై రైతులు శ్రద్ధ చూపాలన్నారు. ప్రభుత్వం పాడి పరిశ్రమ అభివృద్ధికి అనేక విధాలుగా ప్రోత్సాహం కల్పిస్తున్నదని చెప్పారు. బహువార్షిక పశుగ్రాస విత్తనాలు సబ్సిడీపై ఉచితంగా అందిస్తామని, బోరు సౌకర్యం ఉన్న వారు సాగు చేసుకోవచ్చని వివరించారు. పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులు,తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో పశువైద్యులు జాస్మిన్ తదితరులు పాల్గొన్నారు.


స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

స్టడీ మెటీరియల్ పంపిణీ

సంతనూతలపాడు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం చీమకుర్తి రోటరీక్లబ్ సభ్యులు పదవతరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమానికి హెచ్ఎం డీవీఎల్ నరసింహారావు అధ్యక్షత వహించగా రోటరీక్లబ్ ఆఫ్ చీమకుర్తి అధ్యక్షుడు కడవ రామకృష్ణ, మాజీ సెక్రటరీ మన్నం నాగరాజు, సభ్యులు వెంకట్రావు, మూర్తి, సభ్యులు పాల్గొన్నారు.

రైతులు పంట మార్పిడి చేసుకోవాలి

సాగుచేసిన పంటలకు బీమా చేసుకోవాలి

రసాయనిక ఎరువులు తగ్గించాలి

జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు

ఒంగోలు(రూరల్)డిసెంబరు23(ఆంధ్రజ్యోతి): రైతులు పంట సాగులో మార్పులు చేసుకోవాలని, సాగు చేసిన పంటలకు బీమా చేయించుకోవాలని జిల్లావ్యవసాయశాఖ అధికారి ఎస్ .శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఒంగోలు నగరంలోని ఎన్‌జీరంగా భవన్‌లో సోమవారం చౌదరి చరణ్‌సింగ్ 122వ జయంతిని జాతీయరైతు దినోత్సవంగా రంగా భవన్ కమిటీ నిర్వహించింది. ఈకార్యక్రమంలో పాల్గొన్న జిల్లావ్యవసాయ శాఖ అధికారి మాట్లాడుతూ సాగు చేసిన పంటలకు బీమా చేయటం వలన విపత్తులు జరిగినప్పుడు పంటలకునష్టపరిహారం వస్తుందన్నారు. రైతులు రసాయనిక ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువులు వినియోగించుకోవాలన్నారు. చీడపీడల నివారణకు పెస్టిసైడ్లను శృతిమించి వాడొద్దని తెలిపారు. పంటలకు కావాల్సిన మోతాదులో మాత్రమే ఎరువులు,పురుగు మందులు ఉపయోగించాలన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్త జి.రమేష్ మాట్లాడుతూ శనగ పంటలో తుప్పతెగులు నివారణకు కాంటాఫ్ అరలీటరు మందును ఎకరానికి నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. మైక్రో ఇరిగేషన్ పీడీ వీవీ రమణ మాట్లాడుతూ డ్రిప్ ఇరిగేషన్‌కు ఎస్సీ,ఎస్టీ,సన్న,చిన్న కారు రైతులకు సబ్సిడీ 90శాతంతో పరికరాలు ఇస్తామన్నారు. కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల ద్వారా అర్జీలు పెట్టుకోవాలని కోరారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి వై .గోపీచంద్ మాట్లాడుతూ రైతులు తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందాలని, అవకాశం ఉన్న రైతులు మామిడి, సపోటా, జామలాంటివి సాగు చేసుకోవాలన్నారు. ముందుగా మాజీ ప్రధాని చౌదరి చరణ్ సింగ్ చిత్రపటానికి పూల మాలలువేసి ఘనంగా నివాళులు అర్పించారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న కొత్తపట్నంమండలానికి చెందిన పురాణి నాగమణిని శాలువాలతో సన్మానించి, ఐదువేలు రూపాయల చెక్కును అందజేశారు. జాతీయ రైతు దినోత్సవ కార్యక్రమానికి రంగాభవన్ ఉపాధ్యక్షుడు నాదెళ్ల చంద్రశేఖరరావు అధ్యక్షత వహించారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీఏ రమేష్‌బాబు, పొగాకు బోర్డు మాజీ ఆర్ఎం శ్రీనివాసనాయుడు, రంగా భవన్ ప్రధాన కార్యదర్శి చుంచు శేషయ్య, సభ్యులు మండవ రంగారావు, మండవ శ్రీనివాసరావు, బొడపాటి కోటేశ్వరరావు, గుండవరపు కోటేశ్వరరావు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.


ప్రకృతి వ్యవసాయం చేస్తున్న మహిళా రైతును సన్మానిస్తున్న రంగాభవన్ నాయకులు ,అధికారులు

సమష్టి కృషితో దర్శి అభివృద్ధి

- టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి
- దొనకొండలో పాస్టర్లకు దుస్తుల పంపిణీ

దొనకొండ, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రానున్న ప్రతి క్రిస్మస్ వేడుకలు దర్శి నియోజకవర్గ ప్రజలతో జరుపుకోవాలని ఆకాంక్షిస్తున్నానని టీడీపీ నియోజకవర్గ ఇన్ చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. దొనకొండలో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొనటం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. ఎర్రబాలెం టీడీపీ నాయకుడు మోడి ఆంజనేయులు మండలంలోని 120 మంది పాస్టర్లకు సమకూర్చిన దుస్తులను సోమవారం రాత్రి ఆమె పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతి క్రైస్తవ కుటుంబం సంతోషంగా జరుపుకునే పండుగ క్రిస్మస్ అని అన్నారు. యేసుక్రీస్తు ఆశీస్సులు, దీవెనలతో చల్లగా ఉం డాలని ఆకాంక్షించారు. దర్శి నియోజకవర్గ అభివృద్ధి కో సం అందరం కష్టపడదామన్నారు. దేవుడి శక్తి సామర్థ్యాలతో ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. అనంత రం మోడి ఆంజనేయులు ఏర్పాటుచేసిన భారీ క్రిస్మస్ కేకు కట్ చేశారు. పాస్టర్లకు కేకు, దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు, కొత్తం రఘునాథరెడ్డి, పులి మి రమణాయాదవ్, కామేపల్లి చెంచయ్య, వడ్లమూడి చెన్నయ్య, శృంగారపు నాగసుబ్బా రెడ్డి, వడ్లమూడి వెంకటాద్రి, డాక్టర్ మల్లికా ర్జున శర్మ, కొమ్మతోటి సుబ్బారావు, యగ్గోని యల్లారెడ్డి, కుందుర్తి లక్ష్మణ్, పోతిపోగు చెన్నయ్య, పత్తి వెంకటేశ్వర్లు, విప్పర్ల లక్ష్మీ రావు, తదితరులు పాల్గొన్నారు.


క్రిస్మస్ కేకు కట్ చేస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్, మాజీ ఎమ్మెల్యే పాపారావు

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

నాగులుప్పలపాడు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి బేబిరాణి సూచించారు. ఉప్పుగుండూరు గ్రామంలో సోమవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న రెవెన్యూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం సదస్సులు నిర్వహిస్తున్నదని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అర్జీల రూపంలో అందించాలని సూచించారు. వాటిని ఆన్‌లైన్ చేసి అర్జీదారులకు రశీదులను అందిస్తామన్నారు.ఆయా రెవెన్యూ సమస్యలను సూచించిన గడువులోగా పరిష్కారం చూపుతామన్నారు. కాగా సదస్సులో రెవెన్యూ సమస్యలపై 40 అర్జీలు రాగా తక్షణమే 5 పరిష్కరించినట్లు తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్ తెలిపారు

గ్రామకంఠం భూములను క్రమబద్ధీకరించాలి

ఉప్పుగుండూరు గ్రామంలోని సర్వే నంబరు 85 బై 1లోని 51.59 ఎకరాలు గ్రామకంఠం పరిధిలో ఉన్నాయని అధికారుల తప్పిదంతో ఆ భూములన్నీ దేవదాయశాఖ పరిధిలో ఉన్నందున తక్షణమే రికార్డులను క్రమబద్ధీకరించాలని రెవెన్యూ సదస్సులో మండల ప్రత్యేకాధికారి బేబిరాణి,తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్‌కు గ్రామస్థులు తూబాటి శ్రీకాంత్,పెంట్యాల కోటేశ్వరరావు, బసవపున్నయ్య, మాదాసు నాగేశ్వరరావు, కె.శ్రీను, బెల్లం మురళి తదితరులు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆర్ఐ రమేష్, సర్వేయరు రత్నాకర్, వీఆర్వోలు సుబ్బరామయ్యసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.


సదస్సులో అధికారులకు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్థులు

ప్రేమను పంచి సత్యాన్ని బోధించిన క్రీస్తు

సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్

నాగులుప్పలపాడు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): క్రీస్తు ప్రజలకు ప్రేమను పంచి సత్యాన్ని బోధించాడని సంతనూతలపాడు ఎంఎల్ఏ బీఎన్ విజయ్‌కుమార్ అన్నారు. అమ్మనబ్రోలు గ్రామంలోని షకీనా ప్రార్థనా మందిరం 12 వ వార్షికోత్సవం,సెమీక్రిస్మస్ వేడుకలను మందిరం వ్యవస్థాపకులు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తేళ్ల మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బీఎన్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు చూపిన ప్రేమ,దయాగుణాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని సూచించారు.సాటివారి పట్ల కరుణ, శాంతి, క్షమాగుణం కలిగి జీవించాలన్నారు. క్రీస్తు పుట్టుక సర్వమానవాళికి వెలుగును అందించేదన్నారు. క్రీస్తు బోధనలు అనుసరణీయమన్నారు. అనంతరం సెమీ క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు.కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్యచౌదరి, మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి కాకర్ల లక్ష్మీవరప్రసాద్, సీనియర్ నాయకులు గుమ్మడి సాయిబాబా, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.



సెమీ క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

ఆర్‌సీఎం చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలు

ఒంగోలు, కార్పొరేషన్ : స్థానిక నీలాయపాలెంలోని ఆర్‌సీఎం చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. నీలాయపాలెం యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ఫాదర్ డీఎస్ పాల్ ముఖ్య అతిథిగా హాజరై వాక్యోపదేశం చేసి, కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు ఆలపించిన క్రిస్మస్ గీతాలు అలరించాయి. అలాగే అంధ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తిరుపతి రెడ్డి, సీబీ మైఖేల్, కొండ్రు రవి, ఎలిజబెత్, రమేష్, తదితరులు పాల్గొని సంఘస్థులకు క్రిస్మస్ ప్రేమ విందును అందించారు.

అంబేడ్కర్ భవన్‌లో..

ఒంగోలు కలెక్టరేట్ : మాల సేవా సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ భవన్‌లో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ ఫౌండేషన్ చైర్మన్ జైభీం నాగేశ్వరరావు, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ వినయ్‌కుమార్‌లు మాట్లాడుతూ అందరూ అంబేడ్కర్ చెప్పిన మార్గంలో పయనిస్తూ సమాజంకోసం, జాతికోసం చైతన్యవంతులై నడవాలన్నారు. మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ క్రీస్తుబోధనల ప్రకారం సకల జీవులు సమానమేఅని అన్నారు. రెవరెండ్ డాక్టర్‌బొడ్డు రంగారావు, బూరుగు రత్నం, చప్పిడి దినకర్, అంబటి కొండలరావు, మాజీ సర్పంచ్ అంకారావు, దాసరి సుందరం తదితరులు మాట్లాడారు. అనంతరం పాస్టర్లను సత్కరించారు.

నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ

ఒంగోలు, కార్పొరేషన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ముస్లిం మైనార్టీ వెల్‌ఫేర్ ఎకనమికల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిరుపేదలకు, యాచకులకు దుప్పట్లు పంపిణీ చేశారు. సోమవారం రాత్రి నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్లపై నిస్సహాయంగా ఉన్న పేదలకు వారు దుప్పట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో సొసైటీ జిల్లా ప్రతినిధులు ఎండీ రఫీ, అధ్యక్షులు షేక్ ఖాదర్‌వలి, మండల అధ్యక్షులు షేక్ బాబు, నగర అధ్యక్షులు వలి, ఉపాధ్యక్షులు ఫరూక్, జిల్లా ప్రధాన కార్యదర్శి గౌస్ బాషా, పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అమిత్‌షాను భర్తరఫ్ చేయాలి

ఒంగోలు(క్రైం)డిసెంబరు23, (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి అమిత్‌షాను మంత్రివర్గం నుంచి భర్తరఫ్ చేయాలని డీసీసీ అధ్యక్షుడు షేక్ సైదా డిమాండ్ చేశారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక ప్రకాశం భవన్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. రాహుల్ గాంధీ పై అక్రమంగా బనాయించిన కేసులను ఎత్తివేయాలని కోరారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీపతి సతీష్, దాసరి రవి, మన్నం ప్రసన్నరాజు, గోరంట్ల కోటేశ్వరరావు, నాయబ్ రసూల్, తదితరులు పాల్గొన్నారు.


గ్రీవెన్స్‌లో ఫిర్యాదుదారుల అర్జీలను పరిశీలించి మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

బాతుల ఫారంలో భాగస్వాములను చేస్తానని మోసం

- ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితులు

ఒంగోలు(క్రైం)డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బాతుల ఫారంలో భాగస్వాములను చేసుకుంటానని చెప్పి మోసం చేసి బెదిరిస్తున్న ఉదతంపై బాధితులు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి 64 మంది తమ వినతులను ఎస్పీకి స్వయంగా విన్నవించారు. ఈ సందర్భంగా నాగులుప్పలపాడు మండలానికి చెందిన ఐదుగురు బాధితులు తమ గోడు ఎస్పీకి విన్నవించారు. బాతుల ఫారంలో తమను భాగస్వాములను చేసుకుంటానని ఓ వ్యక్తి నమ్మించి బ్యాంక్‌లో తమ పేరుతో వచ్చిన రూ. 18.10 లక్షలను కాజేసి మోసం చేశాడని తెలిపారు. మీరు తమ సంస్థలో బాగస్వాములు అనీ చెప్పి ఎలాంటి అగ్రిమెంట్ పేపర్లు ఇవ్వకుండా అడిగితే బెదిరిస్తున్నట్లు బాధితులు పేర్కొన్నారు. అదే విధంగా కొత్తపట్నంకు చెందిన ఓ వ్యక్తి ఏడాదిగా కిస్తీలు కట్టకుండా ఉన్న బజాజ్ పల్సర్ వాహనాన్ని తనకు విక్రయించి మోసం చేశాడని సంతనూతలపాడుకు చెందిన ఓ యువకుడు ఫిర్యాదు చేశాడు. ఆయా సమస్యలపై ఎస్పీ సంబంధిత అధికారులతో మాట్లాడారు. చట్ట పరిధిలో ఫిర్యాదులను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీఐలు ఎస్.శ్రీకాంత్ బాబు, సూర్యనారాయణ, పాండురంగారావు, ఎస్సైలు రజియా సుల్తానా, ప్రభాకరరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.



బాలోత్సవం కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

ఫిబ్రవరి 7,8 తేదీల్లో బాలోత్సవం

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : వచ్చే ఏడాది ఫిబ్రవరి 7,8తేదీల్లో ప్రకాశం బాలోత్సవం నిర్వహిస్తున్నట్లు కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బండారు లక్ష్మీనారాయణ, కే సుబ్రహ్మణ్యంలు తెలిపారు. స్థానిక పీవీఆర్‌బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం బాలోత్సవ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బాలోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్‌అబ్దుల్ హై అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అమరావతి బాలోత్సవం కార్యదర్శి ఎంవీ రామరాజు మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు, సెల్‌ఫోన్‌కి ఎడిక్ట్ కాకుండా చూడటానికి ఈ బాలోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత ఏడాది జిల్లాలో దాతలు, అధికారులు, హెచ్ఎంల సహకారంతో 48 అంశాలలో 4వేల మంది విద్యార్థులతో ఈ బాలోత్సవం నిర్వహించామన్నారు. ఈ ఏడాది కూడా అదే స్ఫూర్తితో నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ బాలోత్సవాలలో 55 అంశాలలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలకు జనవరి 8వతేదీ నాటికి ఎంట్రీఫాములు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డి. వీరాంజనేయులు, సీహెచ్‌వినోద్; బాలకోటయ్య, సీహెచ్ జయ ప్రకాష్, ఆర్. సురేష్, జి. ఉమామహేశ్వరి, సంధ్య, యు.భాస్కర్, దామా శ్రీనివాసులు, తిరుపతయ్య, డీఎల్ ప్రసాద్, జీవీ రామన్, జి. శేషయ్య, కాట్రగడ్డ నరసింహారావు, నారాయణ తదితరులు ఉన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

చీమకుర్తి,డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల వినియోగానికి దూరంగా ఉండాలని ఎక్సైజ్ సీఐ సుకన్య కోరారు.గంజాయి, తదితర మత్తు పదార్థాల వినియోగం వలన కలుగు నష్టాల గురించి అవగాహన కల్పిస్తూ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం మర్రిచెట్లపాలెంలో అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు.గంజాయి విక్రయాలు,రవాణా చేసేవారిపై కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. గ్రానైట్ కార్మికులు అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

మండల వీఆర్వోల సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాసులు

సంతనూతలపాడు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు మండల వీఆర్వోల సంఘం అధ్యక్షుడిగా ఎం.శ్రీనివాసులను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా మంగమూరు వీఆర్వో వినోద్‌కుమార్, కోశాధికారిగా చిలకపాడు వీఆర్వో హనుమంతరావు, ఉపాధ్యక్షులుగా పేర్నమిట్ట వీఆర్వో జాలయ్య, ఉపకార్యదర్శిగా గుర్వారెడ్డిపాలెం వీఆర్వో రామాంజనేయులు, ఈసీ మెంబర్లు మధు, డి.శ్రీనివాసులను ఎన్నుకున్నారు. ఎన్నిక కార్యక్రమాన్ని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రవికుమార్, జిల్లా ప్రధానకార్యదర్శి ఆదిరెడ్డి, జిల్లా సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి వెంకటస్వామి, వీఆర్వో వెన్నెల తదితరులు పర్యవేక్షించారు.

క్లస్టర్ సముదాయాల జాబితాల ప్రదర్శన

ఒంగోలు విద్య, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఏర్పాటు చేస్తున్న క్లస్టర్ సముదాయాల జాబితాలను ఉప విద్యాధికారి కార్యాలయాలు, మండల విద్యాధికారి కార్యాలయాల్లో ప్రదర్శనకు పెట్టినట్లు డీఈవో కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలోతెలిపారు. వీటిపై ఏమైనా అభ్యంతరాలు, సలహాలు ఉంటే ఈనెల 27వతేదీలోపు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో కానీ, మండల విద్యాధికారి కార్యాలయంలో తెలియజేయవచ్చని ఆయన తెలిపారు.

క్రైం సమాచారం

వ్యక్తిని కాపాడిన పోలీసులు

ఒంగోలు(క్రైం), డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రైలు కింద పడి ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని పోలీసులు కాపాడారు. సోమవారం రాత్రి చీమకుర్తికి చెందిన ఓ వ్యక్తి తన భార్య కాపురానికి రాలేదని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకొన్నాడు. అదే సమయంలో స్థానిక రైల్వే ట్రాక్‌పై నుంచి ఫోన్ చేసి తన కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. ఈమేరకు ఒంగోలు టూటౌన్ పోలీసులు అప్రమత్తం అయ్యారు. అతని ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా కొప్పోలు రైల్వే బ్రిడ్జి నుంచి 1/5 కిలోమీటరు వద్ద పోలీసులు గుర్తించారు. రక్షక్ మొబైల్‌లో ఉన్న హెడ్ కానిస్టేబుల్ పులి ఆంజనేయులు, సిబ్బంది ఆత్మహత్యకు యత్నం చేస్తున్న వ్యక్తిని నిలువరించారు. అతన్ని తీసుకొని ఒంగోలు టూటౌన్ సీఐ శ్రీనివాసరావు వద్ద హాజరు పరచగా కౌన్సెలింగ్ నిర్వహించి వారి బంధువులకు అప్పగిచారు. ఈ సందర్భంగా వ్యక్తి ప్రాణాలు కాపాడిన రక్షక్ సిబ్బందిని సీఐ అభినందించారు.

హెడ్‌కానిస్టేబుల్ ఆకస్మిక మృతి

ఒంగోలు(క్రైం),డిసెంబరు23(ఆంధ్రజ్యోతి): ఎస్పీ కంట్రోల్‌లో పనిచేసే హెడ్‌కానిస్టేబుల్ షేక్.మునీర్ బాషా (55) ఆకస్మికంగా మృతి చెందారు. స్థానిక ప్రకాశం కాలనీలో నివాసం ఉండే బాషా సోమవారం రాత్రి ఇంట్లో బాత్రూమ్‌కు వెళ్ళి ఒక్కసారిగా కుప్పకూలాడు. దీంతో కుటుంబ సభ్యులు గమనించి 108 వాహనంలో ఆసుపత్రికి తరలించగా అప్పటికే మునీర్ మృతి చెందాడని డాక్టర్లు చెప్పడంతో తిరిగి మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు.

క్రైం సమాచారం

కారు ఢీకొని ఒకరికి మృతి


ఘటన సమయంలో రోడ్డుపై పడిపోయిన మరియదాసు

కంభం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వేగంగా వస్తున్న కారు ఎదురుగా ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో వ్యక్తి మృతిచెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. కంభం ఆర్‌సీఎం చర్చిలో ఎం.మరియదాసు(45) ఫాదర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన కందులాపురంలో నివాసం ఉంటున్నాడు. ఆయన అక్కడి నుంచి మనోజ్‌కుమార్ అనే బాలుడితో కలిసి సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో కంభానికి వస్తున్నాడు. ఆ సమయంలో గుంటూరు వైపు వెళుతున్న కారు నియంత్రణ కోల్పోయి వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో మరియదాసు తలకు కుడికాలుకు బలమైన గాయాలయ్యాయి. వెనుక కూర్చున్న మనోజ్‌కుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. దీంతో మరియదాసును అంబులెన్స్‌లో కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి విషమిస్తుండడంతో మెరుగైన వైద్యం కోసం వినుకొండకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. బాలుడి స్వల్పగాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డాడు. ఆ మేరకు కంభం ఎస్సై నరసింహారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోవా మద్యం సీసాల సీజ్

● ఇద్దరు వ్యక్తుల అరెస్టు


పోలీసులు సీజ్ చేసిన గోవా మద్యం

కంభం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఏడాదికాలంగా గోవా నుంచి అక్రమంగా మద్యం సీసాలు తెచ్చి కంభం, బేస్తవారపేట, కొమరోలు మండలాల్లో విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.50వేల విలువైన 54 ఫుల్ మద్యంఫుల్ బాటిళ్లను సీజ్ చేసినట్లు కంభం ఎక్సైజ్ సీఐ కొండారెడ్డి తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు, కొమరోలుకు చెందిన డి.కిశోర్, డి.తిరుమలయ్యా సోమవారం ఉదయం బేస్తవారపేట మండలం మోక్షగుండం సమీపంలో స్కూటీపై వెళుతుండగా ఆపి వాహనాన్ని తనిఖీ చేశామన్నారు. వారి వద్ద 54 మద్యం సీసాలు లభించాయన్నారు. వెంటనే ఇరువురిని అదుపులోకి తీసుకుని విచారించగా తమది కొమరోలు మండలమని, కంభంలో ఓ వ్యక్తి తమకు ఏడాదికాలంగా గోవా నుంచి మద్యం సీసాలు తెచ్చి విక్రయిస్తాడని తెలిపారు. బాటిళ్లను, వాహనాన్ని సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు సీఐ కొండారెడ్డి తెలిపారు.

ట్రాక్టర్ కింద పడి వ్యక్తి మృతి

తర్లుపాడు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ ట్రక్కు కింద పడి వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని చెన్నారెడ్డిపల్లి, నాగెళ్లముడుపు సమీపంలో చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగెళ్లముడుపు గ్రామానికి చెందిన ముప్వా కొండయ్య(48) నలుగురు కూలీలతో కలిసి చిల్లకట్టెలు కొట్టుకొని ట్రాక్టర్‌లో సీతానాగులవరం తీసుకెళ్లి అమ్ముకొని తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో ట్రాక్టర్ డ్రైవర్ వెనుక ఉన్న చెక్కపై కొండయ్య కూర్చున్నారు. మిగతా కూలీలు ట్రక్కులో కూర్చున్నారు. చెన్నారెడిపల్లి-నాగెళ్లముడు సమీపంలో మూలమలుపు వద్ద కొండయ్యా చెక్కపై నుంచి కిందపడ్డాడు. దీంతో కొండయ్య మీదగా ట్రక్కు వెళ్లింది. 108 ద్వారా మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలిస్తున్న సమయంలో మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కొండయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు. ఎస్ఐ బ్రహ్మనాయుడు కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నారు.

క్రిస్మస్‌కు చర్చీల ముస్తాబు

● రంగు రంగుల విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరణ ● సెమీక్రిస్మస్ సందర్భంగా పలుచోట్ల సేవా కార్యక్రమాలు


ఎర్రగొండపాలెం మాచర్ల రోడ్డులోని పవిత్ర అపోస్తలుల దేవాలయం

మార్కాపురంవన్‌టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ సందర్భంగా మార్కాపురం పట్టణంలోని చర్చీలు క్రిస్మస్ శోభతో విద్యుత్ దీపాలంకరణలతో ఆకట్టుకుంటున్నాయి. పట్టణంలోని తెలుగు బాప్టిస్టు టౌన్‌చర్చి, లూథరన్ చర్చి, బాప్టిస్ట్ నగర్ చర్చి, సెంటినరీ బాప్టిస్ట్ చర్చి, హలేలుయా చర్చి, రైల్వేస్టేషన్ రోడ్డులోని ఆర్‌సీఎం చర్చి తదితర చర్చిలతో పాటు పట్టణంలోని 70 చర్చీలను ముస్తాబు చేశారు. విద్యుత్ దీపాలు, క్రిస్మస్ స్టార్‌లతో చర్చిలను అలంకరించారు. క్రిస్మస్ వేడుకలకు సర్వంసిద్ధం చేశారు. ఆయా చర్చీలలో నిత్య ప్రార్థనలు, బైబిల్ పఠనాలు నిర్వహిస్తున్నారు.

మార్కాపురం వన్‌టౌన్ : మార్కాపురం పట్టణంలోని పలు పాఠశాలలలో సెమీక్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వాసవి విద్యానికేతన్‌లో ప్రిన్సిపాల్, డైరెక్టర్ రంగయ్య, ఏవో రంజిత్ కుమారుల ఆధ్వర్యంలో క్రిస్మస్ సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు క్రీస్తుజననం, తదితర అంశాలు ప్రదర్శించారు. కమలా పాఠశాలలో చైర్మన్, కరస్పాండెంట్ పెనుగొండ పవన్‌కుమార్, అకడమిక్ డైరెక్టర్ సింధూజలు క్రిస్మస్ ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు నిర్వహించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. బాష్యం పాఠశాలలో ప్రిన్సిపాల్ నాగరాజు ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. సాయిబాలాజీ ఉన్నత పాఠశాలలో ప్రిన్సిపాల్ మస్తాన్‌వలి ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. జీఎంఆర్ పాఠశాలలో ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ జి.మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

దుస్తుల పంపిణీ

మార్కాపురం వన్‌టౌన్ : స్థానిక ఎస్ఎస్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం పాస్టర్‌లకు నూతన దుస్తులు పంపిణీ చేశారు. ట్రస్ట్ అధ్యక్షులు నాదెళ్ల సుబ్రహ్మణ్యం, నాదెళ్ల చంద్రమౌళీల ఆధ్వర్యంలో 100 మంది పాస్టర్లకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ కార్యాలయం మేనేజర్ పూసల గాలెయ్య, షేక్ ఖమర్ తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరు : రాచర్లలోని స్పందన విద్యాసంస్థల్లో సోమవారం సెమీక్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బెంగుళూరుకు చెందిన ఐఎల్ఎం సంస్థ పర్యవేక్షణలో విద్యార్థులతో ప్రదర్శించిన నృత్యాలు, గీతాలు అలరించాయి. క్రిస్మస్ పర్వదిన వేషధారణలు చేశారు. పాఠశాల కరస్పాండెంట్ పి.పరమేశ్వర్‌రెడ్డి, ఎండీ పి.సుధీర్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం రూరల్ : క్రిస్మస్ సందర్భంగా మండలవ్యాప్తంగా చర్చీలను అందంగా ముస్తాబు చేశారు. విద్యుత్ దీపాలతో ప్ర త్యేకంగా ఆలకరించారు. పట్టణం లోని పవిత్ర అపోస్తలుల దేవాలయం, లుథరన్ బాప్టిస్టు చర్చిలలో మంగళవారం రాత్రి నుంచి ప్రత్యేక పార్థనలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమరవారం తెలిపారు. అంబేద్కర్‌నగర్, ఇజ్రాయిల్‌పేట, ఇందిరా నగర్ కాలనీతో పాటు పలు కాలనీల వద్ద స్టాల్స్‌ను అందంగా ముస్తాబు చేసి ఏర్పాటు చేశారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు

కంభం : కంభం మండలం యర్రబాలెం గ్రామంలో టీడీపీ రాష్ట్ర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి గోన చెన్న కేశవులు ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి కేక్ కట్ చేశారు. పేదలకు అన్నదానం చేయడమే కాకుండా మహిళలకు దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కంభం మండల టీడీపీ అధ్యక్షులు తోట శ్రీనివాసులు, జడ్పిటిసి కొత్తపల్లి శ్రీనివాసులు, తోట శ్రీనివాసులు, కటికెల భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.






మార్కాపురంలోని ఎస్‌వీకేపీ కళాశాల రోడ్డులోని లూథరన్ చర్చ్, కంభం మండలం ఎర్రబాలెంలో మహిళలకు దుస్తుల పంపిణీ, వై.పాలెంలో విద్యుత్ వెలుగుల్లో చర్చ్, క్రిస్మస్ వేడుకల్లో మార్కాపురంలోని విద్యార్థులు

రెవెన్యూ సమస్యలు సరిచేసేందుకే సదస్సులు

ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి


అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి). గత వైసీపీ ప్రభుత్వంలో భూ రికార్డుల్లో జరిగిన తప్పులను పరిష్కరించేందుకే కూటమి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని గోగులదిన్నె గ్రామంలో సోమవారం తహసీల్దార్ కె చిరంజీవి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారా యణ రెడ్డి మాట్లాడుతూ, వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసినట్లుగా మాజీ సీఎం జగన్ ప్రారంభించి పశ్చిమ ప్రాంత ప్రజలను మోసం చేశారని అన్నారు. అందుకే గత ఎన్నికలలో వైసీపీకి ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పారని అన్నారు. ప్రాజెక్టు పూర్తి కావాలంటే రెండు వేల కోట్ల రూపాయలు అవసరవుతాయని ఇప్పటి నుంచి ప్రతి రోజు 24 గంటలు కష్టపడినా రెండున్నరేళ్ల పడుతుందన్నారు. గత ప్రభుత్వంలో వైసీపీ నాయకులు గోగులదిన్నె గ్రామంలో ఎస్సీలకు శ్మశానవాటిక స్థలాన్ని కూడా కేటాయించకుండా మభ్యపెట్టారన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో ఎస్సీలకు గ్రామంలో శ్మశాన వాటికస్థలాన్ని కెటాయిస్తామన్నారు. రెవెన్యూ సంబంధిత అధికారులు అందరూ మీ గ్రామానికే వచ్చి సమస్యలు వివరంగా తెలుసు కుంటామన్నారు. వీలైనంత వరకు అక్కడి క్కడే సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రజలు రెవెన్యూ సదస్సు లకు సద్వినియోగం చేసుకుని భూ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీటీ శ్రీనివాసులు, సర్వేయర్ సంజీవయ్య, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో జీవరత్నం, టీడీపీ నాయకులు జవ్వాజి రామాంజులరెడ్డి, కాకర్ల శ్రీనివాసులు, కాశిరెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, రాజయ్య, వీఆర్‌వో, సచివాలయ, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయునికి సన్మానం

గిద్దలూరుటౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొదలకొండపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ ఇటీవలే రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన డాక్టర్ మొర్రి పిచ్చయ్యను పలు సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. స్థానిక శాఖ గ్రంథాలయం ఆవరణలో పిచ్చయ్యను సన్మానించి అభినందించారు. విద్యార్థులకు విద్యను నేర్పడమే కాకుండా సొంత ట్రస్టు ద్వారా పేద విద్యార్థులకు పలుసేవా కార్యక్రమాలు నిర్వహించాడని కొనియాడారు కార్యక్రమంలో గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు జి.రవీంద్రనాథరెడ్డి, జేవీవీ నాయకులు స్వరూపారెడ్డి, పాతాళ నాగేశ్వరస్వామి ఆలయ మాజీచైర్మన్ ఎస్.అంజనేయులు, యోగాగురువు నారాయణరెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కాగా పొదలకొండపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మరో కార్యక్రమంలో అవార్డు గ్రహిత పిచ్చయ్యను డిప్యూటీ డీఈవో శ్యాముల్, హెచ్ఎం వరలక్ష్మమ్మ, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

గలిజేరుగుళ్లలో ఫ్రీజర్ బాక్స్ ఏర్పాటు

బేస్తవారపేట, డిసెంబరు23 (ఆంధ్రజ్యోతి): హెల్పింగ్ హార్ట్ సొసైటీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఫ్రీజర్ బాక్స్‌ను సమకూర్చారు. మండలంలోని గలిజేరుగుళ్ల పరిధిలోని దీన్ని అందుబాటులో ఉంచారు. గ్రామీణ ప్రాంతంలో మృతదేహాన్ని ఉంచేందుకు ఫ్రీజర్‌బాక్స్ కోసం పడుతున్న ఇబ్బందులను గుర్తించి ఫ్రీజర్‌ను సమకూర్చినట్లు తెలిపారు. దీనిని సోమవారం డాక్టర్ రమేష్ కుమార్ చేతుల మీదగా అందజేశారు. సొసైటీ అధ్యక్షులు ఎ.వెంకటరాయుడు మాట్లాడుతూ ఏ కుటుంబంలోనైనా, ప్రమాదవశాత్తు, మరణిస్తే బంధువుల చివరి చూపు కోసం పార్థీవదేహాన్ని భద్రపరచడానికి ఫ్రీజర్‌బాక్స్ ఏర్పాటు చేశామన్నారు.

రైతులు సాంకేతిక సేవలు అందిపుచ్చుకోవాలి


మాట్లాడుతున్న ఏడీఏ బాలాజీనాయక్

మార్కాపురంరూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రైతులు ప్రభుత్వం అందించే సాంకేతిక సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ బాలాజీనాయక్ సూచించారు. స్థానిక ఎస్సీ, బీసీ కాలనీలలోని డ్వాక్రా బజారులో సోమవారం మార్కాపురం డివిజన్, దొనకొండ మండల రైతుసేవా కేంద్రాల సిబ్బందికి 'ఫార్మర్.చాట్' యాప్ సేవలపై అవగాహన కల్పించారు. డిజిటల్ గ్రీన్ సంస్థ అభివృద్ధి చేసిన ఈ ఆన్‌లైన్ యాప్ వినియోగంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ యాప్ ద్వారా రైతులకు సకాలంలో మెరుగైన సమాచారాన్ని అందించవచ్చన్నారు. పంటల సాగు పద్ధతులు, వాతావరణ సమాచారం, మార్కెట్‌ధరల వివరాలను తెలుసుకోవచ్చన్నారు. పంటలకు సోకిన తెగులు వివరాలను పోటో పంపిస్తే పరిష్కారం రైతుల మొబైల్‌కే వస్తుందన్నారు. ఏఐ సహకారంతో రైతులు ఈ యాప్ ద్వారా పంటల సాగులో మరిన్ని మెళకువలను నేర్పించవచ్చన్నారు. కార్యక్రమంలో యాప్ సంస్థ ప్రతినిధి కమలాకర్, హెచ్‌వో రమేష్, శ్వేత, ఏవోలు లక్ష్మీనారాయణ, బుజ్జిబాయి, వెంకటేశ్వర్లు, చంద్ర శేఖర్, రైతు సేవాకేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

ఈ-మిర్చి 2.0పై అవగాహన

ఎర్రగొండపాలెం రూరల్, : ఈ-మిర్చి 2.0పై మండలంలోని రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని ఉద్యాన శాఖ అధికారి ఆదిరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని రైతుసేవా కేంద్రంలో మూడు మండలాల ఏవోలకు, సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ గ్రీన్ సంస్థతో ఈ-మిర్చి 2.0 అనే ప్రాజెక్టు జిల్లాలో చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఫార్మర్.చాట్ అనే అప్లికేషన్ ద్వారా రైతులకు పూర్తి సమాచారం సెల్‌లో వస్తుందన్నారు. ఈ చాట్ యాప్‌పై సిబ్బంది గ్రామాలలో రైతులకు అవగాహన కల్పించి వారి సెల్‌లో యాప్ డౌన్‌లోడ్ చేయాలని సూచించారు. తద్వారా పంటసాగులో మెళకువలు తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో డిజిటల్ గ్రీన్ సంస్థ మేనేజర్ కమలాకర్, దోర్నాల, పుల్లలచెరువు ఏవోలు జవహర్ లాల్‌నాయక్, ఎల్. మాల్యాదిరెడ్డి, వ్యవసాయ, ఉద్యానవన శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలపై విద్యుత్ భారాలు మోపొద్దు!

పామూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పేదలపై పెంచిన విద్యుత్ భారాలను వెంటనే రద్దు చేయాలని సీపీఎం నాయకుడు కె.శంకర్ పేర్కొన్నారు. లేనిపక్షంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని సీఎస్‌పురం రోడ్డు సెంటర్‌లో విద్యుత్ బిల్లులను దహనం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత మాట మారుస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సీహెచ్ వెంకటేశ్వర్లు, రబ్బాని, తిరుపతమ్మ, రమణమ్మ, సుబ్బారావు, రత్తమ్మ, ఖాశింసాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

పామూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రద్దీగా ఉన్న ప్రదేశాల్లో ప్రజల విలువైన బంగారు ఆభరణాలను తస్కరించేందుకు మోసగాళ్లు సంచరిస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ టి.కిశోర్‌బాబు పేర్కొన్నారు. క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి సందర్భంగా ప్రజలు దుస్తులు, బంగారు వస్తువులు, ఇతర సరుకులు కొనుగోళ్ల కోసం గ్రామాల నుంచి ప్రజలు రావడంతో వీధులన్నీ రద్దీగా మారుతున్నాయి. ఈక్రమంలో మోసగాళ్ల బారిన పడే ప్రమాదం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

అయ్యప్పస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు

పామూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక అయ్యప్పస్వామి దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో సోమవారం దాతల సహకారంతో నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈసందర్భంగా స్వామి ఉత్సహ విగ్రహానికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన గౌరవాధ్యక్షుడు మణికంఠస్వామి, అధ్యక్షుడు కావిటి సుబ్బయ్య, గుత్తి రాజ, బైరెడ్డి జయరామిరెడ్డి, కేవీ రమణయ్య, ఎన్.సాంబయ్య, కంభాల రోశయ్య, వాయినేని మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

వాసవీమాత ఆలయానికి వెండి బహూకరణ

పామూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలోని అమ్మవారి గర్భగుడి వాకిలికి రజత తోరణం నిర్మాణానికి వ్యాపారవేత్త దరిశి రమేష్ దంపతులు, మాజీ వైస్ ఎంపీపీ దరిశి రాము దంపతులు వెండిని బహూకరించారు. సోమవా రం జరిగిన కార్యక్రమంలో దేవస్థాన కమిటీ సభ్యుడు కొత్తూరు హర గోపాల్‌కు దరిశి బ్రదర్స్ కుటుంబ సభ్యులతో కలిసి వెండిని అందజే శారు. ఈసందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.

సమష్టి కృషితో దర్శి అభివృద్ధి

- టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి
- దొనకొండలో పాస్టర్లకు దుస్తులు పంపిణీ



క్రిస్మస్ కేకు కట్ చేస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్, మాజీ ఎమ్మెల్యే పాపారావు

దొనకొండ, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రానున్న ప్రతి క్రిస్మస్ వేడుకలు దర్శి నియోజకవర్గ ప్రజలతో జరుపుకోవాలని ఆకాంక్షిస్తున్నానని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. దొనకొండలో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొనటం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. ఎర్రబాలెం టీడీపీ నాయకుడు మోడి అంజనేయులు మండలంలోని 120 మంది పాస్టర్లకు సమకూర్చిన దుస్తులను సోమవారం రాత్రి ఆమె పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతి క్రైస్తవ కుటుంబం సంతోషంగా జరుపుకునే పండుగ క్రిస్మస్ అని అన్నారు. యేసుక్రీస్తు ఆశీస్సులు, దీవెనెలతో చల్లగా ఉండాలని ఆకాంక్షించారు. దర్శి నియోజకవర్గ అభివృద్ధి కోసం అందరం కష్టపడదామన్నారు. దేవుడి శక్తి సామర్థ్యాలతో ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. అనంతరం మోడి అంజనేయులు ఏర్పాటుచేసిన భారీ క్రిస్మస్ కేకు కట్ చేశారు. పాస్టర్లకు కేకు, దుస్తులు పంపిణీ చేశారు.

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు, కొత్తం రఘునాథరెడ్డి, పులిమి రమణాయాదవ్, కామేపల్లి చెంచయ్య, వడ్లమూడి చెన్నయ్య, శృంగారపు నాగసుబ్బారెడ్డి, వడ్లమూడి వెంకటాద్రి, డాక్టర్ మల్లికార్జున శర్మ, కొమ్మతోటి సుబ్బారావు, యగ్గోని యల్లారెడ్డి, కుందుర్తి లక్ష్మణ్, పోతిపోగు చెన్నయ్య, పత్తి వెంకటేశ్వర్లు, విప్పర్ల లక్ష్మీరావు, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటాం

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి



ఇంటి పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి) ప్రజోపకరమైన చర్యల్లో భాగంగా ప్రభుత్వం చేపట్టే పనులతో నష్టపోయే బాధితులకూ అండగా ఉండి ఆదుకుంటామని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. రైల్వే లైన్ ఏర్పాటుతో భూమిని కోల్పోతున్న బాధితులకు నష్టపరిహారంతో పాటు ఇంటి పట్టాలు మంజూరుచేశారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం బాధితులకు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర పట్టాలు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నడికుడి - శ్రీకాళహస్తి రైల్వేలైన్ కనిగిరి పట్టణ సమీపంలోని పేరంగుడిపల్లి గ్రామం వద్ద నిర్మాణం జరుగుతుందన్నారు. దీంతో భూమని కోల్పోయిన రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారంతో పాటు నిర్వాసితులకు ఇంటి పట్టాలు అందజేస్తున్నట్టు చెప్పారు. కనిగిరి అభివృద్ధిలో ప్రధాన భాగమైన రైల్వే మార్గం ఈప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారనుందన్నారు. ప్రజల మేలుకోసం చేపట్టే కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలని కోరారు.

కార్యక్రమంలో ఆర్డీవో కేవశర్ధన్‌రెడ్డి, తహసీల్దార్ అశోక్‌రెడ్డి, జనసేన నాయకుడు వరికూటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించకపోతే కఠినచర్యలు



పీసీపల్లిలో హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పీసీపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ ధరించకపోతే కఠినచర్యలు తప్పవని ఎస్సై జి.కోటయ్య అన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు మండలంలోని పీసీపల్లి, పెదఅలవలపాడు, పెదయిర్లపాడు గ్రామాల్లో సోమవారం హెల్మెట్ ధారణపై అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాల్లో ఎక్కువశాతం హెల్మెట్ ధరించనివారే మృత్యువాత పడుతున్నారన్నారు. హెల్మెట్ ధరించనివారి పై కఠినంగా వ్యవహరించాలని హైకోర్టు పోలీసులకు ఆదేశాలు ఇచ్చిందన్నారు. కారులో ప్రయాణించే వారు సైతం తప్పనిసరిగా సీటుబెల్టు ధరించాలన్నారు. అనంతరం సిబ్బంది, పలువురు ద్విచక్ర వాహనచోదకులతో కలిసి పీసీపల్లి నుంచి పెదయిర్లపాడు వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు.

హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోండి

తాళ్లూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహన చోదకులు తప్పకుండా హెల్మెట్ ధరించి విలువైన ప్రాణాలు కాపాడుకోవాలని ఎస్సై ఎస్.మల్లికార్జునరావు అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద సోమవారం వాహనాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు జారిపడితే తలకు బలమైన గాయం తగిలి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. కుటుంబసభ్యులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు వాహనచోదకులు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. వాహన చోదకులు తమ వెంట వాహన అనుమతి పత్రాలు ఉంచుకోవాలన్నారు. ద్విచక్రవాహనాలపై ఇద్దరికి మించి ప్రయాణించవద్దని చెప్పారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు శ్రేయస్సు కోసమే రెవెన్యూ సదస్సులు



పామూరు: తహసీల్దార్‌కు అర్జీలు అందజేస్తున్న రైతులు

పామూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రైతు ప్రయోజనాల కోసమే రాష్ట్ర ప్రభుత్వం రైతు సదస్సులు నిర్వహిస్తుందని తహసీల్దార్ బీవీ రమణారావు తెలిపారు. సోమవారం మండలంలోని బోడవాడ, మాలకొండాపురంలో జరిగిన సదస్సుల్లో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా బోడవాడ గ్రామంలో 20, మాలకొండాపురంలో నాలుగు అర్జీలు వచ్చినట్టు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి ఎం.పానకాలరావు, డీటీ బ్రహ్మయ్య, ఆర్‌ఐ బి.మల్లికార్జునరావు, మండల సర్వేయర్ స్నేహ, మహ్మద్ రఫీ, ఎం.హుసేన్‌రావు, బొల్లా నరసింహారావు, దాసరి మాలకొండయ్య, డి.కోటిలింగం, మల్లికార్జున, దాసరి రత్తయ్య, టి.రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లూరో 20 అర్జీలు

తాళ్లూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో భూసమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నదని తహసీల్దార్ కె.సంజీవరావు అన్నారు. సోమవారం మండలంలోని నాగంబొట్లపాలెంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సదస్సులో 20 అర్జీలు ఇచ్చినట్టు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ చిమటా సుబ్బారావు, వీఆర్‌వో పి.చంద్రశేఖర్‌రావు, మండల సర్వేయర్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబవుతున్న ప్రార్థనా మందిరాలు



సట్టుమడుగులో విద్యుత్ దీపాల అలంకరణలో చర్చి

పామూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్‌ను పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న ప్రార్థనా మందిరాలను రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. బుధవారం జరుగుతున్న క్రిస్మస్ సందర్భంగా చర్చిలు ముస్తాబవుతున్నాయి. పట్టణంలో సీఎస్‌పురం రోడ్డులో గల తెలుగు బాప్టిస్టు ప్రార్థనా మందిరాన్ని, సట్టుమడుగు గ్రామంలోని చర్చిని విద్యుత్‌దీపాలతో అలంకరించారు. అలాగే, తూర్పుకోడిగుడ్లపాడు, బోడవాడ బొట్లగూడూరు. అయ్యన్నకోట, తూర్పు, పడమర కట్టకిందపల్లి, ఇనిమెర్ల, మోట్రావులపాడు, నర్రమారెళ్ల, గుమ్మలంపాడు, వగ్గంపల్లి రావిగుంటపల్లి, బుక్కాపురం తదితర గ్రామాల్లోని ప్రార్థనా మందిరాలను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

అపరిశుభ్రంగా మంచినీటి ట్యాంకు

దొనకొండ, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రజల మంచినీటి అవసరాలు తీర్చేందుకు దొనకొండ ఒబ్బాపురంలో నిర్మించిన జీఎల్ఆర్ ట్యాంకు అధికారుల నిర్లక్ష్యంతో అపరిశుభ్రంగా మారింది. నిర్వహణలోపంతో ట్యాంకు చుట్టూ పిచ్చిమొక్కలు మొలిచాయి. సిబ్బంది ట్యాంకును శుభ్రం చేసిన దాఖలాలు లేకపోవటంతో అధ్వానంగా మారింది. విధిలేని పరిస్థితుల్లో ఈట్యాంకు ద్వారానే నీటి అవసరాలు తీర్చుకుంటున్నామని ప్రజలు వాపోతున్నారు.

ట్యాంకు పైకప్పుకు ఇటీవల కాలంలో సిబ్బంది మూతవేయకపోవటంతో ఆదివారం రాత్రి కుక్క ట్యాంకులో పడి ఉదయం వరకు అరుస్తూనే ఉంది. స్థానికులు గుర్తించి ఎస్‌పీ సిబ్బందికి సమాచారం అందించినా వారు ఆలస్యంగా చేరుకునే సరికి స్థానికులు తాడు, కర్రల సహాయంతో పైకి లాగారు. నీరు నిల్వచేసే ట్యాంకులను శుభ్రపర్చకుండా నిర్లక్ష్యంగా వదిలేయటంతో ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మం చినీటి ట్యాంకులో క్లోరినేషన్ పనులు చేపట్టి స్వచ్ఛమైన తాగునీటిని అందించే లా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నారాయణస్వామి ఆదాయం రూ.93 వేలు

సీఎస్‌పురం (పా మూరు), డిసెంబ రు 23 (ఆంధ్రజ్యో తి): సీఎస్‌పురం మండలంలోని ప్ర ముఖ పుణ్యక్షేత్ర మైన మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానానికి ఆది వారం భక్తులు వివిధ రూపాల్లో సమర్పించిన ఆదాయం రూ. 93,245 సమ కూరినట్లు ఈవో గిరిరాజు నరసింహాబాబు తెలిపారు. పూజ టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.45,330, లడ్డు ప్రసాదాలు అమ్మకంద్వారా రూ.22, 975, శాశ్వత అన్నదాన పథకం ద్వారా రూ.24,975 వచ్చినట్లు తెలిపారు. ఆది వారం రాత్రి ఆలయ ప్రాంగణంలో జరిగిన రథోత్సవ కార్యక్రమంలో దేవస్థాన సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

మిరపలో తెగుళ్ల నివారణ చర్యలు చేపట్టాలి

కనిగిరి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మిరప సాగుచేసే రైతులు నల్లి తెగులు నివారణ చర్యలు చేపట్టాలని ఉద్యానశాఖ ఏవో అంజలీభాయి అన్నారు. మండలంలోని బల్లిపల్లి గ్రామంలో సోమవారం మిరప పొలాలను పరిశీలించారు. మిరపలో నల్లి, కొమ్మఎండు తెగులు ఎక్కువగా ఉండటంపై రైతులకు నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. నల్లి తెగులు సోకటం వలన ఆకులు ముడుచుకుని ఉంటాయన్నారు. చెట్లు గిడసబారి పోతాయన్నారు. మిరపసాగు చేసే రైతులు తప్పనిసరిగా పంటల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తెల్లరాయి రవాణాచేసే లారీలు పట్టివేత

కనిగిరి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కనిగిరి నియోజకవర్గంలోని వెలిగండ్ల ప్రాంతం నుంచి తెల్లరాయి(క్వార్ట్జ్)ని కనిగిరి మీదుగా బద్వేల్‌వైపు అక్రమంగా తరలిస్తున్న మూడు లారీలను సోమవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. కనిగిరి మండల పరిధిలోని బల్లిపల్లి గ్రామ అడ్డరోడ్డు వద్ద వే బ్రిడ్జిలో లారీలు కాటా వేస్తుండగా సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆకస్మికంగా తనఖీచేసి పట్టుకున్నారు. లారీలను పరిశీలించగా క్వార్ట్జ్ రాయి అని తెలియడంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈవిషయమై సీఐ ఖాజావలిని ఆంధ్రజ్యోతి ప్రశ్నించగా లారీలను పట్టుకున్నది వాస్తవమేనని చెప్పారు. వేయింగ్‌ను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కురిచేడు- అవులమంద రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు

కురిచేడు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కురిచేడు - అవులమంద ఆర్‌అండ్‌బీ రోడ్డుకు మోక్షం లభించనుంది. ఈ రోడ్డులో కొత్తూరు చెరువు వద్ద కల్వర్టు దెబ్బతిన ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈక్రమంలో 'ఆదమరిస్తే అంతేసంగతులు' శీర్షికన ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కురిచేడు నుంచి అవులమంద వరకు 10 కి.మీ.మేర రోడ్డు వెడల్పు చేసి నూతనంగా నిర్మించడానికి రూ.10 కోట్ల నాబార్డ్ నిధులకు ప్రతిపాదనలు పంపినట్టు ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ తెలిపారు. అనుమతులు వచ్చాక పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు

తాళ్లూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏబీసీ ఉన్నత పాఠశాలలో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. కరస్పాండెంట్ తూము శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కీస్తు సూచించిన సన్మార్గంలో పయనించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటేశ్వరరావు, డైరెక్టర్ కాలేసాబాబు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా క్రిస్మస్ కేక్ కట్ చేశారు.

పాస్టర్‌లకు దుస్తుల పంపిణీ

దర్శి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పండుగ సందర్భంగా పాస్టర్‌లకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. స్థానిక పీటీఎస్ కల్యాణ మండపంలో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. కేక్ కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం 600 మంది పాస్టర్ దంపతులకు వస్త్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, వైస్ చైర్మన్ స్టీవెన్, తదితరులు పాల్గొన్నారరు.

భూ ప్రకంపనలపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పేర్కొన్నారు. దర్శిలో ఆమె సోమవారం డీఎస్పీ లక్ష్మీనారాయణ, సీఐ వై.రామారావు, రెవెన్యూ అధికారులతో ఈ విషయమై చర్చించారు. జియోగ్రాఫిక్ రీసెర్చి అధికారులతో ఆమె ఫోన్‌లో మాట్లాడారు. భూకంపాల తీవ్రత స్వల్పంగా ఉందని, ఆందోళన అవసరం లేదని అధికారులు చెప్పినట్లు ఆమె వివరించారు. అంతకుముందు ఆమె కలెక్టర్ అన్సారియాతో మాట్లాడారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

బాపట్ల జిల్లా వార్తలు
5
మంగళవారం 24 డిసెంబరు 2024

● చొరవ చూపని ఏపీసీపీడీసీఎల్ ● మూడు జిల్లాలు కలిపినా వెయ్యి లోపే కనెక్షన్లు ● ఆర్థిక ప్రయోజనాలను షార్టు వీడియోల ద్వారా ప్రదర్శించాలి ● కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు

సూర్యఘర్ స్కీమ్.. అమలులో
నిర్లక్ష్యం

గుంటూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన (పీఎంఎస్‌జీవై) స్కీమ్ అమలులో మూడు జిల్లాలు వెనకబడిపోయాయి. ఈ పథకం అమలులోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా నామమాత్రంగానే రూఫ్‌టాప్ సోలార్ కనెక్షన్లను డిస్కమ్ సంస్థలు ఏర్పాటు చేయడం వాటి నిర్లక్ష్యాన్ని ఎండగడుతున్నాయి. జిల్లాలకు ఇచ్చిన లక్ష్యంలో కనీసం 10 శాతం కూడా అధిగమించలేని దుస్థితి కొనసాగుతున్నది. ప్రధానంగా ఈ పథకంపై ప్రజల్లో అవగాహన కొరవడింది. దీనివలన కలిగే ప్రయోజనాలను వివరించడంలో డిస్కమ్ అధికారులు విఫలమయ్యారు. కేవలం కరపత్రాల పంపిణీకే పరిమితం కావడం స్కీమ్ అమలుపై ప్రభావం చూపిస్తున్నది. దీంతో ప్రతీ ఇల్లు ఒక సౌర విద్యుత్ ఉత్పాదక యూనిట్ కావాలని భావిస్తున్న కేంద్ర ప్రభుత్వం ఆశయం నీరుగారి పోతున్నది.

విద్యుత్ బిల్లులు పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు భారంగా మారుతున్నాయి. ట్రూఅప్ ఛార్జీల పేరుతో మోపుతున్న భారంతో కరెంటు బిల్లులు ప్రతీ నెలా షాకిస్తున్నాయి. దీనివలన ఆయా కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాయి. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకొన్న కేంద్ర ప్రభుత్వం 2022 జూలై నెలలోనే పీఎం సూర్యఘర్ యోజన స్కీమ్‌ని అమలులోకి తీసుకొచ్చింది. వినియోగదారుడు ప్రతీ నెలా

పీఎం సూర్యఘర్ యోజన స్కీమ్ కింద ఏర్పాటు చేసిన రూఫ్‌టాప్ సోలార్


ఖర్చు చేసే విద్యుత్ యూనిట్ల ఆధారంగా రూఫ్‌టాప్ సోలార్ పవర్‌ని ఏర్పాటు చేసుకోవచ్చు. ఒక కిలోవాట్ మొదలుకొని 3 కేడబ్ల్యూ వరకు ఏర్పాటు చేసుకొనే వెసులుబాటు ఉన్నది. రూ. 2 లక్షల విలువ చేసే సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకొనేందుకు కేంద్ర ప్రభుత్వం రూ. 72 వేల వరకు సబ్సిడీ ఇస్తున్నది. మిగతాది బ్యాంకుల నుంచి రుణం మంజూరు చేయిస్తున్నది.

ఏడాదిలో కనీసం 9 నెలల పాటు గరిష్ఠంగా విద్యుత్‌ని ఈ సోలార్‌ప్లాంట్ ఉత్పత్తి చేస్తుంది. గృహావసరానికి పోను మిగులు విద్యుత్‌ని డిస్కమ్ తీసుకొని సర్దుబాటు చేస్తుంది. ఒక విధంగా మిగులు విద్యుత్ వలన జరిగే బిల్లు ఆదాతో బ్యాంకు రుణం తీర్చవచ్చున్నది కేంద్ర ప్రభుత్వ వాదన. అయితే రిజిస్ట్రేషన్ మొదలుకొని వెండార్ ఎంపిక, బ్యాంకు రుణం పొందడంలో సమస్యలు ఉత్పన్నమౌతున్నాయని వినియోగదారులు చెబుతున్నారు. ఇది కూడా పథకం నెమ్మదించడానికి ఒక కారణంగా ఉన్నది. పీఎం సూర్యఘర్ వెబ్‌సైట్‌లో జరుగుతున్న రిజిస్ట్రేషన్లకి ప్లాంట్ ఇన్‌స్టలేషన్ గణాంకాలకు ఏమాత్రం పొంతన ఉండటం లేదు. బాపట్ల జిల్లాలో 6319 రిజిస్ట్రేషన్లు జరిగితే అప్లికేషన్లు మాత్రం 1,735 మాత్రమే ప్రాసెస్ అయ్యాయి. వాటిల్లో ఇప్పటివరకు ఇన్‌స్టలేషన్ జరిగింది 231 మాత్రమే. ఇక సబ్సిడీ అయితే 140 కనెక్షన్లకే విడుదల చేశారు. గుంటూరు జిల్లాలో 16 వేల పైచిలుకు రిజిస్ట్రేషన్లు నమోదు జరిగితే, అప్లికేషన్లు 5 వేల నుంచి 6 వేల మధ్యనే ఉన్నాయి. వాటిల్లో 631 ప్లాంట్లు ఇన్‌స్టలేషన్ జరిగింది. సబ్సిడీ అయితే ఇందులో 364 మందికి విడుదలైంది. పల్నాడు జిల్లాలో 10318 రిజిస్ట్రేషన్లు జరుగగా 1281 అప్లికేషన్లు ప్రాసెసింగ్ జరిగింది. వాటిల్లో ఇన్‌స్టాల్ అయినవి 133 మాత్రమే. సబ్సిడీ అయితే కేవలం 56 మందికే వచ్చింది. ఈ గణాంకాలు పరిశీలిస్తే మూడు జిల్లాల పురోగతి చాలా పూర్‌గా ఉండటంతో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మంత్రి పెమ్మసాని, 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ దినకర్ సమీక్షలు ప్రారంభించారు. విద్యుత్ అధికారులు స్వయం సహాయక సంఘాలను సమన్వయం చేసుకొని ప్రజల వద్దకు వెళ్లి లాభాలను వివరించి పీఎం సూర్యఘర్ యోజన్ స్కీమ్‌ని పురోగతిలోకి తీసుకురావాలని ఆదేశించారు. మరో మూడు నెలల్లో మళ్లీ సమీక్ష ఏర్పాటు చేస్తామన్నారు.

ప్రభుత్వ జీవోనూ...
పట్టించుకోవడం లేదు
ఈవీలపై వీడని 'పన్ను'పోటు!



- ఈనెల 11 నుంచే అమలులోకి రావాల్సిన 'ఏపీ ఎలక్ట్రిక్ మొబిలిటీ పాలసీ'
- జీవో విడుదలై పక్షం కావస్తున్నా దక్కని పన్ను రాయితీ
- అధికారుల నిర్వాకంతో ప్రభుత్వ లక్ష్యానికి దెబ్బ
- పాలసీ అమలు చేయకపోవడంతో లబ్ధిదారులపై భారీ మోత

రాష్ట్రంలో విద్యుత్ వాహనాలపై ఇప్పటికీ పన్ను పోటు తప్పడం లేదు. విద్యుత్ వాహనాలను ప్రోత్సహించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రాయితీలను అమలు చేయడంలో అధికారులు చూపుతున్న నిర్లక్ష్యం ప్రభుత్వ లక్ష్యాన్ని ఘోరంగా దెబ్బతీస్తోంది. దేవుడు వరమిచ్చినా పూజారి మాత్రం కనికరించ లేదన్న చందంగా రాష్ట్ర రవాణా శాఖ వినియోగదారులపైనా మోయలేని భారాన్ని వేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ వాహనాలపై కొత్త పాలసీని అమలులోకి తీసుకువచ్చి పక్షం రోజులు అవుతున్నా అది ఇంత వరకూ అమలులోకి రాకపోవడం పట్ల సర్వత్రా చర్చ సాగుతోంది.

గుంటూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): డిసెం బరు 11న రాష్ట్ర ప్రభుత్వం 'ఏపీ సస్టెయినబుల్ ఎలక్ట్రిక్ మొబిలిటీ పాలసీ 4.0ను విడుదల చేసింది. ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ విభాగం ఆ జీవోను విడు దల చేసింది. విద్యుత్ వాహనాల ఉత్పత్తిదారులు, విక్రేతలు, వినియోగదారులకు ఎన్నో రకాల రాయితీలు, ప్రోత్సాహకాలను ఆ జీవోలో ప్రభుత్వం ప్రకటించింది. 2024 డిసెంబరు 11 నుంచి 2029 డిసెంబరు 10వ తేదీ వరకూ అమలులో ఉండే ఆ జీవో తాలూకు ప్రయోజనాలన్నీ డిసెంబరు 11 నుంచే అమలులోకి వస్తాయని స్పష్టంగా జీవోలో పేర్కొన్నారు. అయితే ఆ జీవో ఇప్పటి వరకూ అమలుకు నోచుకోలేదు. జీవోను అమలులోకి తీసుకురావాల్సిన రవాణా శాఖ నుంచి ఇప్పటి వరకూ ఎలాంటి స్పష్టతా రాలేదు.

ప్రతిసారీ ఇదే తంతు..?

2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఏపీ విద్యుత్ పాలసీని రూపొందించింది. దాని గడువు 2023తో ముగిసింది. అయితే అప్పటి వైసీపీ ప్రభుత్వం కొత్త పాలసీని రూపొందించకుండా పాత పాలసీనే పొడిగిస్తూ వచ్చింది. ఇలా గడువు ముగిసిన ప్రతి సారీ వినియోగదారులపై 12 శాతం రోడ్ టాక్స్, రిజిస్ట్రేషన్ చార్జీల భారం పడింది. దీంతో వినియోగదారులు భారీ మొత్తంలో నష్టపోవాల్సి వచ్చింది. జీవో గడువు ముగిసిన రెండు మూడు నెలల వరకూ జీవోని



పునరుద్ధరించక పోవడంతో ఆ సమయంలో కొన్న వినియోగదారులు 12 శాతం చొప్పున రోడ్ టాక్స్, రిజిస్ట్రేషన్ చార్జీలు భారీ మొత్తంలో చెల్లించాల్సి వచ్చింది. తాజాగా జూన్ 7న గడువు ముగిస్తే దాన్ని తిరిగి పునరుద్ధరించడానికి అక్టోబరు వరకూ ఆగాల్సి వచ్చింది. దీంతో ఆ 4 నెలల కాలంలో విద్యుత్ వాహనాలు కొన్నవారిపై 13 నుంచి 2 లక్షల వరకూ భారం పడింది. విద్యుత్ కార్లు కొన్నవారికి రూ. 4 లక్షల వరకూ భారం పడింది. కాగా అక్టోబరులో పొడిగించిన జీవో జూన్ 7 నుంచి డిసెంబరు 7వ తేదీ వరకూ మాత్రమే అమలులో ఉంది. అయితే కొత్తగా వాహనాలు కొనుగోలు చేయాలనుకునేవారు దసరా, దీపావళి పండుగ సమయాల్లోనే వాహనాలను కొంటారు. ఆ సమయంలో పన్ను రాయితీ లేకపోవడంతో వాహనాలు కొన్నవారంతా

(మిగతా 6వ పేజీలో)

దెబ్బతింటున్న ప్రభుత్వ లక్ష్యం..

విద్యుత్ వాహనాల వినియోగంలో రాష్ట్రం చాలా వెనుకంజలో ఉంది. 2024 నాటికి రాష్ట్ర వ్యాప్తంగా 1.78 కోట్ల విద్యుత్ వాహనాలు ఉండగా, అందులో విద్యుత్ వాహనాల వాటా నామమాత్రమే. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా లక్షా 30వేల విద్యుత్ వాహనాలు, 817 హైబ్రిడ్ విద్యుత్ వాహనాలు మాత్రమే వున్నాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఈవీ వాహనాలను ప్రోత్సహించడంపై దృష్టిపెట్టింది. 2018లో రూపొందించిన పాలసీ గడువు 2023తో పూర్తవగా, గత వైసీపీ ప్రభుత్వం ఆరు నెలలు చొప్పున రెండు సార్లు పొడిగించింది. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ ఏడాది అక్టోబరులో మరోమారు పొడిగించింది. ఈ గడువు కూడా డిసెంబరు 7తో పూర్తయింది. పొడిగింపుల పర్వానికి స్వస్తి చెబుతూ కూటమి ప్రభుత్వం తాజా గడువు ముగిసిన మూడు రోజుల్లోనే కొత్త పాలసీని ప్రకటించింది. ఆ పాలసీ ద్వారా 2029 నాటికి రాష్ట్రంలో 2 లక్షల విద్యుత్ టూ వీలర్స్, 10వేల త్రీ వీలర్స్, 20 వేల ఫోర్ వీలర్స్‌ను రిజిస్ట్రేషన్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం టార్గెట్‌గా పెట్టుకుంది. పాలసీని రూపొందించడంలో ప్రభుత్వం చూపిన చొరవను ఏమాత్రం పట్టించుకోని రవాణా శాఖ అధికారులు దాని అమలుపై మీన మేషాలు లెక్కిస్తున్నారు. దీంతో ప్రభుత్వం ప్రకటించిన లక్ష్యం దెబ్బతింటోంది.

అర్జీలు పునరావృతం కాకుండా బాధితులకు న్యాయం చేయాలి
● ఎస్పీ తుషార్ డూడి

బాపట్ల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అర్జీలు పునరావృతం కాకుండా బాధితులకు సంతృప్తికర రీతిలో న్యాయం చేయాలని ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికకు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 46 మంది అర్జీల ద్వారా తమ సమస్యలను ఎస్పీకి వివరించారు. సమస్యలు తెలుసుకున్న ఎస్పీ అర్జీలను చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ అర్జీలపై తీసుకున్న చర్యల వివరాలను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి నివేదించాలన్నారు. కుటుంబ కలహాలు, భూ సమస్యలు, ఆర్థిక లావాదేవీలు, ఇతర పలు కారణాలతో అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్, పీజీఆర్ఎస్ ఇన్‌చార్జి సీఐ శ్రీనివాసరావు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



● సీఎఫ్ఎంఎస్‌తో సంబంధం లేకుండా మున్సిపాలిటీలకే నిధులు
● భవన నిర్మాణాలకు 15 రోజుల్లోనే అనుమతులు
● పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ

జనవరి నుంచి రాజధాని నిర్మాణ పనులు ప్రారంభం



పెదకాకాని, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని నిర్మాణానికి రూ.62 వేల కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు సిద్ధం చేశామనీ, అందులో తొలివిడతగా వచ్చే సుమారు రూ.47 వేల కోట్లతో జనవరి నుంచి పనులు చేపట్టడానికి కార్యాచరణ సిద్ధం చేసినట్లు పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. సోమవారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డైక్ మెన్ ఆడిటోరియంలో జరిగిన మున్సిపల్ కమిషనర్ల, ఇంజినీర్ల రాష్ట్ర వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి పనులు చేపట్టే కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేకపోవడం వలన అభివృద్ధి పనుల్లో జాప్యం ఏర్పడుతుందన్నారు. సీఎఫ్ఎంఎస్‌కి గత ప్రభుత్వం ప్రజల సొమ్ము సుమారు రూ.3200 కోట్లు తరలించిందన్నారు. వచ్చే ఏప్రిల్ 1 నుంచి సీఎఫ్ఎంఎస్‌తో సంబంధం లేకుండా మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థలు తమ నిధులను తామే అభివృద్ధి పనులకు ఖర్చు చేసుకునేలా ముఖ్యమంత్రి అనుమతి ఇచ్చారని తెలిపారు. కమిషనర్లు రానున్న 3 ఏళ్లలో ప్రజలకు తాగునీరు, వీధి దీపాలు, రోడ్లు, డ్రైన్లు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, వర్షం నీటి నిర్వహణపై డీపీఆర్‌ను 20 రోజుల్లో అందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. రాష్ట్రంలోని 28 లక్షల స్వయం సహాయక సభ్యుల ఆదాయాలను రానున్న కాలంలో రెట్టింపు చేయడానికి ముఖ్యమంత్రి అలోచన చేస్తున్నారని, అందుకోసమే గతంలో ఎన్నడూ లేనివిధంగా మెప్మా విభాగానికి ఐఏఎస్ అధికారిని నియమించినట్లు తెలిపారు. రాష్ట్రంలో జనవరి నుంచి సింగిల్ విండో ద్వారా 15 రోజుల్లోనే భవన అనుమతులు జారీ జరుగుతుందన్నారు. నిర్మాణంలో నిబంధనల ఉల్లంఘన జరిగితే ఇంజినీర్ లైసెన్స్ రద్దుతోపాటు చట్టపరమైన చర్యలు కూడా తీసుకుంటామన్నారు. మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనులు వేగంగా చేపట్టడం ద్వారా త్వరలోనే రాష్ట్ర మున్సిపాలిటీలను దేశంలోనే అత్యుత్తమ మునిసిపాలిటీలుగా తీర్చిదిద్దుకుందామన్నారు. పురపాలక శాఖ కార్యదర్శి కె.కన్నబాబు మున్సిపాలిటీలో తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీ, వీధి దీపాలు, పన్నుల వసూళ్లు తదితర అంశాలపై తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. వర్క్‌షాప్‌లో మెప్మా ఎండీ, సీడీఎంఏ(ఇంచార్జి) ఎన్.తేజ్ భరత్, విశాఖపట్నం కమిషనర్ సంపత్ కుమార్, గుంటూరు కమిషనర్ పులి శ్రీనివాసులు, కాకినాడ కమిషనర్ భావన, ఈఎన్సీ డి.మరియన్న, రాష్ట్రంలోని కార్పొరేషన్ల, మున్సిపాలిటీల కమిషనర్లు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

అర్హత లేకపోయినా పింఛన్ లబ్ధి పొందుతూ ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్న వారిని గుర్తించే పనిని కూటమి ప్రభుత్వం చేపట్టింది. దీనిలో భాగంగా జిల్లాలో ఇప్పటికే ఓ సచివాలయ పరిధిలోని ఇళ్లను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి తనిఖీలు సైతం పూర్తి చేశారు. ఈ తనిఖీలలో భాగంగా పలు అంశాలు అధికారులు దృష్టికి వచ్చాయి. ఇంటి దగ్గర అందుబాటులో లేని వారి విషయంలో ఎటువంటి వైఖరి తీసుకోవాలనే దానిపై స్పష్టత లేకపోవడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు నడుచుకోనున్నారు.

పింఛన్ అనర్హుల
ఏరివేత

● ఇప్పటికే పైలట్ ప్రాజెక్టు కింద తనిఖీ పూర్తి
● అనర్హులకు త్వరలోనే నోటీసులు జారీ!


యద్దనపూడి మండలం పూనూరు గ్రామ సచివాలయ పరిధిలో పింఛన్ల తనిఖీ చేపడుతున్న యంత్రాంగం (ఫైల్ ఫొటో)

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

జిల్లాలో పైలట్ ప్రాజెక్టు కింద యద్దనపూడి మండల పరిధిలోని పూనూరు-2 గ్రామ సచివాలయాన్ని ఎంపిక చేసి తనిఖీ పూర్తి చేశారు. ఇక్కడ మొత్తం 476 మంది పింఛన్లు అందుకుంటుండగా 447 మందికి సంబంధించి యంత్రాంగం పింఛన్ అందుకుంటున్న వారి వివరాలను నమోదు చేసి వెరిఫై అంకాన్ని పూర్తి చేసింది. పింఛన్ అందుకుంటున్న 29 మంది అందుబాటులో లేకపోవడంతో వాటిని హోల్డ్‌లో పెట్టి ప్రభుత్వ ఆదేశాల కోసం వేచి చూస్తున్నారు. ఇదిలా ఉంటే మొత్తం 447 తనిఖీల్లో భాగంగా అనర్హులు గా 18 మందిని గుర్తించినట్లు సమాచారం. వీరందరికి ప్రభుత్వ ఆదేశాల మేరకు త్వరలోనే నోటీసులు జారీ చేసే ప్రక్రియ చేపట్టనున్నారు. వారి వివరణ కూడా తీసుకున్న తర్వాతనే పింఛన్ తొలగింపుపై ఓ నిర్ణయానికి రానున్నట్లు సమాచారం

జిల్లాలో మొత్తం పింఛన్‌దారులు
2,28,615

జిల్లాలో మొత్తం పింఛన్ అందుకుంటున్న వారు 2,28,615 మంది ఉండగా, వీరిలో వితంతువులు 50,270, ఒంటరి మహిళలు 7,864, దివ్యాంగులు 25,892, మిగిలిన వారు ఇతరుల కింద లబ్ధి పొందుతూ ఉన్నారు. గడచిన ఐదేళ్లలో అర్హుల కు లబ్ధి చేకూర్చపోగా రాజకీయ పైరవీలతో ఇబ్బడి ముబ్బడిగా అనర్హులకు మేలు చేసినట్లు క్షేత్రస్థాయిలో ప్రభుత్వం చేపట్టిన పరిశీలనలో వెల్లడైంది. గత ప్రభుత్వంలో అనర్హులు పింఛ న్ అందుకుంటున్నారంటూ దాదాపు 4,600 ఫిర్యాదులు ఐదేళ్ల వ్యవధిలో వచ్చాయి. వాటిపై విచారణ చేపట్టకపోగా యదేచ్ఛగా ప్రభుత్వ ఖజానాకు గండికొట్టే పనిని వైసీపీ ప్రభుత్వం చేపట్టింది. అప్పుడు వచ్చిన ఫిర్యాదులతో పాటు మొత్తం పింఛన్లనే ఓ సారి తనిఖీలు చేసి అనర్హులను ఏరివేసే ప్రక్రియకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది

గతంలోనే ప్రాథమికంగా ఓ అంచనా

ఇప్పుడు జిల్లాలో పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన పూనూరు--2 సచివాలయ పరిధిలో దాదాపు 18 మందిని అనర్హులుగా గుర్తించి ప్రభుత్వానికి నివేదించినట్లు సమాచారం. ఇదే నిష్పత్తిలో జిల్లా వ్యాప్తంగా చూస్తే దాదాపు 2,600 మంది వరకు అనర్హులుగా ఉండి పింఛన్ ఫలాలు అందుకుంటున్నట్లు అధికారులు ఓ అంచనాకు వచ్చారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తొలినాళ్లలోనే డీఆర్‌డీఏ పింఛన్ల తనిఖీని చేపట్టింది. దీనిలో భాగంగా అప్పట్లో దాదాపు 2,900 వరకు గుర్తించినట్లు సమాచారం. ఇప్పుడు పైలట్ ప్రాజెక్టు కింద గుర్తించిన అనర్హుల శాతంతో పోలిస్తే జిల్లా వ్యాప్తంగా ఇంచుమించు 2,600 మంది అనర్హులు పింఛన్‌కు దూరం కానున్నట్లు తెలుస్తోంది. ఇటీవల పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన సచివాలయ పరిధిలో గుర్తించిన అనర్హులతో పాటు ప్రభుత్వం గతంలో గుర్తించిన అనర్హులందరికీ త్వరలోనే నోటీసులు జారీ చేసే ప్రక్రియను యంత్రాంగం చేపట్టనుందని తెలుస్తోంది. గడచిన ప్రభుత్వంలో దాదాపు పదివేల మంది అర్హులు రాజకీయ పరమైన కారణాలతో పింఛన్లకు దూరంగా ఉండిపోయారు. వీరందరి దరఖాస్తులను పరిశీలించి నిబంధనల ప్రకారం వారందరికీ పింఛన్ ఫలాలు అందేలా చూడడానికి యంత్రాంగం కసరత్తు చేస్తోంది.

రెండు విభాగాల మధ్య సమన్వయం కరువు

గతంలో పింఛన్లకు సంబంధించిన సమాచారమేదైనా డీఆర్‌డీఏ పీడీ లాగిన్‌కు వచ్చేవి. అలాంటిది ఇప్పుడు సెర్ప్ లాగిన్‌కు వెళ్లడంతో ఇరు విభాగాల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. సచివాలయ పరిధిలోని వెల్ఫేర్ అసిస్టెంట్‌కు పింఛన్‌కు సంబంధించిన దరఖాస్తు వస్తుంది. అక్కడ వెరిఫై అనంతరం ఎంపీడీవో లాగిన్‌కు, అక్కడ పరిశీలన ముగిసిన తర్వాత డీఆర్‌డీఏ పీడీ దగ్గరకు, అక్కడ నుంచి జిల్లా కలెక్టర్ ఆమోదంతో రాష్ట్రస్థాయికి పంపించే వారు. కానీ ఇప్పుడు సెర్ప్ సీఈవో లాగిన్‌కు వెళుతుండడంతో డీఆర్‌డీఏ పాత్ర నామమాత్రంగా మిగిలింది. పింఛన్లకు సంబంధించి వివరాల విషయంలో డీఆర్‌డీఏ సైతం సెర్ప్ మీద ఆధారపడాల్సి రావడం, రెండు విభాగాల సిబ్బంది మధ్య సఖ్యత లోపించడంతో కొంత గందరగోళానికి దారి తీస్తోంది.

ఏసుక్రీస్తు చూపిన బాటలో
పయనించాలి
● సెమీ క్రిస్మస్ వేడుకల్లో కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : లోక రక్షకుడైన ఏసుక్రీస్తు చూపిన బాటలో ప్రతి ఒక్కరు పయనించాలని కలెక్టర్ వెంకటమురళి తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ, క్రైస్తవ మైనార్టీ ఆర్థిక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకల హై టీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ క్రైస్తవులకు క్రిస్మస్ పండుగ గొప్పదని ఈ పండుగను అందరు కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రపంచ మానవాళికి ప్రేమ, దయ, అహింస మార్గాన్ని ఏసుక్రీస్తు చూపారన్నారు. వ్యక్తుల పట్ల ప్రేమ, దయ కలిగియుండాలని చెప్పారు. అహింసమార్గాన్ని ఆచరించాలన్నారు. కార్యక్రమంలో భాగంగా కొవ్వొత్తుల ప్రదర్శనతో, కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సంక్షేమశాఖాధికారి షేక్.మహబూబ్ షరీఫ్, ఆర్డీవో పీ గ్లోరియా, ఫాస్టర్ రెవరెండ్, డాక్టర్ పీ వరబాబు, పాస్టర్ ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్‌లో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి, అధికారులు, పాస్టర్లు

భూకంపంపై భయపడొద్దు

ముండ్లమూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): భూకంపంపై భయాందోళనలు చెందవద్దని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. ముండ్లమూరు మండలంతో పాటు పలు ప్రాంతాల్లో వరుసగా మూడు రోజుల నుంచి భూకంపం వస్తుండటంతో సోమవారం ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఆర్.శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా కలెక్టర్‌కు విషయం తెలిపి డిజార్టర్‌తో పరిశోధన చేసేవిధంగా చూడాలని తహసీల్దార్‌ను కోరారు. భూకంప పరిస్థితులపై జిల్లా కలెక్టర్‌కు వివరిస్తానని శ్రీకాంత్ తెలిపారు. ప్రజలతో పాటు స్కూల్ విద్యార్థులు తీవ్రంగా భయ పడుతున్నారని, వారిలో ఉన్న భయాన్ని పోగొట్టాలని లక్ష్మి కోరారు. కార్యక్రమంలో డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ, సీఐ వై.రామారావు తదితరులు పాల్గొన్నారు.

టెన్నిస్‌బాల్ ఇండియా క్రికెట్ జట్టుకు జిల్లా కుర్రాడు


సృజన్

ఒంగోలు, కార్పొరేషన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) :టెన్నిస్ బాల్ క్రికెట్ ఇండియా జట్టుకు జిల్లా కుర్రాడు దార్ల సృజన్ ఎంపికైనట్లు ఆంధ్రప్రదేశ్ టెన్నిస్‌బాల్ క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్‌డీ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇండో-నేపాల్‌లో జరిగే క్రికెట్ పోటీలలో సృజన్ ఇండియా జట్టు తరుపున పాల్గొంటున్నట్లు తెలిపారు. గతంలో అనేక మ్యాచ్‌లు ఆడి రాణించిన ఆయన ఇండియా జట్టుకు ఎంపిక కావడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈమేరకు సృజన్ సోమవారం శాప్ ఛైర్మన్ రవినాయుడుని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

31లోపు అపరాధ రుసుం లేకుండా పరీక్ష ఫీజు చెల్లించాలి

ఒంగోలు విద్య, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 2024-25 విద్యా సంవత్సరానికి పదో తరగతి, ఇంటర్ మీడియేట్ కోర్సులకు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఈనెల 31వతేదీలోపు ఫీజు చెల్లించవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 1నుంచి 4వతేదీ వరకు రూ. 25 అపరాధ రుసుం, 5నుంచి 8వ తేదీ వరకు రూ. 50 అపరాధ రుసుంతో పరీక్ష ఫీజు చెల్లించవచ్చన్నారు. పదవ తరగతిలో ఒక్కొక్క సబ్జెక్టుకు రూ. 100 వంతున, ఇంటర్‌లో ఒక్కొక్క సబ్జెక్టుకు రూ. 150 వంతున పరీక్షఫీజు చెల్లించాలని ఆయన కోరారు. ఓపెన్ స్కూలు కో ఆర్డినేటర్లందరూ తమ వద్ద అడ్మిషన్లు పొందిన విద్యార్థులందరిచేత పరీక్ష ఫీజు చెల్లింపజేయాలన్నారు.

అర ఎకరా స్థలం చూపిస్తే చెరువు ఏర్పాటు చేస్తాం

టంగుటూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఏ గ్రామంలోనైనా అర ఎకరా స్థలం చూపిస్తే అమృత్ సరోవర్ పథకం కింద చెరువు నిర్మించి వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తామని ఉపాధి హామీ ఏపీవో సుభాషిణి ఒక ప్రకటనలో తెలిపారు. దాతల సహకారంతో ట్రాక్‌పై బల్లలు వేస్తామన్నారు. తాను గ్రామానికి అర ఎకరా ప్రభుత్వ భూమి చూపించాలని నెల క్రితమే తహసీల్దార్ ఆంజనేయులును కలిసి కోరానని తెలిపారు. ప్రస్తుతం రెవెన్యూ సదస్సులు జరుగుతున్నాయని, అవి ముగియగానే స్థలాలను గుర్తిస్తామని తహసీల్దార్ చెప్పారన్నారు.

గుప్తనిధుల ఆశచూపి టోకరా

మార్కాపురం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): తన పొలంలో రూ.కోట్ల విలువైన గుప్త నిధులున్నాయని వాటిని వెలికితీసేందుకు ఆర్థికసాయం చేస్తే ఒకటికి మూడు రెట్లు డబ్బులిస్తానని నమ్మబలికిన ఓ వ్యక్తిపై మార్కాపురం పట్టణ ఎస్సై సైదుబాబు సోమవారం కేసు నమోదు చేశారు. ఆయన కథనం మేరకు, స్థానిక విద్యానగర్‌కు చెందిన ముటుకుల సుబ్రహ్మణ్యం ఓ న్యాయవాది వద్ద గుమస్తాగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో పొలంవివాదం నేపథ్యంలో పెద్దారవీడు మండలం కలనూతలకు చెందిన గోద నడిపయ్య న్యాయవాది వద్దకు వస్తుండేవాడు. ఈ క్రమంలో గుమస్తా సుబ్రహ్మణ్యంతో నడిపయ్యకు పరిచయం ఏర్పడింది. వివాదంలో ఉన్న పొలంలో రూ.కోట్ల విలువైన గుప్త నిధులున్నాయని గుమస్తాకు నడిపయ్య తెలిపాడు. తన దగ్గర డబ్బులు లేవని రూ.10 లక్షలు ఇస్తే తాను మూడు రెట్లు తిరిగిస్తానని నమ్మబలికాడు. ఈ విషయంలో తనకు ఝాన్సీ, రవి అనే వాళ్ల సాయం చేస్తారని చెప్పాడు. దీంతో గుమస్తా సుబ్రహ్మణ్యం తన వద్ద రూ.6 లక్షలు మాత్రమే ఉన్నాయని సుబ్రహ్మణ్యం చెప్పాడు. ఆ డబ్బులను నడిపయ్య సూచన మేరకు గుప్తనిధులను తవ్వితీసే ఝాన్సీ అనే మహిళకు పంపించాడు. ఈ సంవత్సరం మార్చిలో ఫోన్‌పే ద్వారా విడతల వారీగా ఝాన్సీకి సుబ్రహ్మణ్యం నగదు పంపాడు. అయితే నెలలు కావస్తున్నా తాను పంపిన డబ్బుల గురించి నడిపయ్య సమాధానం చెప్పలేదు. దీంతో సెప్టెంబరులో సుబ్రహ్మణ్యం నిలదీశాడు. దీంతో పలువురు మధ్యవర్తుల సమక్షంలో నడిపయ్య రూ.6 లక్షలకు ప్రామిసరీ నోటు రాసిచ్చాడు. ఆ తర్వాత నుంచి నడిపయ్య కనిపించకపోవడంతో ఆందోళనకు గురైన సుబ్రహ్మణ్యం సోమవారం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై సైదుబాబు తెలిపారు.

వైభవంగా వేణుగోపాలస్వామి ప్రతిష్ఠోత్సవం




ఆలయంలో ప్రతిష్ఠించిన జీవధ్వజస్తంభం, శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి గొట్టిపాటి హర్షవర్ధన్, స్వామి శాంతి కల్యాణంలో క్రతువు నిర్వహిస్తున్న దంపతులు

గోవింద నామ స్మరణతో పులకించిన కొండమంజులూరు

కల్యాణాన్ని తిలకించి తరించిన భక్తజనం

పంగులూరు, డిసెంబరు, 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండమంజులూరు గ్రామంలో వేణుగోపాలస్వామి ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవం వైభవోపేతంగా జరిగింది. ఈ మహోత్సవాన్ని తిలకించేందుకు గ్రామంతోపాటు పరిసర ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో గ్రామం కిక్కిరిసింది. భక్తుల గోవింద నామంతో హోరెత్తింది. నిర్ణీత దివ్య ముహూర్తంలో ప్రముఖ వేద పండితులు రొంపిచర్ల వెంకట సత్యనారాయణాచార్యులు వారి పరివారంతో ఆలయ మూలవిరాట్ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి, ద్వారపాలకులు, విమాన శిఖర కలశ, జీవధ్వజ పీఠారోహణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. గాలి గోపురం, కలశ ప్రతిష్ఠాపనతో శోభను సంతరించుకున్న వేణుగోపాలస్వామి ఆలయాన్ని తిలకించిన భక్తులు భక్తి పారవశ్యంతో పూజలు చేశారు.

వేద మంత్రోచ్ఛరణతో స్వామి శాంతి కల్యాణం

దేవతామూర్తుల ప్రతిష్ఠాపన అనంతరం పీఠబంధనం, ప్రాతఃసవనం, వాస్తుశుద్ధి ప్రధాన హోమం, కలాన్యాసం, దృష్టికుంభం దేను దర్శనం, కుంభాభిషేకం, స్వామి దివ్య మంగళ విగ్రహ సందర్శనం, మహార్నివేదన, హారతి, ఆచార్యాది దక్షిణాదానం నిర్వహించి మహాపూర్ణాహుతిని గావించారు. అనంతరం రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి శాంతి కల్యాణ మహోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. శాంతి కల్యాణ మహోత్సవంలో 20 మంది సతీసమేతంగా పాల్గొని పూజలు చేశారు. వేదపండితులు వెంకట సత్యనారాయణాచార్యులు, వారి శిష్య బృందంతో పాటు అర్చక స్వాములు ప్రసాద్‌బాబు, శ్రీనివాస్, రాంబాబులు కార్యక్రమంలో పాల్గొన్నారు.


వేణుగోపాలస్వామి

శిలాఫలకాన్ని ఆవిష్కరించిన హర్షవర్ధన్

ప్రతిష్ఠోత్సవంలో గొట్టిపాటి హర్షవర్ధన్.. స్వామి ఆలయ పునర్ నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఈవో కోటిరెడ్డితో పాటు చింతల సహదేవుడు, బత్తుల వెంకటరావు, రావుల బాపయ్య, కల్లూరి కోటేశ్వరరావు, బొప్పూడి నాగేశ్వరరావు, దొప్పలపూడి వీరయ్య, పలువురు స్థానిక నేతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కుక్కపల్లి ఏడుకొండలు, మస్తాన్‌వలి, ఓబుల్‌రెడ్డి, గుర్రం ఆదిశేఖర్, రావూరి రమేష్, భానుప్రకాష్ అశోక్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ వైవీ భద్రారెడ్డి, జంపని రవిబాబు, పానెం నరసింహారెడ్డి, మన్నె రామారావు, రాజేష్, హరిబాబు పాల్గొన్నారు.

భారీ అన్నదానం

ప్రతిష్ఠోత్సవానికి గ్రామస్థులతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, బంధువులు, స్నేహితులు వేలాదిగా తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీవారు భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

అనధికారిక లేఅవుట్లు.. ఇసుక దందా

చీరాలలో అధికారులకు సవాల్‌గా నిలుస్తున్న అక్రమార్కులు

కఠిన చర్యలు చేపట్టడమే సమస్యకు పరిష్కారం

వేటపాలెం/చీరాల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : చీరాల నియోజకవర్గంలో అనధికారిక లేఅవుట్లు, ఇసుక అక్రమ దందాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. అధికార పార్టీకి చెందిన వ్యక్తులలో ముఖ్యులు ఆ విషయాన్ని బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. పార్టీలు వేరైనా అక్రమ సంపాదనలో పార్టీలకతీతంగా కొందరు నేతలు కలసి పనిచేసుకుంటున్నారు. పాలక, ప్రతిపక్షాలకు చెందిన వారు కలసి అక్రమ దందా సాగిస్తుండడంతో ఏ చర్యలు తీసుకోవాలో అర్థంకావడం లేదని అధికారులు వాపోతున్నట్లు సమాచారం. అందుకు ప్రజాప్రతినిధి అండే కారణమా అన్న కోణంలో ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇసుక వ్యవహారం ఇలా ఉండగా.. అదే స్థాయిలో అక్రమ లేఅవుట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. వేటపాలెం మండలం నాయినిపల్లి పరిధిలోని ఓ ప్రైవేటు కళాశాల సమీపంలో 216 జాతీయ రహదారి పక్కన వేసిన లేఅవుట్ మాదిరి అనేక లేఅవుట్లకు ఎలాంటి అనుమతులు లేవు. జాండ్రపేటకు చెందిన ఓ వస్త్ర వ్యాపారి ఆ వెంచర్‌ను వేసినట్లు సమాచారం. ఇలాంటి అనుమతులులేని వెంచర్లు అనేకం ఉన్నాయి.


అనధికారిక లేఅవుట్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు(ఫైల్)

ఇసుక అక్రమాల వెనుక అదృశ్య హస్తం ఎవరిది?

చీరాల నియోజకవర్గంలో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా యథేచ్ఛగా సాగుతున్నాయి. ఇది బహిరంగంగా అందరికీ తెలిసిన విషయమే. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అనధికారిక ఇసుక తవ్వకాలు, రవాణాను మించిప్రస్తుతం ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా జరగడంపై ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.


పుల్లరిపాలెం గ్రామస్థులను విచారిస్తున్న తహసీల్దార్ పార్వతి(ఫైల్)

ఎవరీ ఆర్‌ఆర్?

ప్రస్తుతం నియోజకవర్గంలో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా వెనుకున్న అదృశ్య హస్తం ఆర్‌ఆర్. ఎవరీ ఆర్‌ఆర్? ప్రస్తుతం అందరిలో నడుస్తున్న చర్చ ఇది. ఆర్‌ఆర్ అనే వ్యక్తి చీరాల నియోజకవర్గం చెందిన వ్యక్తి కాదు. ఇతర ప్రాంతం నుంచి వలస వచ్చాడు. గత ఎన్నికల్లో టీడీపీకి పనిచేశాడు. కొన్ని వందల మందిలో అతను ఒకడు. అయితే ప్రస్తుతం నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న ఇసుక దందాకు ఆయనే మహారాజు. పోలీస్, రెవెన్యూ మైనింగ్ శాఖలకు సంబంధించిన అధికారులు ఆర్‌ఆర్ మాటే వింటున్నారు. అందుకు ఎవరి అండ ఉందో వేరేరకంగా చెప్పాల్సిన అవసరం లేదని ప్రజలు ఎద్దేవా చేస్తున్నారు.

అక్రమ లేఅవుట్లు, ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై ప్రత్యేక దృష్టి

పార్వతి, తహసీల్దార్, వేటపాలెం మండలం

అక్రమ లేఅవుట్లు, ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాం. నిబంధనలు అతిక్రమించిన ఎవరినీ ఉపేక్షించం. క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాం. పూర్తిస్థాయి పరిశీలన అనంతరం అక్రమార్కులను గుర్తించి తగిన చర్యలు చేపడతాం. ఎవరినీ ఉపేక్షించం.

అర్జీలను సహేతుకంగా పరిష్కరించాలి

కలెక్టర్ అన్సారియా ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మీకోసం కార్యక్రమంలో ప్రజలు అందజేసే అర్జీలను సహేతుకంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను ఆమె స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ మీకోసం అర్జీల పరిష్కారానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వాటిని పరిష్కరిస్తున్న తీరును ముఖ్యమంత్రి కార్యాలయ ఉన్నతాధికారులు సూక్ష్మంగా పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. మొక్కుబడి సమాధానాలు చెప్పి అర్జీదారులను పలు మార్లు కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటే సహించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. అర్జీదారులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్ కూడా కరెక్ట్‌గా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, డీఆర్వో చినఓబులేషు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు లోకేశ్వరరావు, వరకుమార్ తదితరులు ఉన్నారు.


అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

- తన కుమారుడు మనోహరాచారి దివ్యాంగుడిగా జన్మించాడని, పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలని పీసీపల్లికి చెందిన మారెళ్ల నరసింహాచారి కోరారు. కనీసం సదరం సర్టిఫికెట్ కూడా ఇవ్వకపోవడంతో పింఛన్ తీసుకొనేందుకు అవకాశం లేకుండా పోయిందన్నారు.
- ప్రభుత్వ భూమిని ఆక్రమించి గ్రానైట్ ఫ్యాక్టరీ నిర్మించిన వారిపై చర్యలు తీసుకోవాలని సంతనూతలపాడుకు చెందిన కుంచాల వీరబ్రహ్మయ్య, తన్నీరు అంకయ్య, కే పాపారావు, కేవీ రామయ్య తదితరులు కోరారు. సంతనూతలపాడు మండలం పిడతలగుడిపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని పిడతలగుడిపాడు డొంకరోడ్డులో ఆరు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని అన్యాక్రాంతం చేశారని ఫిర్యాదు చేశారు.విచారణ చేసి అన్యాక్రాంతమైన భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరారు.

మా భూమి ఇప్పించకపోతే ఆత్మహత్యే శరణ్యం

కుటుంబ సభ్యులతో కలెక్టర్ ఎదుట నిరసన

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి) : తమ భూమిని తమకు అప్పగించకపోతే కలెక్టరేట్ ఎదుట ఆత్మహత్య చేసుకుంటామని కొండపి మండలం పెట్లూరుకు చెందిన చెంచురామయ్య, చంద్రమౌళిలు హెచ్చరించారు. కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం గ్రీవెన్స్ హాలులో కలెక్టర్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 450 సర్వేనెంబరులోని 4.40 ఎకరాల భూమిని కొంతమంది ఆక్రమించుకున్నారని తెలిపారు. కోర్టు ఆదేశాలను కూడా ధిక్కరించి అక్రమంగా నిర్మాణాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక సార్లు అధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. గతంలో జేసీ, ఆర్డీవోలు ఆ స్థలంలోకి ఎవరూ వెళ్లరాదని బైండోవర్ చేసినా అవేమి పట్టించుకోకుండా నిర్మాణాలు చేస్తున్నారని తెలిపారు. తమకు న్యాయం చేసి ఆదుకోవాలని నినాదాలు చేశారు. గ్రీవెన్స్‌సెల్‌లో ఒక్కసారిగా అరుపులు, కేకలు హోరెత్తడంతో పోలీసులు జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పోలీసులు వారితో మాట్లాడి శాంతింపజేశారు.


నిరసన తెలుపుతున్న భూ బాధితులు

అర్జీదారులకు ఉచితంగా రాగి జావా



గ్రీవెన్స్‌సెల్‌కు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజానీకానికి జిల్లాకలెక్టర్ ఆదేశాల మేరకు డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఉచితంగా రాగి జావను అందజేశారు. మధ్యాహ్న సమయంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు రాగిజావాతో మంచినీటిని కూడా అక్కడ ఏర్పాటు చేశారు.

దివ్యాంగులకు బాసటగా....



వివిధ సమస్యల పరిష్కారానికి వచ్చే దివ్యాంగులకు బాసటగా సంతనూతలపాడు మండలం మంగమూరుకుచెందిన దివ్యాంగుడు ఎస్‌కే సంధాని నిలిచారు. గ్రీవెన్స్ సెల్ వద్దకు వచ్చే దివ్యాంగులతో మాట్లాడి వారికి అవసరమైన అర్జీలను రాసి ఇవ్వడంతో పాటు వారిని కలెక్టర్ వద్దకు పంపే విధంగా తన వంతుసహకారానికి శ్రీకారంచుట్టారు. విద్యాసాగర్ ఫౌండేషన్‌లో అకౌంటెండెంట్‌గా పనిచేస్తున్న సంధాని సోమవారం రోజు సెలవు పెట్టుకొని తోటి దివ్యాంగులకు బాసటగా నిలిచారు.

ఆంధ్రకేసరి వర్సిటీ ఖోఖో జట్టు ఎంపిక

అవీఇవీ


ఎంపిక చేసిన ఆంధ్రకేసరి యూనివర్సిటీ పురుషుల ఖోఖో జట్టు

పంగులూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రకేసరి యూనివర్సిటీ పురుషుల ఖోఖో జట్టు ఎంపిక సోమవారం పంగులూరులో జరిగింది. ఈ ఎంపికకు ఉమ్మడి జిల్లాలోని డిగ్రీ కళాశాలలు, బీపీఈడీ కళాశాలల నుంచి 50 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఇంకొల్లు డీసీఆర్ఎం డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఎస్ఆర్‌ఆర్ ఖోఖో అకాడమీ సహకారంతో నిర్వహించిన ఎంపికకు ఆంధ్రకేసరి యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఐ.దేవీవరప్రసాద్ పరిశీలకులుగా వ్యవహరించారు. జట్టు ఎంపిక డాక్టర్ జి.సాయిసురేష్ డీసీఆర్ఎం డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ చిలుకూరి శ్రీధర్, ఎస్ఆర్‌ఆర్ అకాడమీ డైరెక్టర్, ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.సీతారామిరెడ్డి పర్యవేక్షణలో జరిగింది.

ఎంపికయిన క్రీడాకారులు

ఆంధ్రకేసరి వర్సిటీ పురుషుల ఖోఖో జట్టుకు ఎంపికైన వారి వివరాలను డాక్టర్ జి.సాయిసురేష్ ప్రకటించారు. జీవీఎస్ శివ, షేక్ అహమ్మద్, ఎ.వీరాంజనేయులు, కె.రామ్మోహన్, యు.గణేష్(వివేకానంద బీపీఈడీ కళాశాల పొదిలి), బి.లక్ష్మీనారాయణ(సిద్ధమూర్తి బీపీడీ, సింగరాయకొండ), పి.గోపి, ఎం.ప్రసాద్, వై.సుధీర్, కె.వెంకటేశ్వర్లు, ఎస్.షాలెంరాజు, జె.నవీన్, ఐ.ఏలియా, వి.సిద్ధుప్రసాద్, ఎం.మంత్రూనాయక్ (డీసీఆర్ఎం డిగ్రీ కళాశాల ఇంకొల్లు) ఎంపికయ్యారు. ఈ జట్టు ఈ నెల 27 నుంచి 31 వరకు తమిళనాడులోని తిరువయూర్‌లో జరిగే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఖోఖో పోటీలలో పాల్గొంటారని చెప్పారు. వర్సిటీ ఏర్పాటు చేసిన తరువాత తొలిసారిగా క్రీడా జట్టును పోటీలకు పంపుతున్న వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబులకు క్రీడాకారులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ స్థలం స్వాధీనం


ప్రభుత్వ స్థలంలో ఉన్న కంచెను తొలగించి స్వాధీనం చేసుకుంటున్న తహసీల్దార్

మార్కాపురంరూరల్, డిసెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోగులదిన్నె గ్రామంలో సోమవారం రెవెన్యూ సదస్సు తహసీల్దార్ చిరంజీవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థుల నుంచి పలు వినతులను స్వీకరించారు. గ్రామంలోని సర్వేనంబరు 71-4లో ఎకరాలు 1.89 సెంట్ల ప్రభుత్వ భూమిని, 53-2 సర్వేనంబరులో ఎకరాలు 2.80 సెంట్ల భూమిని అక్రమంగా మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎనిబెర కృపానందంలు ఆక్రమించినట్లుగా వచ్చిన ఫిర్యాదును పరిశీలించారు. క్షేత్రస్థాయిలో భూమిని పరిశీలించి ఆ భూమిలో అక్రమంగా వేసిన కంచెను ఎక్స్‌కవేటర్‌తో తొలగించి స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ప్రభుత్వ భూములు అక్రమంగా ఆక్రమణలు చేసుకున్న వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఓవరాల్ చాంపియన్ 'ప్రకాశం'

రాష్ట్రస్థాయి క్యారమ్స్ పోటీల్లో జిల్లా విద్యార్థుల సత్తా


క్యారమ్స్ ఆడుతున్న క్రీడాకారులు

సింగరాయకొండ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సింగరాయకొండ మండలంలోని పాకల జడ్పీ హైస్కూల్‌లో హోరాహోరీ జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-14, 17, 19 బాలబాలికల రాష్ట్రస్థాయి క్యారమ్స్ పోటీల్లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. ఓవరాల్ చాంపిన్‌షిప్‌ను సాధించారు. అండర్-14 బాలుర విభాగంలో వి.జీవన్‌కుమార్ (ప్రకాశం), జి.రాజేష్ (ప్రకాశం), జె.నిషాల్ (విశాఖ), పి.నరసింహ (కడప), బాలికల విభాగంలో కె.సోని (ప్రకాశం), ఎస్.హేమశ్రీ (గుంటూరు), బి.వెంకటేశ్వరమ్మ (ప్రకాశం), ఐ.మృధు (విశాఖ) ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ స్థానాల్లో నిలిచారు. అండర్-17 విభాగంలో కె.చందు (ప్రకాశం), కె.సిద్ధు (ప్రకాశం), కె.వెంకటసాయికుమార్ (ప్రకాశం), సిహెచ్.స్టీఫెన్‌పాల్ (గుంటూరు), బాలికల విభాగంలో టి.గంగోత్రి (ప్రకాశం), ఎస్కే. మెబీరా (ప్రకాశం), ఎస్కే. గఫ్రీనా (నెల్లూరు), కె.అగన్య (ప్రకాశం) వరుస స్థానాలను కైవసం చేసుకున్నారు. అండర్-19 విభాగంలో ఎస్.కె. మస్తాన్ (ప్రకాశం), పి.పవన్‌కుమార్ (ప్రకాశం). టి.అశోక్ (ప్రకాశం), బి.యోను (గుంటూరు) బాలికల విభాగంలో ఎస్.ప్రియదర్శిని, (విశాఖ), కె.హరిత (నెల్లూరు), జె.ధారిక (విశాఖ), ఇమహి (నెల్లూరు) ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ స్థానాలను సాధించారు. మూడు విభాగాల్లో జిల్లాకు చెందిన 13 మంది విద్యార్థులు మొదటి నాలుగు స్థానాల్లో నిలిచి ఓవరాల్ చాంపియన్‌లుగా నిలిచారు. విజేతలైన విద్యార్థులకు హెచ్‌ఎం డీవీఎస్ ప్రసాద్, జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ ఎండీ హజీరా బేగం, వ్యాయామ ఉపాధ్యాయులు మెడల్స్‌ను అందజేశారు.

ప్రభుత్వ జీవోనూ.. పట్టించుకోవడం లేదు

(5వ పేజీ తరువాయి)

ఆ భారాన్ని మోయాల్సి వచ్చింది. ప్రస్తుతం రాష్ట్రంలో పండుగల సీజన్ నడుస్తోంది. క్రిస్మస్, సంక్రాంతి పండుగల సందర్భంగా వాహన విక్రేతలు డిస్కౌంట్లు, రాయితీలు ప్రకటిస్తారు. అలాంటి సమయంలో వినియోగదారులు వాహనాలు కొనేందుకు ఆసక్తి చూపుతారు. అలాంటి సమయంలో కూడా ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు అందకపోవడంతో వినియోగదారులు తిరుగుముఖం పడుతున్నారు.


వినియోగదారులకూ రాయితీ..

తాజా పాలసీలో రాష్ట్ర ప్రభుత్వం 12 శాతంగా వున్న రోడ్ ట్యాక్స్‌ను మినహాయించింది. దాంతో పాటు వాహనం ఖరీదులో 5 శాతం డిస్కౌంట్ లభిస్తుంది. తద్వారా లక్షకు రూ. 5వేలు చొప్పున వినియోగదారుడికి కలిసి వస్తుంది. లక్ష రూపాయల లోపు ఉన్న ఈ- ద్విచక్ర వాహనాలకు, రూ. 2 లక్షల లోపు ధర ఉన్న ఈ- 3 వీలర్స్‌కు, ఐదు లక్షలలోపు ధర ఉన్న సరుకు ఈ- రవాణా వాహనాలకు, రూ. 8 లక్షల లోపు ధర ఉన్న ఈ- ట్రాక్టర్లు, రూ. 2 కోట్ల లోపు ధర ఉన్న ఈ- బస్సులకు ఈ రాయితీ లభిస్తుంది. దాంతో పాటు స్క్రాప్ సర్టిఫికెట్ ఇస్తే వినియోగదారుడికి మరో 10 శాతం రాయితీ లభిస్తుంది. జీవో అమలులోకి రాకపోవడంతో వినియోగదారుడు ఆ రాయితీలన్నీ కోల్పోవాల్సి వస్తోంది. దీనిపై రవాణా శాఖ అధికారులను వివరణ కోరగా జీవో ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ విభాగం వారు జారీ చేసిందని, రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జీవో జారీ చేసిన తరువాతే అది అమలులోకి వస్తుందని చెబుతున్నారు. జీవో గడువు ముగిసినరోజు అర్ధరాత్రి 12 గంటల నుంచే రోడ్ టాక్సును అమలులోకి తెస్తున్న రవాణా శాఖ, జీవో వచ్చి 15 రోజులు పూర్తయినా ఇప్పటికీ దాన్ని అమలు చేయకపోవడంపై వినియోగదారుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది.

జీతాలు రాలేదంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు

బాపట్లరూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలలో విద్యార్థులకు భోజనం తయారు చేసే మాకు జీతాలు ఇవ్వటంలేదంటూ మార్టూరు మండలం యద్దనపూడి గురుకుల పాఠశాలకు చెందిన మున్నంగికు మారి కె.చిరంజీవి, కారంపూడి రమేష్‌లు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల ప్రజావేదిక కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో విలేకర్లతో మాట్లాడుతూ సంవత్సరం 5నెలలు నుండి జీతాలు రావటంలేదని నెలకు ఒక్కొక్కరికి 15వేల రూపాయల చొప్పున ఇవ్వాల్సి ఉండగా ఇంతవరకు జీతాలు పడలేదన్నారు.

నీటి సంఘాలకు సమస్యల సవాల్


చీరాల మండల పరిధిలో పంట కాలువలో ఏపుగా పెరిగిన గడ్డి

- కాలువల్లో పెరిగిన గడ్డి
- పొలాలకు సాగునీరు సక్రమంగా వచ్చేలా చర్యలు తీసుకోవడం తక్షణ విధి
- ఆశాభావం వ్యక్తం చేస్తున్న రైతులు

చీరాల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం కేడబ్ల్యూడీ (కృష్ణా వెస్ట్రన్ డెల్టా) పరిధిలోని ఆయకట్టులో సాగుదారులు పరిస్థితి సంకటంగా మారింది. సాగునీరు సక్రమంగా విడుదల కాకపోవడం అందుకు కారణం. ఆయా సమస్యల పరిష్కారానికి సాగునీటి సంఘాల ప్రతినిధులు బాధ్యత వహించాల్సి ఉంది. తాజాగా ఎన్నికైన సాగునీటి సంఘాల బాధ్యులు తమ హక్కులతో పాటు బాధ్యతలను గుర్తెరిగి అడుగులు వేయాలని ఆయకట్టులోని రైతులు సూచిస్తున్నారు. లేదంటే సాగునీటి సంఘాల బాధ్యులతో తమకెలాంటి ప్రయోజనం ఉండదని చెప్తున్నారు. చీరాల, పర్చూరు నియోజకవర్గాల పరిధిలో సాగునీటి సంఘాల ప్రతినిధులకు క్షేత్ర స్థాయిలో సమస్యలు సవాల్‌గా మారుతున్నాయి. పలుచోట్ల కాలువల్లో పూడికతలు జరగలేదు. దీంతో పాటు పలుచోట్ల కాలువల్లో నాచు, తుంగ, గడ్డి ఏపుగా పెరిగి నీటి పారుదలకు ఆటంకం కలిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా సాగునీటి సంఘాలకు జరిగిన ఎన్నికల క్రమంలో బాధ్యులు తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం కొమ్మమూరు ఆయకట్టు పరిధిలో మాగాణి సాగు జరుగుతోంది. ఆయకట్టు పరిధిలో అధికారికంగా, అనధికారికంగా సుమారు లక్ష ఎకరాల్లో మాగాణి సాగు జరుగుతోంది. కొమ్మమూరు కాలువ పరిధిలో సుమారు 70వేల నుంచి 80వేల ఎకరాలు సాగవుతోంది. మరో 20వేల ఎకరాలు ఆయకట్టు పరిధిలోని ఎత్తిపోతల పథకాల ద్వారా సాగవుతోంది. అయితే ఆయకట్టు పరిధిలోని ఆ 20వేల ఎకరాలతో పాటు, దిగువ ప్రాంతంలోని మాగాణి సాగుకు అందాల్సిన సాగునీరు సక్రమంగా అందాలంటే కాలువలు సక్రమంగా ఉండాలి. నల్లమడ లాకుల నుంచి పెదగంజాం సీమౌత్ వరకు కాలువలో సాగునీరు సక్రమంగా పారుదల ఉన్నపుడే ఆయకట్టులోని భూములకు నీరు సక్రమంగా అందేది. అందుకు అనుగుణంగా సాగునీరు పారుదలకు కాలువలు సక్రమంగా లేవు.

ఇక ఆయకట్టు పరిధిలోని ఎత్తిపోతల పథకాల పరిధిలో సాగునీరు పారుదలకు సంబంధించిన కాలువలు అధ్వానంగా ఉన్నాయి. కొద్దిపాటి మరమ్మతులు నామ్‌కేవాస్తేగా జరిగాయి. అయితే సాగునీరు సక్రమంగా పారుదల జరిగే విధంగా చేపట్టాల్సిన చర్యలపై ప్రస్తుతం నీటి సంఘాల బాధ్యులుగా ఎన్నికైన వారిపై ఉంది. అందుకు అనుగుణంగా వారు అడుగులు వేయాలి. లేదంటే సాగునీటి సంఘాల ద్వారా తమకు ఒనగూరేదేమీ లేదని ఆయకట్టు రైతులు అంటున్నారు. ఈ నేపథ్యంలో రైతుల ప్రయోజనాలను కాపాడే దిశగా సాగునీటి సంఘాల బాధ్యులు తగిన అడుగులు వేయాల్సిన అవసరం ఉంది.


పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరావు

మణికేశ్వరం ఆలయాభివృద్ధి పనుల పరిశీలన

అద్దంకి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మణికేశ్వరం మల్లేశ్వరస్వామి దేవాలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను దేవదాయశాఖ ఉమ్మడి ప్రకాశం, గుంటూరు, నెల్లూరు జిల్లాల డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్. శ్రీనివాసరావు సోమవారం పరిశీలించారు. ఈవో గుంటుపల్లి వాసుబాబు, అద్దంకి ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు కరిముల్లా పాల్గొన్నారు.

తెలుగు యువత మండల అధ్యక్షుడు గోపి మృతి


గోపి (ఫైల్)

అద్దంకి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : తెలుగు యువత అద్దంకి మండల అధ్యక్షుడు జొన్నలగడ్డ గోపి (44) గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. మండలంలోని ధేనువకొండకు చెందిన గోపీకృష్ణ మం త్రి రవికుమార్ అనుచరునిగా ఉన్నారు. దశాబ్దకాలంగా రాజకీయాలలో చురుకుగా వ్యవహరిస్తున్నారు. వెన్నుపూస నొప్పితో బాధపడుతూ నాలుగు రోజుల కిందట గుంటూరులోని వైద్యశాలలో శస్త్ర చికిత్స చేయించుకున్నారు. సోమవారం డిశ్చార్జి అయి ఇంటికి రావల్సి ఉండగా సాయంత్రం 3-30 గంటల సమయంలో కొద్దిసేపు నడిచిన గోపి బెడ్ పై వాలిపోయాడు. వైద్యులు వచ్చి పరీక్షించి గుండెపోటుతో మృతి చెందినట్లు తెలిపారు. గోపి మృతదేహన్ని సోమవారం రాత్రికి ధేనువకొండకు తీసుకువచ్చారు. గోపికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గోపి మృతి తీరని లోటు : మంత్రి రవికుమార్

టీడీపీ నేత జొన్నలగడ్డ గోపి మృతి పార్టీకి తీరని లోటు అని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గోపి మరణ వార్త విని దిగ్భ్రాంతికి లోనైట్లు తెలిపారు. గోపి కుటుంబసభ్యులకు రవికుమార్ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

టీడీపీ పట్టణపార్టీ అధ్యక్షునికి సతీవియోగం


శీలక్ష్మి(ఫైల్)

పర్చూరు, డిసెంబరు 23 : పర్చూరు తెలుగు దేశం పట్టణపార్టీ అధ్యక్షుడు, సీనియర్ నేత అగ్నిగుండాల వెంకటకృష్ణారావు సతీమణి అగ్నిగుండాల శ్రీలక్ష్మి(50) సోమవారం మృతి చెందారు. ఈమె తెలుగుదేశం పార్టీలో క్రియాశీలక మహిళా నాయకురాలిగా పనిచేస్తున్నారు ప్రస్తుతం పంచాయతీ వార్డు మెంబర్‌గా ఉన్నారు. గత కొంత కాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతూ ఆదివారం పర్చూరులోని తన నివాసంలో మృతి చెందారు. ఆమెకు భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఎమ్మెల్యే ఏలూరి సంతాపం

శ్రీలక్ష్మి మృతి విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే ఏలూరి దిగ్భ్రాంతికి గురయ్యారు. పార్టీ క్రియాశీలక మహిళా నాయకురాలిని కోల్పోయిందన్నారు. ఆమె భర్త వెంకట కృష్ణారావును ఆయన ఫోన్‌లో పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు.

మాజీ సర్పంచ్ గోవిందు మృతి


గోవిందు (ఫైల్)

బల్లికురవ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎస్ఎల్ గుడిపాడు మాజీ సర్పంచ్ రావులపల్లి గోవిందు(64) రోడ్డు ప్రమాదంలో గాయపడి వైద్యశాలలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. శనివారం అద్దంకి నార్కెట్‌పల్లి రహదారి ఎస్ఎల్ గుడిపాడు గ్రామం వద్ద బైకుపై రోడ్డు దాటుతున్న గోవిందును కారు ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన అతన్ని నర్సారావుపేట ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన గోవిందు టీడీపీలో సీనియర్ నేతగా సుపరిచితులు. ఆయన మృతి వార్తను తెలుసుకున్న పలుగ్రామాల టీడీపీ నాయకులు మృతదేహనికి నివాళులర్పించారు.కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జీవీ చౌదరి తెలిపారు.

మూడు దుకాణాల్లో తనిఖీ

మార్టూరు,డిసెంబరు23(ఆంధ్రజ్యోతి): మార్టూరు లో మూడు దుకాణాలను సోమవారం ఫుడ్ అధికారులు తనిఖీ చేశారు.వాటిలో ఒ క కిరాణా దుకాణానికి లైసెన్సు లేని కారణంగా సంబంధిత యజమానికి నోటీసును ఇచ్చినట్లు బాపట్ల ఫుడ్ అధికారి ప్రణీత్ కుమార్ తెలిపారు.

గంధ మహోత్సవాన్ని జయప్రదం చేయండి

చీరాలటౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కుల మతాలకు అతీతంగా నిర్వహించే జాండ్రపేట అమీన్ పీర్ దర్గా 49వ గంధ మహోత్సవాన్ని జయప్రదం చేయాలని కమిటీ ప్రతినిధులు తెలిపారు. సోమవారం దర్గా వద్ద సంబంధిత కరపత్రాన్ని ఆవిష్కరించారు. భక్తులు విశేషంగా హాజరై జయప్రదం చేయాలని కోరారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జాండ్రపేట దర్గా ప్రతినిధులు

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి


మహిళలకు చెక్కులు అందజేస్తున్న బ్యాంకు మేనేజర్, టీడీపీ నాయకులు

చినగంజాం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : డ్వాక్రా మహిళలను లక్షాధికారిని చేయాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్యేయమని జడ్పీటీసీ మాజీ సభ్యురాలు యార్లగడ్డ లక్ష్మి అన్నారు. లఖపతి దీదీ కార్యక్రమంలో భాగంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సంతరావూరు శాఖ ద్వారా 20 మంది డ్వాక్రా గ్రూపు సభ్యులకు రూ.20లక్షల చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నటువంటి మహిళలకు ఆర్థికంగా నూతన ఉత్పత్తులను ఏర్పాటు చేసుకోవాలనే లక్ష్యంతో రుణాలను అందజేసినట్లు ఏపీఎం గద్దె సుబ్బారావు తెలిపారు. గ్రూపులో ఉన్న పది మంది సభ్యులకు సంవత్సరానికి ఒకరు చొప్పున 10 ఏళ్లలో పది మందికి ఇవ్వాలనే లక్ష్యంతో లఖపతి దీదీ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం గ్రూపుల్లోని 20 మంది డ్వాక్రా మహిళలకు ఒకొక్కరికీ రూ.లక్ష చొప్పున రూ.20 లక్షల చెక్కులను బ్యాంకు మేనేజర్ అశ్వినీకుమార్, ఫీల్డ్ ఆఫీసర్ మనోజ్‌కుమార్, టీడీపీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు జరుబుల సంధ్యారాణి అందజేశారు. కార్యక్రమంలో సీసీ మాధవి, వీవోఏ జయమని, గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న హెచ్ఎం రామారావు

బాలికల సంరక్షణ అందరి బాధ్యత

చినగంజాం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో బాలికలను సంరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎంపీడీవో అద్దంకి శ్రీనివాసమూర్తి అన్నారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశపు హాల్‌లో ఇంకొల్లు ప్రాజెక్టు సీడీపీవో టి.ఝాన్సీ అధ్వర్యంలో కిశోర వికాసం అనే కార్యక్రమం ద్వారా బాలికల సంరక్షణపై అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లకు సోమవారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామ స్థాయిలో 11 మంది సభ్యులతో చైల్డ్ మ్యారేజ్ ప్రొహిబిషన్ కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు సీడీపీవో టి.ఝాన్సీ తెలిపారు. బాలికలు, మహిళల ఉజ్వల భవిష్యత్‌కు కిశోర వికాసం కార్యక్రమం దోహదపడుతుందని అన్నారు. బాలవివాహాలు, చైల్డ్ వర్సెస్ టీనేజ్ ప్రెగ్నెన్సీ, పోక్సో యాక్ట్, డ్రాప్స్ పిల్లల సైకాలజీ, పిల్లల యొక్క స్కిల్ డెవలప్‌మెంట్, న్యూట్రిషన్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ బి.సుబ్బారావు, కడవకుదురు జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్.ఎం.కుర్రా రామారావు, పాఠశాల హెచ్ఎంలు, ఏఎన్ఎంలు, ఎమ్మెస్కేలు, వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.


గెలుపొందిన క్రీడాకారులతో కళాశాల ప్రతినిధులు

సెయింట్ ఆన్స్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

చీరాల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల ఇంటర్ పాలిటెక్నిక్ కళాశాలల క్రీడా పోటీలు ఒంగోలు డీఏ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగాయి. ఆ పోటీలలో సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ చీరాల పాలిటెక్నిక్ విద్యార్థులు వాలీబాల్, కబడ్డీ, షటిల్ బాడ్మింటన్ పోటీలలో గెలుపొందారు. ఈ నేపథ్యంలో కళాశాలలో సోమవారం కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు గెలుపొందిన క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు రైతు సంఘం వినతి

మార్టూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ మార్కెటింగ్ నేషనల్ పాలసీని ఉపసంహరించాలని, రైతు ఉద్యమాలను అణచివేసే చర్యల ను విడనాడి, సోమవారం మండల రైతు సంఘం నాయకులు తహసీల్దార్ టీ ప్రశాంతికి వినతిపత్రం అందచేశారు. ముందుగా వారు సెంటర్‌లో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో కందిమళ్ల రామకోటేశ్వరరావు, బత్తుల హనుమంతరావు, ఎనికపాటి రాంబాబు, వీరవల్లి కృష్ణ మూర్తి,నాగబోయిన సాంబశివరావు, బి నూరిబాబు, మోహనరావు పాల్గొన్నారు.

రైతులకు అండగా నిలవాలి


రైతు రమేష్‌ను సన్మానిస్తున్న రోటరీ సభ్యులు

అద్దంకి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరికీ కడుపు నింపే రైతులకు అండగా నిలవాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు ప్రతి ఒ క్కరిపై ఉందని రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య అన్నారు. జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో సోమవారం ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు పండించే గోవాడకు చెందిన నరిశెట్టి రమేష్‌ను ఘనంగా సన్మానించి, నూతన వస్త్రాలు, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ కార్యదర్శి చుండూరి మురళీసుధాకరరావు, అసిస్టెంట్ గవర్నర్ మహ్మద్ రఫీ, సందిరెడ్డి శ్రీనివాసరావు, చిన్ని మురళీకృష్ణ, అద్దంకి లేవి ప్రసాద్, డాక్టర్ దేవపాలన, పసుపులేటి ఆంజనేయులు, కాకర్ల వెంకటేశ్వర్లు, ఊటుకూరు రామకోటేశ్వరరావు, పువ్వాడ రామకోటేశ్వరరావు, గురుశేఖర్, అంజాద్ బాషా పాల్గొన్నారు.

మీ కుటుంబాలకు రక్షణ కవచం హెల్మెట్

అవగాహన ర్యాలీలో సీఐ శేషగిరిరావు



మార్టూరులో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐ శేషగిరిరావు, ఎస్ఐ సైదా తదితరులు

మార్టూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మా కోసం కాదు.. మీ కోసం మీ కుటుంబాల రక్షణ కోసం హెల్మెట్‌ను ధరించండి.. ప్రమాదాల నుంచి ప్రాణాలను కాపాడుకోండని సీఎం ఎం.శేషగిరిరావు పిలుపునిచ్చారు. సోమవారం హెల్మెట్ వాడకం వల్ల కలిగే ఉపయోగాలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. సెంటరులో పోలీసు సిబ్బంది, హీరో షోరూం సిబ్బందితో బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో సీఐ, ఎస్ సైదా పాల్గొని ఉత్తేజపరిచారు. అనంతరం సీఐ శేషగిరిరావు మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలను కాపాడుకునేందుకు హెల్మెట్ ఒక్కటే దారి అన్నారు. హెల్మెట్ లేకుండా వెళ్లే వారిపి జరిమానా పెంచినట్లు చెప్పారు. ఇంటి యజమాని మృతిచెందితే ఏకంగా కుటుంబమంతా దిక్కులేనివాళ్లు అవుతారని అలా జరుగకుండా అందరూ విధిగా హెల్మెట్‌ను ధరించి సురక్షితమైన ప్రయాణం చేయాలని సీఐ శేషగిరిరావు సూచించారు. కార్యక్రమంలో హీరో షోరూం యజమాని కే శ్రీనివాసరాజు, యువకులు, ద్విచక్రవాహనదారులు పాల్గొన్నారు.

అద్దంకి : ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ ధరించడం వల్లన ప్రమాదాలు జరిగిన సమయంలో ప్రాణాపాయం నుంచి బయట పడే అవకాశం ఉంటుందని ఎస్సై ఖాదర్ బాషా అన్నారు. సోమవారం పట్టణంలోని భవానీసెంటర్‌లో ద్విచక్రవాహనచోదకులకు హెల్మెట్ ధరించడం వలన కలిగే ప్రయోజనాలపై ఎస్ఐ అవగాహన కల్పించారు. వాహనచోదకులతోపాటు వెనుక కూర్చున్న వారు హెల్మెట్ ధరించాలని సూచించారు.

చీరాలటౌన్ : నిత్యం రోడ్డు ప్రమాదాలు జరిగి కుటుంబాలు దీనస్థితిలో ఉంటున్నాయని కావున ప్రమాదాలకు దూరంగా ఉండాలంటే హెల్మెట్ కచ్చితంగా ధరించాలని రూరల్ సీఐ శేషగిరిరావు అన్నారు. సోమవారం ఈపూరుపాలెం స్టేషన్ పరిధిలోని వీధుల్లో హెల్మెట్‌లు ధరించి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై చంద్రశేఖర్ స్టేషన్ సిబ్బంది ఉన్నారు.


మంత్రి ఆనంతో ఎమ్మెల్యే కొండయ్య

మంత్రి ఆనంను కలిసిన కొండయ్య

చీరాల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని నెల్లూరులోని ఆయన స్వగృహంలో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య సోమవారం కలిశారు. ఈ సందర్భంగా చీరాల నియోజకవర్గ అభివృద్ధికి దేవదాయశాఖ పరంగా తమవంతు సహకారం అందించాలని మంత్రి నారాయణరరెడ్డిని ఎమ్మెల్యే కొండయ్య కోరారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు. ఆ సందర్భంగా నియోజకర్గ స్థితిగతులను ఎమ్మెల్యే కొండయ్య మంత్రికి వివరించారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు


క్రిస్మస్ కేక్‌ను కట్ చేస్తున్న అధికారులు

బల్లికురవ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఉపాధీ హామీ పథకం కార్యాలయంలో సోమవారం సెమీ క్రిస్మస్‌ను ఘనంగా నిర్వహించారు. కేక్‌ను కట్ చేసి ఉద్యోగులంతా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.కుసుమకుమారి, ఈవోపీఆర్డీ సుమతి, పీఆర్ ఏఈ మాధవ్‌రెడ్డి, ఏపీవో రమాదేవి, టీఏలు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

చినగంజాం : క్రీస్తు చూపిన మార్గం సర్వ మానవాళికి అనుసరణీయమని తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు అన్నా రు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రతి ఒక్కరూ క్రీస్తు చూపిన మార్గంలో నడవాలని తహసీల్దార్ అన్నారు. దైవ సేవకులు అబ్రహం లింకన్‌బాబు క్రిస్మస్ సందేశాన్ని వివరించారు. అనంతరం కేక్‌ను తహసీల్దార్ ప్రభాకరరావు కట్ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఏ.శ్రీనివాసమూర్తి, ఎస్ఐ శీలం రమేష్, పంచాయతీరాజ్ ఏఈ డి.దాసు, ఏపీఎం గద్దె సుబ్బారావు, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు నరసింహారావు మృతి


నరసింహారావు (ఫైల్)

పంగులూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేణంగివరం ప్రాథమికోన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు టీవీ నరసింహారావు (51) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. కొద్దిరోజుల క్రితం అస్వస్థతకు గురై విజయవాడలోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందారు. రావినూతల గ్రామానికి చెందిన టీవీ నరసింహారావు 1995లో ఉపాధ్యాయ వృత్తిలో చేరి అద్దంకి, పంగులూరు మండలాలలోని పలు పాఠశాలలో పనిచేశారు. అద్దంకిలో నివాసం ఉంటూ ప్రస్తుతం రేణంగివరం యూపీ పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. యూటీఎఫ్ సంఘ నేతగా సేవలందిస్తూ జన విజ్ఞాన వేదికలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. నరసింహారావు మృతిపట్ల హెచ్ఎం సందిరెడ్డి, శ్రీహరి, పలువురు ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

నలుగురు అరెస్టు

బల్లికురవ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొణిదెన గ్రామంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై సోమవారం ఎస్ఐ జీవీ చౌదరి సిబ్బందితో కలిసి దాడి చేశారు. స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్ ఉదయ్‌కుమార్ ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు కొణిదెన శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడి చేసి నలుగురు జూదరులను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.9070 స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన జూదరులను కోర్టుకు హాజరు పరుస్తామని ఎస్ఐ తెలిపారు.

నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యం

ఇంకొల్లు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యమని విద్యుత్ శాఖ ఏడీ ఎస్.రమేష్‌బాబు అన్నారు. మండల పరిధిలోని ఇడుపులపాడు సబ్‌స్టేషన్‌లో రూ.6లక్షల వ్యయంతో నూతన బ్రేకర్లను ఏర్పాటు చేశారు. గతంలో ఉన్న బ్రేకర్‌పై వ్యవసాయ కనెక్షన్లు కొనసాగుతాయని తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేసిన బ్రేకర్‌పై ఇడుపులపాడు, సూదివారిపాలెం, నాగండ్ల, అంకిరెడ్డివారిపాలెం గ్రామాలలో వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందజేసేందుకు బ్రైకర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇంకొల్లులో 37 కొత్త స్తంభాలను మార్చనున్నట్లు తెలిపారు.

స్వచ్ఛతకు తూట్లు

కొణిదెన రోడ్లపై యథేచ్ఛగా వ్యర్థాలు

బల్లికురవ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొణిదెన గ్రామానికి వచ్చి పోయే వారికి వ్యర్థాలు స్వాగతం పలుకుతున్నాయి. ఒక పక్క అధికారులు స్వచ్ఛత నినాదం పలుకుతుంటే.. మరోపక్క స్వచ్ఛతకు తూట్లు పొడిచేలా రోడ్లపై చెత్తలు దర్శనమిస్తున్నాయి. బల్లికురవ నుంచి కొణిదెన వెళుతుంటే అగ్రామ ఎంట్రన్స్‌లో రోడ్డు వెంబడి పెద్ద ఎత్తున వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. అలానే మార్టూరు వైపు నుంచి కొణిదెన వచ్చే రోడ్డులో ఎంట్రన్స్‌లో కూడా రోడ్డు వెంబడే వ్యర్థాలు పెద్ద ఎత్తున ఉన్నాయి. ఇలా అయితే గ్రామాలు స్వచ్ఛ గ్రామాలుగా ఎలా ఉంటాయని బాటసారులు అంటున్నారు. అధికారులు నిత్యం ఈ రోడ్డులో రాకపోకలు సాగిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. సమావేశాలో మాత్రం గ్రామాలలో ఎక్కడ రోడ్ల వెంబడి చెత్త కనబడకుండా చర్యలు చేపడుతున్నామని చెప్తున్నా క్షేత్ర స్థాయిలో మాత్రం ఎక్కడ వేసిన చెత్త అక్కడ అన్నట్లుగా మారిందని ప్రజలు విమర్శిస్తున్నారు. గ్రామాలలో చెత్త సంపద కేంద్రాలు పనిచేయడం లేదని అందు వల్లే ఇలాంటి పరిస్థితి తలెత్తిందని వారు అంటున్నారు. కొందరు చెత్త ఎక్కడ వేయాలో అర్థం కాక రోడ్ల వెంబడ పడేసి పోతున్నారని అధికారులు వెంటనే స్పందించి కొణిదెన గ్రామానికి వచ్చే రెండు రోడ్లలో ఉన్న చెత్తను తొలగించి పడకేసిన పారిశుధ్యాన్ని పరిశుభ్రం చేయించాలని ప్రజలు కోరుతున్నారు.


బల్లికురవ - కొణిదెన గ్రామ రోడ్డులో ఉన్న వ్యర్థాలు


నెల్లూరులో హెల్మెట్లు ధరించి ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

• హెల్మెట్‌తోనే సురక్షితం

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమని ప్రజలకు అవగాహన కల్పిస్తూ సోమవారం నెల్లూరు, కావలి, సంగంలలో పోలీసులు ర్యాలీ నిర్వహించారు. నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు జరిగిన ర్యాలీని ఏఆర్ అదనపు ఎస్పీ సీహెచ్ సౌజన్య ప్రారంభించారు. ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి ప్రయాణించాలని అధికారులు సూచించారు. రహదారి భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ పాటించి క్షేమంగా గమ్యాన్ని చేరాలని ఆకాంక్షించారు.


వైద్యసేవలు మెరుగుపరుస్తా

• నూతన డీఎంహెచ్‌వో సుజాత

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వైద్యసేవలను మెరుగుపరచనున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఆమె బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం జిల్లా ముదిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య ఆరోగ్య శాఖలో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా 1997లో తొలిగా విధుల్లో చేరారు. తర్వాత 2012లో డిప్యూటీ సివిల్ సర్జన్‌గా పదోన్నతి పొందారు. 2022లో అదే జిల్లా ఆత్మకూరు రూరల్ హెల్త్ సెంటర్ డిప్యూటీ సివిల్ సర్జన్‌గా పదోన్నతి పొందారు. ప్రస్తుతం పదోన్నతిపై డీఎంహెచ్‌వోగా నెల్లూరుకు బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం సుజాత మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య పథకాలు ప్రజలకు చేరువ చేసేలా కృషి చేస్తానని చెప్పారు. కాగా, రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని డీఎంహెచ్‌వో మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా, ఇక్కడున్న డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య రంపచోడవరం అదనపు డీఎంహెచ్‌గా డీ ప్రమోషన్‌పై బదిలీ అయిన విషయం తెలిసిందే.



• హైస్కూళ్లలో ఇంటర్ బోధన అభాసుపాలు • నాటి వైసీపీ సర్కారు అనాలోచిత నిర్ణయం
• అధ్యాపకులు లేరు.. వసతులూ కరువే • పడిపోయిన ఉత్తీర్ణతా శాతం
• దిద్దుబాటు చర్యల్లో కూటమి ప్రభుత్వం • వచ్చే విద్యాసంవత్సరం నుంచి మూత?
• అన్ని వసతులతో మండలానికో జూనియర్ కాలేజీ



ప్లస్‌తో లాసే

సకాలంలో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయకపోవడం, విద్యా ప్రమాణాల మెరుగుకు కృషి చేయకపోవడం వంటి విధానాలతో ప్రభుత్వ విద్యాసంస్థలన్నీ జగన్ సర్కార్ దెబ్బకు నిర్వీర్యమైపోయాయి. ధ్వంస రచనే తప్ప దార్శనికత తెలియకుండా తీసుకున్న నిర్ణయాలతో విద్యారంగం మరింత దిగజారడంపై తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమైంది. ఇందులో భాగంగానే నాటి సర్కారు ప్రారంభించిన జడ్పీ జూనియర్ కళాశాలలు (హైస్కూల్ ప్లస్) అట్టర్ ఫ్లాప్ అయ్యాయి. చేదు అనుభవాల నుంచి తేరుకున్న విద్యాశాఖ దిద్దుబాటు చర్యలు చేపట్టినా క్షేత్రస్థాయిలో స్పందన మాత్రం లభించడం లేదు. పాఠ్యపుస్తకాలు లేకుండా, అనుభవజ్ఞులైన అధ్యాపకులు లేకుండానే తరగతులు నిర్వహించారన్న విమర్శలున్నాయి. ఉత్తీర్ణత ఫలితాలు కూడా అంతంతమాత్రంగానే ఉండటంతో రానున్న విద్యాసంవత్సరం నుంచి వీటిని మూసివేసే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులో వేస్తోంది.

- నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి)

ఓట్ల యావతో వైసీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, గొప్పల కోసం అమలు చేసిన అనాలోచిత నిర్ణయాలతో విద్యార్థులు ఇప్పుడు తిప్పలు పడుతున్నారు. మేనమామను అంటూ డాబులు పలికిన జగన్ బాలికా విద్యను ప్రోత్సహించడం కోసమంటూ ఎక్కువ ఎన్‌రోల్‌మెంట్ కలిగిన ఉన్నత పాఠశాలల్లో ఇంటర్ కోర్సులు ప్రవేశపెట్టారు. ఎక్కడైతే పదోతరగతి పూర్తి చేశారో అక్కడే అందుబాటులోకి వచ్చిన జూనియర్ ఇంటర్‌లో విద్యార్థులు చేరాలని ఆదేశించారు. దీంతో జిల్లాలో 23 ఉన్నత పాఠశాలల్లో విద్యార్థినులకు ఇంటర్ తరగతులు ప్రారంభించారు. పదో తరగతిలో ఎక్కువ మంది బాలికలున్న ఉన్నత పాఠశాలలను కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేస్తూ బైపీసీ, ఎంపీసీ, సీఈసీ గ్రూపులను ఎంపిక చేసుకుని ప్రవేశాలు చేపట్టారు. వీటిలో 13 హైస్కూల్ ప్లస్ మాత్రం కేవలం బాలికల పాఠశాలల్లో ఏర్పాటు చేయగా మిగిలిన 10 హైస్కూల్ ప్లస్‌లో మాత్రం కోఎడ్యుకేషన్ పాఠశాలల్లో అమలు చేశారు. అయితే రోజులు గడిచే కొద్దీ సమస్యలు ప్రారంభమయ్యాయి. ఎలాంటి వసతులు, బోధన లేకుండా ఇంటర్ జరుగుతుండటంపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తూ కొంతమంది తమ పిల్లలను ఇతర కళాశాలల్లో చేర్పించారు. మరికొంతమంది ప్రత్యామ్నాయం లేక తప్పనిసరి పరిస్థితుల్లో అక్కడే కొనసాగించడంతో ఫలితాలు పూర్తిగా పడిపోయాయి.

• అధ్యాపకులు లేకుండానే బోధన

ఉన్నత పాఠశాలలు జూనియర్ కళాశాలలుగా మార్పు చేయడం కాగితాలకే పరిమితమైంది. ఒక్క కళాశాలలో కూడా అధ్యాపకుల నియామకాలు చేపట్టలేదు. గడిచిన సంవత్సరాల్లో పుస్తకాలు, అధ్యాకులు, ప్రాక్టికల్స్ ఏమీ లేకుండానే పరీక్షలకు విద్యార్థినులు హాజరయ్యారు. హైస్కూళ్లలో టీచర్లుగా పనిచేస్తూ పీజీలు పూర్తిచేసిన ఉపాధ్యాయుల్లో కొందరిని బోధనకు నియమించినా మొక్కుబడిగానే తరగతుల నిర్వహణ జరిగినట్లు తల్లిదండ్రులు తెలిపారు. అత్యధిక కళాశాలల్లో ఈ బోధనలు కూడా జరగకపోవడంతో ఉత్తీర్ణతశాతం పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో 2023-24 విద్యా సంవత్సరంలో బోధన చేసేందుకు సబ్జెక్ట్ వారీగా 148 పోస్టులను పాఠశాల విద్యాశాఖ మంజూరు చేసింది. జిల్లాలోని స్కూల్ అసిస్టెంట్ కేడర్ సబ్జెక్ట్ టీచర్లతో భర్తీ చేయాలని ఆదేశాలిచ్చింది. ఆసక్తి ఉన్న ఎస్ఏల నుంచి ఆప్షన్‌లు తీసుకోవాలని, వీరికి ఆర్థిక ప్రయోజనంగా ఒక ఇంక్రిమెంట్‌ను ఇచ్చేలా ఒప్పందం చేసుకోవాలని తెలిపింది. అయితే, తొలుత అతి కొద్ది మంది మాత్రమే దరఖాస్తు చేసుకోగా, అధికారులు నచ్చచెప్పి పీజీ అర్హత కలిగిన ఎస్ఏలను ఒప్పించి 111 పోస్టులను భర్తీ చేయగా ఇంకా 37 పోస్టులు ఖాళీగానే ఉన్నాయి.

జూనియర్ కళాశాలలుగా మార్పు

హైస్కూల్ ప్లస్ విద్యాలయాలపై రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ ఇటీవల నిర్వహించిన సమీక్షలో కీలక నిర్ణయం తీసుకున్నారు. విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు, వెతలను గుర్తించి రానున్న విద్యా సంవత్సరం నుంచి హైస్కూల్ ప్లస్‌లను రద్దు చేసి వాటి స్థానంలో అన్ని వసతులతో మండలానికి ఒక జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీంతో అధికారులు ఆ దిశగా చర్యలు ప్రారంభించారు.

8 పాఠశాలల్లో సున్నా అడ్మిషన్లు

మొత్తం 23 పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఈ అప్‌గ్రేడ్ జూనియర్ కళాశాలల్లో 8 పాఠశాలల్లో ఒక్కరు కూడా చేరలేదు. వీటిలో కొడవలూరు మండలం యల్లాయపాళెం జడ్పీహెచ్‌ఎస్, ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జలదంకి మండలం సోమవరప్పాడు జడ్పీహెచ్‌ఎస్, వరికుంటపాడు జడ్పీహెచ్‌ఎస్, వింజమూరు మండలం చాకలికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సైదాపురం జడ్పీ, ముత్తుకూరు జడ్పీ పాఠశాలల్లో సున్నా అడ్మిషన్లు నమోదుకావడం గమనార్హం. మిగిలిన 15 హైస్కూల్ ప్లస్‌లలో మాత్రం ప్రథమ సంవత్సరంలో 354, ద్వితీయ సంవత్సరంలో 196 మంది కలిపి మొత్తం 550 మంది విద్యార్థులు చదువుతున్నారు. కళాశాలల్లో ఎలాంటి వసతులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.


సీజ్ చేసిన ఎరువుల బస్తాల వద్ద వ్యవసాయ అధికారులు

ఎరువుల లెక్క తప్పింది!

• బయటపడుతున్న అక్రమ నిల్వలు
• కలువాయిలో 840 బస్తాల సీజ్

కలువాయి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అక్రమంగా నిల్వ ఉంచిన ఎరువుల బస్తాలు బయటపడుతున్నాయి. కలువాయిలోని ఆగ్రో విక్రయ సేవా కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న 840 బస్తాల ఎరువులను వ్యవసాయ శాఖ అధికారులు సోమవారం గుర్తించి, సీజ్ చేశారు. ఆ ఎరువుల దుకాణాన్ని మండల వ్యవసాయాధికారి (ఏవో) వీ.ప్రతాప్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఐపీఎల్ యూరియా 660, ఐపీఎల్ పొటాష్ 180 బస్తాలు ఉన్నట్లు గుర్తించామని, వీటివిలువ విలువ రూ.4.5 లక్షలు ఉంటుందని ఏవో తెలిపారు. ఈ ఎరువులు కొనుగోలు చేసిన డిస్ట్రిబ్యూటరీ పేరు ఓ ఫాంలో నమోదు కాకపోవడంతోపాటు స్టాక్ రిజిష్టరులో కూడా నమోదు చేయలేదని వివరించారు. ఇలా నిబంధనలకు వ్యతిరేకంగా ఎరువులు నిల్వ ఉండటంతో సీజ్ చేసినట్లు చెప్పారు. ఎరువుల వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించినా, అధిక ధరలకు విక్రయించినా, సల్ఫర్ గుళికలు, ఇతర కాంప్లెక్స్ ఎరువులతో లింకు పెట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన వ్యారులను హెచ్చరించారు.

'సోమశిల'లో 72.234 టీఎంసీల నీరు

అనంతసాగరం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయానికి ఎగువ నుంచి 2,575 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. డ్యాం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 72.234 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 1,550, కండలేరుకు 1,200, ఉత్తర కాలువకు 650, దక్షిణ కాలువ 350 క్యూసెక్కుల నీరు సరఫరా అవుతోంది.

నాడు అలా.. నేడు ఇలా!

• కాలువలపై నీటి యాజమాన్యం చేసేవారేరీ..?
• ఈ ఏడాదీ జరగని లస్కర్ల నియామకం
• ఇప్పటికీ ప్రభుత్వం నుంచి రాని అనుమతులు
• అధికారులు సకాలంలో ప్రతిపాదనలు పంపని ఫలితం

6

చింత చచ్చినా పులుపు చావలేదన్నట్టుగా ప్రభుత్వం మారినా ఇరిగేషన్ శాఖలో పరిస్థితులు మాత్రం మారడం లేదు. పూర్తి ఆయకట్టులో సాగు మొదలైనప్పటికీ లస్కర్ల నియామకానికి మాత్రం ఇంతవరకూ అనుమతులు లభించలేదు. ఇప్పటికే సాగు మొదలై నెల రోజులు గడిచింది. ఇక పంట పూర్తయ్యాక లస్కర్లను నియమిస్తారా? అన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం అనుమతులు ఇస్తామన్నప్పుడు జిల్లా నుంచి అధికారులు ప్రతిపాదనలు పంపలేదు. తీరా అధికారులు ప్రతిపాదనలు పంపాక ప్రభుత్వం నుంచి అనుమతులు మంజూరు కావడం లేదు. తప్పు ఎవరిదన్నది పక్కన పెడితే ఈ ప్రభావం మాత్రం రైతాంగంపై తీవ్రంగా పడుతోంది. ఇది పరోక్షంగా రాష్ట్ర ఉత్పత్తిపై ప్రభావం చూపుతోంది. ప్రస్తుతానికి ప్రాజెక్టుల్లో పుష్కలంగా నీరు ఉంది కాబట్టి విచ్చలవిడిగా కాలువలకు వదిలేస్తున్నారు. ఇలా నీటి యాజమాన్యం సక్రమంగా జరగకపోతే ప్రాజెక్టుల్లో నీరు తరిగిపోయి రెండో పంట సమయంలో భూములను బీడు పెట్టుకోవాల్సిన దుస్థితి దాపురిస్తుంది. గతేడాది ఇదే జరిగింది. అయినా ఇరిగేషన్ శాఖ గుణపాఠం నేర్వలేదు.




విలేకరులతో మాట్లాడుతున్న అజయ్‌కుమార్, పక్కన మల్లికార్జున్, సుజయ్‌బాబు

లబ్ధిదారులకు టిడ్కో రుణ విముక్తి

• బ్యాంకర్లకు ప్రభుత్వమే చెల్లిస్తుంది • జూన్ నాటికి మొదటి దశ ఇళ్ల పూర్తి
• గృహ సముదాయాల్లో రేషన్ దుకాణాలు ఏర్పాటు చేస్తాం
• ఏపీ టిడ్కో చైర్మన్ అజయ్‌కుమార్ వెల్లడి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : టిడ్కో లబ్ధిదారులకు ప్రభుత్వం ఊరట ఇచ్చిందని, బ్యాంకులకు కట్టాల్సిన రూ.102 కోట్లను ప్రభుత్వమే చెల్లిస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ తెలిపారు. నగరంలోని జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం విలేకర్ల సమావేశంలో అజయ్‌కుమార్ మాట్లాడారు. వైసీపీ హయాంలో టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని నిలిపివేయడంతో పాటు పూర్తయిన గృహాలను కూడా లబ్ధిదారులకు ఇవ్వలేదన్నారు. బ్యాంకు నుంచి లబ్ధిదారుల పేరుతో తీసుకున్న రుణాన్ని గత ప్రభుత్వం పక్కదారి పట్టించిందని, దీంతో లబ్ధిదారులపై బ్యాంకర్ల ఒత్తిడి తీసుకొచ్చారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం టిడ్కో కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తోందన్నారు. లబ్ధిదారులపై బ్యాంకర్ల చేస్తున్న ఒత్తిడిని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. రుణాలను ప్రభుత్వం చెల్లించేలా నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. వచ్చే ఏడాది జూన్ నాటికి మొదటి దశ ఇళ్లను పూర్తి చేస్తామన్నారు. అలాగే టిడ్కో ఇళ్ల సముదాయంలో రేషన్ దుకాణాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ నేతలు నూనె మల్లికార్జున, సుజయ్‌బాబు, సుందర్‌రామిరెడ్డి, లాయర్ శ్రీరామ్, ప్రసాద్ పాల్గొన్నారు.

'రాళ్లపాడు' పాపం గత ప్రభుత్వానిదే!

కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు రిజర్వాయరు కుడికాలువ స్టాప్‌లాక్ గేటు విరిగిపడిపోయిన పాపం గత ప్రభుత్వానిదేనని, నిర్వహణ కోసం విడుదల చేసిన నిధులు బొక్కేయడం వల్లే ఈ దుస్థితి ఏర్పడిందని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. సోమవారం కందుకూరులోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ 2021-22, 2022-23లలో ప్రాజెక్టు నిర్వహణ కోసం వచ్చిన రూ.63 లక్షలలో ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని మండిపడ్డారు. స్టాప్‌లాక్ గేటు విరిగిపోతే నిధులు వచ్చేవరకు ఆగకుండా రూ.15 లక్షలు తన సొంత డబ్బు ఖర్చుచేసి రైతులకు నీరందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది చివరి ఆయకట్టు వరకు నీళ్లందించే బాధ్యతను తాను తీసుకుంటానని రైతులకు భరోసా ఇచ్చారు. తాత్కాలిక మోటార్ల ద్వారా నీరందించి ప్రాజెక్టులో నీటిమట్టం తగ్గాక పడిపోయిన గేటును లేపేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాళ్లపాడు ప్రాజెక్టు పరిస్థితిని ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లుతున్నామని, ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు స్వయంగా పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. ఆధునిక టెక్నాలజీ గేట్లు అందుబాటులోకి వచ్చినా ఈ ప్రాజెక్టుకు 75 సంవత్సరాల నాడు ఏర్పాటు చేసిన గేట్లే ఉండటం పట్ల మంత్రి కూడా విస్మయం వ్యక్తం చేశారని అన్నారు. రానున్న వేసవిలో పూర్తిస్థాయి మరమ్మతులకు చర్యలు తీసుకోవటం జరుగుతుందని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. ప్రాజెక్టు దుస్థితికి కారణమైన వారే నేడు రాజకీయాలు చేస్తూ తమపై బురద జల్లాలని చూస్తున్నారని అయితే వారి ఆటలను రైతులు అర్థం చేసుకోలేనంత అమాయకులు కాదని మండిపడ్డారు. అభివృద్ధి మండలి పేరుతో కొందరు విమర్శలు చేస్తున్నారని, అభివృద్ధి మండలికి తాను వ్యతిరేకం కాదనీ, ఉదయం వైసీపీ కార్యాలయంలో జగన్ జన్మదిన వేడుకలు జరిపి సాయంత్రం అభివృద్ధి మండలి పేరుతో ప్రభుత్వాన్ని విమర్శిస్తుంటే చూస్తూ ఊరుకునేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు

ఇంకెన్నాళ్లు!


• ఆగిన కండలేరు లెఫ్ట్ కెనాల్ పనులు
• కూటమి ప్రభుత్వమైనా శ్రద్ధ చూపేనా?

పొదలకూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తెలుగుగంగ పథకంలో భాగమైన కండలేరు ఎడమ కాలువ లైనింగ్ పనులు ఏడు నెలలుగా ఆగిపోయాయి. ఈ కాలువ ద్వారా మూడు మండలాల్లోని 32 చెరువులకు నీరు అందించడంతోపాటు 27వేల ఎకరాలకు సాగు నీరందుతోంది. తెలుగుగంగ హైలెవల్ స్లూయిజ్ నుంచి కనుపూరు కాలువ వరకు లైనింగ్ పనులకు రూ.39.12 కోట్లు మంజూరయ్యాయి. 2021, సెప్టెంబరులో అప్పటి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి పనులు ప్రారంభించారు. అనంతరం పులికల్లు స్పిల్‌వే దాటి నరసింహకండ్రిగ గ్రామ సమీపం వరకు 19కిలోమీటర్ల వరకు పనులు చేశారు. రెండేళ్ల నుంచి మిగిలిన లైనింగ్ పనులను పూర్తి చేయకుండా వదిలివేశారు. లైనింగ్ పూర్తయితే ఆయకట్టు విస్తీర్ణం రెట్టింపు అయ్యే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం కాలువకు 350 క్యూసెక్కుల నీటిని విడుదల చేసే సామర్థ్యం ఉండగా, లైనింగ్ పనులు పూర్తయితే 455 క్యూసెక్కుల నీటిని విడుదల అవకాశం ఉంది. అయితే వైసీపీ ప్రభుత్వం అన్నదాతల ఆశలను అడియాశలు చేసింది. పనులను అసంపూర్తిగా వదిలేసింది.

• కాకాణి చొరవ చూపి ఉంటే...

ఈ కాలువ కింద చేజర్ల, పొదలకూరు, నెల్లూరు రూరల్ మండలాలకు సాగునీరు అందుతుంది. డ్యాంలో నీరు తక్కువగా ఉన్నప్పుడు కాలువ చివరి ఆయకట్టుకు నీరందక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రిగా కాకాణి అప్పట్లో ప్రత్యేక చొరవ చూపి ఉంటే ఎప్పుడో లైనింగ్ పనులు పూర్తయ్యేవి. కమీషన్ మీద ఉన్న శ్రద్ధ లైనింగ్ పనులపై లేదని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కాకాణిని పలు సందర్భాల్లో విమర్శిస్తూనే ఉన్నారు. రైతులకు తక్షణ అవసరమైన కండలేరు లిఫ్ట్ ఇరిగేషన్ పనులను పట్టించుకోకుండా, విద్యుత్‌బిల్లుల బకాయిలు చెల్లించకుండా, కండలేరు లైనింగ్ పనులు ప్రారంభించారు. ఆ పనుల్లో కమీషన్ అందగానే ఆపేశారని ఇప్పటికీ కాకాణిని, సోమిరెడ్డి తీవ్రస్థాయిలో విమర్శిస్తుంటారు. ఒక్క ఏడాదిలో పూర్తి చేయాల్సిన లైనింగ్ పనులను రెండున్నర ఏళ్లయినా పూర్తి చేయని గత వైసీపీ ప్రభుత్వ అసమర్థతను ప్రజలు విమర్శిస్తూనే ఉన్నారు. కూటమి ప్రభుత్వమైనా లైనింగ్ పనులు పూర్తిచేసేలా చొరవ చూపాలని అన్నదాతలు కోరుతున్నారు.


కండలేరు ఎడమ కాలువ



పుచ్చకాయపై ఏసుప్రభువు

ప్రపంచ వ్యాప్తంగా బుధవారం క్రిస్మస్‌ను జరుపుకోనున్నారు. ఈ నేపథ్యంలో సూక్ష్మచిత్రాల కళాకారుడు గంథవళ్ల ఉమాశంకర్ పుచ్చకాయపై క్రీస్తు చిత్రాన్ని చిత్రీకరించి క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన నగరంలోని సుంకు చెంగన్న ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)





శారాబిలాక్ ముస్తాబు

కోవూరు పట్టణంలోని శారాబిలాక్ చర్చి క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైంది. శత వసంతాలు నిండిన శారాబిలాక్ చర్చిలో ప్రతి ఏటా క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది అంతకంటే ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు శ్రీకారం చుట్టారు. దీంతో ముందుగానే చర్చితోపాటు, ఆ వీధిలోనూ విద్యుద్దీపాలతో అలంకరించారు. చర్చిలో పలు కార్యక్రమాల నిర్వహణ, భారీ క్రిస్మస్ కేక్ కట్ చేసేందుకు ఏర్పాట్లను పూర్తి చేశారు.

- కోవూరు,(ఆంధ్రజ్యోతి)

విద్యుత్ సమస్య
పరిష్కారానికి కృషి చేస్తా

● ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

జలదంకి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌కో ఏఈలకు పట్టణాలపై మోజు... పేరుతో సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ స్పందించారు. నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలకు ట్రాన్స్‌కో ఏఈలు నియామకం లేక సబ్‌ఇంజనీర్లు ఇన్‌చార్జిలుగా ఉండటమే ప్రధాన కారణం అని ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సాధ్యమైనంత త్వరగా ఏఈల నియామకం చేపట్టేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు.



నాడు అలా.. నేడు ఇలా!

● కాలువలపై నీటి యాజమాన్యం చేసేవారేరీ..?
● ఈ ఏడాదీ జరగని లస్కర్ల నియామకం
● ఇప్పటికీ ప్రభుత్వం నుంచి రాని అనుమతులు
● అధికారులు సకాలంలో ప్రతిపాదనలు పంపని ఫలితం
● ప్రజాప్రతినిధులకు తెలుసో.. తెలియదో?
● పూర్తి ఆయకట్టులో మొదలైన సాగు

ప్రభుత్వం వేరు.. అదే తీరు..!

నెల్లూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : చెరువులు, కాలువల నుంచి నీటిని అవసరం మేరకు చివరి ఆయకట్టు వరకూ విడుదల చేయడంలో లస్కర్ల పాత్ర కీలకం. వీరు కాలువలపై తూములు, చెక్కలను అవసరం మేరకు ఎత్తుతూ, దించుతూ ఉంటారు. ఇంతటి కీలకమైన లస్కర్ల వ్యవస్థను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. గడిచిన మూడు సీజన్లుగా లస్కర్ల నియామకం జరగలేదు. లస్కర్లకు అప్పటివరకూ పనిచేసిన వేతనాలను పెండింగ్ పెట్టడమే కాకుండా తొలగించింది. ఇటీవల కొంత మొత్తాన్ని సర్దుబాటు చేయగా, ఇంకా రూ.85 లక్షల వరకూ వేతన బకాయిలు చెల్లించాల్సి ఉంది. జిల్లాకు సుమారు 230 మంది లస్కర్ల అవసరం ఉండగా, ఏడాదికి పది నెలలు మాత్రమే నెలకు రూ.10,500 చొప్పున వేతనం చెల్లిస్తుంటారు. ఈ లెక్కన చూసుకున్నా ఏడాదికి రూ.2 కోట్లు మాత్రమే లస్కర్లకు ఖర్చవుతుంది. అయితే, వీరు సక్రమమైన నీటి యాజమాన్యం ద్వారా అంతకన్నా అనేక రెట్లు విలువైన నీటిని పొదుపు చేయడంతోపాటు రైతుల ఇబ్బందులను తొలగిస్తుంటారు. కానీ వైసీపీ ప్రభుత్వం వీరిని అర్ధంతరంగా తొలగించి రైతాంగానికి సమస్యలు తెచ్చి పెట్టింది. గతేడాది రెండో పంట సమయంలో సుమారు 20 టీఎంసీల నీరు లస్కర్లు లేని మూలంగా దుర్వినియోగం జరిగింది. ఆ ప్రభావం గతేడాది రబీ సాగుపై పడింది. సగం ఆయకట్టు మాత్రమే సాగు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దీనిపై అప్పటి ప్రతిపక్ష నేతలు, ఇప్పటి ఎమ్మెల్యేలు అనేక విమర్శలు చేశారు.

● **ఎవరికీ పట్టడం లేదు!**

ప్రకృతి సహకరించడం, ప్రాజెక్టుల్లోకి పుష్కలంగా నీరు చేరడంతో ఈ ఏడాది పూర్తి ఆయకట్టుకు నీటి కేటాయింపులు జరిపారు. సోమశిల ప్రాజెక్టు కింద 5.5 లక్షల ఎకరాలు, కండలేరు కింద 2.26 లక్షల ఎకరాల ఆయకట్టు సాగు జరుగుతోంది. మొత్తంగా చూసుకుంటే జిల్లాలో అధికారికంగా, అనధికారికంగా ఏడు లక్షల ఎకరాల్లో వివిధ పంటల సాగు జరుగుతోంది. ఈ సమయంలో లస్కర్ల అవసరం చాలా ఉంది. కానీ వైసీపీ ప్రభుత్వంలో జరిగిన తప్పే ఇప్పుడూ జరుగుతోంది. సాగు మొదలై నెల రోజులు గడిచినా ఇంత వరకూ లస్కర్ల నియామకానికి అనుమతులు రాలేదు. గత నెలలో ఓఅండ్‌ఎం పనులను ప్రభుత్వం మంజూరు చేసింది. అప్పుడే లస్కర్ల నియామకానికి కూడా ప్రతిపాదనలు పంపాలని ప్రభుత్వం ఆదేశించినా జిల్లా రెగ్యులర్ ఇరిగేషన్ అధికారులు మాత్రం పట్టించుకోలేదు. మిగిలిన జిల్లాల్లోనూ, ఆఖరుకు తెలుగు గంగ ప్రాజెక్టు కింద లస్కర్ల నియామకానికి అనుమతులు వచ్చాయి. అంతా అయిపోయాక అధికారులు తీరిక చేసుకొని ప్రతిపాదనలు పంపారు. కానీ ఆ తర్వాత ప్రభుత్వం నుంచి స్పందన లేకపోయింది. దీనిని అధికారులు కూడా పట్టించుకోవడం మానేశారు. ఆఖరుకు ఈ విషయం ప్రజాప్రతినిధులకు తెలుసో లేదో కూడా తెలియదు. రెండు, మూడు నెలల క్రితం జరిగిన జడ్పీ సమావేశం, జిల్లా అభివృద్ధి మండలి సమావేశాల్లో లస్కర్ల సమస్యపై ప్రస్తావించిన ఎమ్మెల్యేలు ఇప్పుడు ఎందుకు పట్టించుకోవడం లేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అయితే అధికారులు ఈ విషయాన్ని ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లడం లేదని తెలుస్తోంది.

మరోసారి రిమైండ్ చేస్తాం

లస్కర్ల నియామకానికి సంబంధించి ప్రతిపాదనలు పంపాం. పెండింగ్ వేతనాలు రూ.85 లక్షలు చెల్లించాలని కూడా నివేదించాం. ఇంకా అనుమతులు రాలేదు. మరోసారి ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు రిమైండ్ చేస్తాం.

- దేశా నాయక్, ఇరిగేషన్ ఎస్ఈ

గాలేరు-నగరి ఈఈ హరిబాబుపై వేటు

ఆదాల కంపెనీకి అక్రమంగా బ్యాంకు గ్యారెంటీ వాపస్

శాఖాపరమైన విచారణకు ఆదేశం ● తాజాగా సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు

తిరుపతి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గాలేరు-నగరి సుజల స్రవంతి ప్రాజెక్టుకు సంబంధించి తిరుపతి ఎఫ్‌ఏసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఈఈ)గా వ్యవహరిస్తున్న సీహెచ్ హరిబాబును ప్రభుత్వం సస్పెండ్ చేసింది. నెల్లూరు జిల్లా వైసీపీ నేత ఆదాల ప్రభాకర్‌రెడ్డికి చెందిన నిర్మాణ కంపెనీకి.. నిబంధనలు ఉల్లంఘించి బ్యాంకు గ్యారెంటీ విడుదల చేసిన కారణంగా ఆయనపై వేటుపడింది. ఈ పథకం కింద కడప జిల్లా నుంచి ఉమ్మడి చిత్తూరు జిల్లాకు కాలువ తవ్వాల్సి ఉంది. శేషాచల పర్వతాలు అడ్డుగా ఉన్నందున టన్నెల్ కూడా తవ్వాలి. ఈ పనుల ఇన్వెస్టిగేషన్, డిజైన్లతో పాటు మెయిన్ కెనాల్ 245వ కిలోమీటరు నుంచి 262.100 కిమీ వరకు కాలువ తవ్వకం.. అలాగే 262.100 కిమీ నుంచి 272.800 కిమీ వరకూ బాలాజీ టన్నెల్-2 తవ్వకం, లైనింగ్ పనులకు 2007-08లో నాటి ప్రభుత్వం జలయజ్ఞం కింద టెండర్లు పిలిచింది. ఆదాల ప్రభాకర్‌రెడ్డికి చెందిన మెస్సర్స్ ఏపీఆర్‌సీఎల్-సీఆర్ఎస్ఎస్‌జీ (జేవీ) హైదరాబాద్ కంపెనీకి టెండర్లు ఖరారయ్యాయి. ప్రభుత్వం ఆ కంపెనీకి మొబిలైజేషన్ అడ్వాన్సు కూడా చెల్లించింది. ఆ పనులకు సంబంధించి ఆ కంపెనీ రూ.1.36 కోట్లు బ్యాంకు గ్యారెంటీ ఇచ్చింది. ఎంతకాలమైనా పనులు చేపట్టలేదు. దీంతో ఇంజనీరింగ్ అధికారులు కంపెనీకి నోటీసులు జారీ చేశారు. అడ్వాన్సు తీసుకుని కూడా పనులు చేపట్టనందున తీసుకున్న అడ్వాన్సు మొత్తాన్ని ప్రభుత్వానికి వాపస్ చేయాలని నోటీసుల్లో కోరారు. దీనికి ప్రతిగా కంపెనీ ప్రతినిధులు తమకు సకాలంలో అవసరమైన అనుమతులు, ఆమోదాలు ఇవ్వలేదని, దానివల్ల పనులు చేపట్టలేకపోయామని సమాధానమిచ్చారు. మొబిలైజేషన్ అడ్వాన్సుతో మెషినరీ కొనుగోలు చేశామని, పనులు లేక వాటిని ఖాళీగా పెట్టినందున తామే నష్టపోయామని అందులో పేర్కొన్నారు. అడ్వాన్సు నిధులు పోను ప్రభుత్వమే తమకు అదనంగా సుమారు రూ.91 లక్షలు చెల్లించాలని క్లెయిమ్ చేశారు. అప్పటి నుంచి ఆ వివాదం పెండింగులో ఉంది. కరోనా సమయంలో కాంట్రాక్టర్లు ప్రభుత్వానికి చెల్లించాల్సిన బాకీలేవైనా ఉంటే వాటికి సరిపడా మాత్రమే బ్యాంకు గ్యారెంటీలు ఉంచుకుని మిగిలిన గ్యారెంటీలను విడుదల చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దానికనుగుణంగా ఆదాల కంపెనీకి కూడా గాలేరు-నగరి ప్రాజెక్టు ఎస్ఈ, ఈఈ నోటీసులిచ్చారు. అడ్వాన్సు వెనక్కి చెల్లించి బ్యాంకు గ్యారెంటీ వాపస్ తీసుకోవాలని కోరారు. ఆ అధికారులు నిబంధనల ప్రకారం నిక్కచ్చిగా వ్యవహరించడంతో 2022-23లో వారిపై బదిలీ వేటు పడింది. ఆ స్థానంలో హరిబాబును ఎఫ్‌ఏసీ ఈఈగా నియమించారు. ఆయన వచ్చీ రాగానే ఆదాల కంపెనీకి ప్రభుత్వమే బాకీ పడిందని పేర్కొంటూ కంపెనీకి బ్యాంకు గ్యారెంటీని రిలీజ్ చేసేశారు. ఫలితంగా ప్రభుత్వం చెల్లించిన మొబిలైజేషన్ అడ్వాన్సును ఎలా వెనక్కి రాబట్టాలో అంతుబట్టక ఇరిగేషన్ ఉన్నతాధికారులు సతమతమవుతున్నారు. ఈ వ్యవహారం ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో నిబంధనలకు విరుద్ధంగా బ్యాంకు గ్యారెంటీలను విడుదల చేసిన హరిబాబుపై శాఖాపరమైన విచారణకు ఆదేశించింది. ఆ క్రమంలో అతడిని సస్పెండ్ చేస్తూ జలవనరుల శాఖ ప్రత్యేక సీఎస్ సాయిప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పంట కాలువైనా పర్లేదు... కబ్జా చేసేస్తాం !



కబ్జాకు గురైన జాతీయ రహదారికి అనుకుని ఉన్న కాలువ

నెల్లూరురూరల్, డిసెంబరు 23, (ఆంధ్ర జ్యోతి): నగరంలో ప్రభుత్వ స్థలాలను ఆక్ర మించడం చాలా సులభం. ఎందుకంటే అధికారులుకానీ, ప్రజాప్రతినిధులుకానీ ఎవ రూ పట్టించుకోరు. ఈ ఫొటోలో కనిపిస్తున్న ప్రాంతం చింతారెడ్డిపాళెం కూడలి. జాతీ య రహదారికి అనుకుని ఎన్టీఆర్‌నగర్ వైపు పెద్ద పంటకాలువ ఉంది. ఇది జలవ నరుల శాఖ ఆస్తి. దీన్ని ఆక్రమించి, చదును చేసి రెస్టారెంట్లు, హోటళ్లు, బార్లు, ఇతర వాణిజ్య సముదాలు నిర్మిస్తున్నారు. అయినా ఇరిగేషన్ అధికారులు నోరుమెదపడం లేదు. కన్నెత్తి కూడా చూడడం లేదు. రూ. లక్షలు కాదు కదా.. రూ. కోట్లు విలువైన స్థలమిది. ఈ ఆక్రమణలు తొలగిస్తారో.. కొనసాగిస్తారో.. చూడాలి మరి..!

విద్యారంగం ఉన్నతికి కృషి

● సమగ్ర శిక్ష ఏపీసీ వెంకట సుబ్బయ్య

నెల్లూరు (విద్య), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో విద్యారంగ ఉన్నతికి కృషి చేస్తానని సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ (ఏపీసీ) డీ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఎస్ఎస్ఏ ఏపీసీగా ఉదయగిరి ఎంఆర్ఆర్ డిగ్రీ కళాశాల ఎకనామిక్స్ లెక్చరర్ వెంకటసుబ్బయ్యను నియమించడంతో ఆయన సోమవారం కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాకు చెందిన తాను ఉపాధ్యాయుడిగా, అధ్యాపకుడిగా సేవలందించానన్నారు. విద్యారంగంలో అనుభవంతో పాటు స్వస్థలం కావడంతో జిల్లాపై తనకు అవగాహన ఉందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలో విద్యాభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆయనకు ఎస్ఎస్ఏ కార్యాలయ సిబ్బంది, విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.



బాధ్యతలు చేపడుతున్న వెంకట సుబ్బయ్య

అనవసరాలకూ తరలిపోతున్న ఇసుక, తువ్వఇసుక

ఇసుకతో మునిగిపోతున్న పొలాలు, లేఔట్లు



దామరమడుగు వద్ద ఇసుక, తువ్విసుకతో వ్యవసాయ భూములను చదును చేస్తున్న ఎక్స్‌కవేటర్

'ఉచితం' ముసుగులో
ఇష్టారాజ్యం

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక పాలసీ విచ్చలవిడితనంతో ఇష్టారాజ్యంగా తయారైంది. గత వైసీపీ ప్రభుత్వంలో సామాన్యులు సైతం ఇసుకను కొనలేక ఇళ్ల నిర్మాణాలు ఆపేసుకున్నారు. లబ్ధిదారులకు రీచ్‌ల నుంచి ఇసుక ఉచితంగా పంపిణీ చేస్తామన్న నాటి ప్రభుత్వం లోడింగ్, రీచ్ నుంచి యార్డు దాకా రవాణా చార్జీలతోసహా వసూలు చేసింది. దీంతో లబ్ధిదారులకు తడిసి మోపెడయ్యింది. అయితే, అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ కూటమి పేదలకు ఇసుక కష్టాలు తలెత్తకుండా సీఎం చంద్రబాబు ఉచిత ఇసుక పాలసీని ప్రవేశపెట్టారు. అయితే, అధికార, విపక్ష పార్టీలతోపాటు అధికారులంతా అక్రమార్కులతో కుమ్మక్కై అవసరాలకన్నా ఆ ముసుగులో అనవసరాలకే లేఅవుట్లు, ప్లాట్లు, పొలాలకు తరలిస్తున్నారు. అంతేగాక చెన్నై, బెంగుళూరు వంటి మహానగరాలకూ గుట్టుచప్పుడు కాకుండా రవాణా చేస్తున్నారు. బుచ్చి, కోవూరు, ఇందుకూరుపేట, విడవలూరుతోపాటు పెన్నా పరివాహక ప్రాంతాల నుంచి లారీలు, టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా రేయింబవళ్లు ఇసుకను తరలిస్తున్నారు. బుచ్చి మండలంలోని మినగల్లు, జొన్నవాడ, కాగులపాడు, దామరమడుగు గ్రామాల పరిధిలోని పెన్నా పరివాహక ప్రాంతాలలో విచ్చలవిడిగా ఇసుక, తువ్విసుకను తవ్వి తోడేస్తున్నారు. బుచ్చినుంచి షుగర్ ఫ్యాక్టరీ దాకా జాతీయ రహదారికి ఇరువైపులా విచ్చలవిడిగా వెలసిన లే అవుట్లకు తెరకొచ్చిన ఇసుక, తువ్విసుకను తరలిస్తున్నారు.

● **తీరం వెంబడి తవ్వకాలు**

మినగల్లు నుంచి దామరమడుగు పల్లిపాళెం దాకా పెన్నా తీరం వెంబడి చేపడుతున్న ఇసుక తవ్వకాలతో భూగర్భజలాలు అడుగంటే ప్రమాదం వుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. భవిష్యత్తులో సాగు, తాగునీటికి ఇబ్బందులు తప్పవని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. అక్రమార్కుల ఆగడాలపై తెలిసినా, ఎవరైనా ఫిర్యాదు చేసినా భూగర్భ జలశాఖ అధికారులు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. మరోవైపు దామరమడుగు, మినగల్లు, జొన్నవాడ, కాగులపాడు ప్రాంతాల్లోని పెన్నా కరకట్టలు ధ్వంసమవుతున్నా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, ఇసుకాసురులపై చర్యలు తీసుకోవాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.



ఇసుక ట్రాక్టర్ల రాకపోకలతో ధ్వంసమైన పెన్నా కరకట్ట

జనరల్ ఆసుపత్రి

● ప్రైవేట్ ఆసుపత్రులు తిరస్కరించిన కేసులు సైతం నయం ● ఏడాదికి 500లకుపైగా మేజర్ ఆపరేషన్లు ● పేద, మధ్య తరగతికి ఎంతో ఉపయోగం

ఆర్థోలో ఆధునిక వైద్యం

● ఇందుకూరుపేట మండలం రాముడుపాళెం రొయ్యల గుంట వద్ద కాపలాగా ఉన్న చెంబేటి నాగరాజు, అనితల కుమారుడు ఏడేళ్ల వరణ్ ఆడుకుంటూ ఏరియేటర్ ఫ్యానుపై పడిపోయాడు. అందులో ఇరుక్కుని కాళ్లు, చేతులు విరిగాయి. ఒకటి కాదు.. రెండు కాదు ఏకంగా అయిదు చోట్ల కాళ్లు చేతులు విరిగి ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆ బాలుడికి చికిత్స చేసేందుకు ప్రైవేట్ ఆసుపత్రులు తిరస్కరించాయి. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తీసుకు రాగా ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు ఈ కేసును ఒక చాలెంజ్‌గా తీసుకుని ఆ బాలుడికి 8 గంటలపాటు శస్త్రచికిత్స చేసి పునర్జన్మను ప్రసాదించారు.

● నెల్లూరు నగరానికి చెందిన మాలకొండయ్యకు రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు విరిగాయి. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా ఆర్థోపెడిక్ వైద్యులు 4 గంటలపాటు శస్త్రచికిత్స చేసి ఆయన కాళ్లను సరిచేశారు. రెండు నెలల విశ్రాంతి అనంతరం ప్రస్తుతం మాలకొండయ్య తన పనులు తాను చేసుకుంటున్నాడు.



ఐదుచోట్ల ఎముకలు విరిగిన చిన్నారి వరుణ్‌కు శస్త్రచికిత్స చేసిన వైద్య నిపుణులు (ఫైల్)

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కీళ్ల, ఎముకల విభాగం (ఆర్థోపెడిక్) ఆధ్వర్యంలో ప్రస్తుతం అత్యాధునిక వైద్య సేవలు అందుతున్నాయి. ఈ విభాగానికి ఏటా 30 వేల మంది వ్యాధిగ్రస్తులు వస్తుండగా వారిలో 4వేల మంది వరకు ఇన్‌పేషెంట్లుగా చేరుతున్నారు. జీజీహెచ్‌కు ఎక్కువగా పేద, మధ్య తరగతి ప్రజలే వస్తుంటారు. వీరుకాక ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడ్డ వారిని ఇక్కడికి తరలిస్తుంటారు. అలాంటి వారికి ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు విజయవంతంగా శస్త్రచికిత్స చేస్తున్నారు. కొన్ని ప్రైవేట్ ఆసుపత్రులు చేతులెత్తేసిన కేసులకు కూడా జీజీహెచ్ వైద్య నిపుణులు మెరుగైన చికిత్సలు అందించి ప్రశంసలు అందుకున్న సంఘటనలు ఉన్నాయి. 8 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ముగ్గురు అసోసియేట్ ప్రొఫెసర్‌లు, ఒక ప్రొఫెసర్ ఇక్కడ అత్యాధునిక వైద్య చికిత్సలు అందిస్తున్నారు. ఎక్స్‌రేతోపాటు ఎమ్మారై, సిటీస్కాన్ వంటి పరికరాలు ఉండటంతో వైద్యులు సకాలంలో చికిత్సలు అందించేందుకు వీలు కలుగుతోంది.



మేజర్ శస్త్రచికిత్సలు

జీజీహెచ్ ఆర్థోపెడిక్ విభాగంలో ఏటా 500కుపైగా మేజర్ శస్త్రచికిత్సలు జరుగుతున్నాయి. మరో 1300 వరకు మైనర్ శస్త్రచికిత్సలు చేస్తున్నారు. ఇవే కాక ఏడాదిగా మోకీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలకు ప్రాధాన్యమిస్తున్నారు. ఇన్‌పేషెంట్లకు అన్ని సదుపాయాలతో కూడిన భవనాలు అందుబాటులో ఉండటం, ఆధునిక వైద్య చికిత్సలు అందిస్తుండటంతో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

నాలుగేళ్లుగా శస్త్రచికిత్సలు ఇలా...

సంవత్సరం	మేజర్ శస్త్రచికిత్సలు	మైనర్ శస్త్రచికిత్సలు
2021-22	510	1180
2022-23	567	1320
2023-24	662	1482
2024-25	549	1294

అన్ని రకాల శస్త్రచికిత్సలు చేస్తున్నాం

ఆర్థోపెడిక్ విభాగంలో క్రిటికల్ కేసులను కూడా చాలెంజ్‌గా తీసుకుని శస్త్రచికిత్సలు చేస్తున్నాము. రోగుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. మొత్తం ఆర్థోపెడిక్ విభాగంలో ఉన్న 12 మంది వైద్య నిపుణులు కేసులను ప్రత్యేకంగా చూస్తున్నారు. ప్రమాదాల్లో గాయపడిన వారికి అత్యవసర చికిత్సలు అందిస్తున్నాం.

- డాక్టర్ మస్తాన్‌బాషా, అసోసియేట్ ప్రొఫెసర్

అధ్వానంగా ఆర్టీసీ బస్టాండ్ పరిసరాలు

● పట్టించుకోని అధికారులు, పాలకులు

కావలి రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వస్త్ర వ్యాపారంలో రెండో ముంబాయిగా పేరు పొందిన కావలిలో పారిశుధ్యం కొరవడింది. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ పరిసరాలు మాత్రం చెత్త కుప్పలు, పందుల సంచారంతో దుర్గంధం వెదజల్లుతూ కంపుకొడుతుందని ప్రయాణికులు చెబుతున్నారు. చుట్టుపక్కల నివాసాల్లోని చెత్తను స్థానిక బస్టాండ్ ప్రాంగణంలో వేస్తుండటంతో ఈ సమస్య నెలకొందని వాపోతున్నారు. అలాగే బస్టాండ్‌లో ప్రయాణికులకు సరిపడా మరుగుదొడ్లు లేవు. పరిసర ప్రాంతాల్లో నివాసం ఉన్న వారు రాత్రి సమయాల్లో బస్టాండ్ పరిసరాల్లో బహిరంగ మల విసర్జన చేస్తుండటంతో పరిసరాలు కంపుకొడుతున్నాయి. బస్టాండ్ నుండి గ్యారేజీలోకి వెళ్లే మార్గంలో నడవాలంటే ముక్కు మూసుకో వాల్సిన పరిస్థితి ఉంది. విద్యా, వ్యాపారపరంగా ఎంతో పేరుగాంచిన పట్టణానికి ఇతర ప్రాంతాల నుండి వ్యాపార నిమిత్తం వచ్చేవారు బస్టాండ్ దుస్థితిని చూసి నివ్వెరపోతున్నారు. అధికారులు స్పందించి బస్టాండ్ సమీపంలో పారిశుధ్య పనులు చేపట్టి సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.



చెత్తకుప్పలతో గ్యారేజీకి వెళ్లే రోడ్డు

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఆత్మకూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని 11 మంది లబ్ధిదారులకు రూ.11.18 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను సోమవారం రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నెల్లూరు క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. బాధిత కుటుంబాలకు ఇంటి పెద్దగా సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సాయం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు బాధితుల తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

● ఏఎస్ పేట: అనుమసముద్రం కంకణాల లక్ష్మీదేవమ్మ అనే మహిళ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఆమె ఆర్థిక పరిస్థితి కూడా సరిగా లేకపోవడంతో గ్రామ టీడీపీ నాయకుడు సుధాకర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి తెలిపారు. దీంతో మంత్రి ఆనం చొరవతో రూ. 120583 సీఎం సహాయ నిధి నుంచి మంజూరు చేయించారు. ఆ చెక్కును సోమవారం బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. దీంతో మంత్రి ఆనంకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఆవులను బందిలదొడ్డికి తరలించండి

కావలి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఆవులు రోడ్లపై సంచరిస్తున్నాయని వాటిని నియంత్రించాలని టీవీఎస్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ తోట వెంకటేశ్వర్లు కోరారు. ఈ మేరకు ఆయన సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డితో కలిసి సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఆర్డీవో వంశీక్రిష్ణకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. ఆవులు రోడ్లపై తిరుగుతూ రాత్రంతా ఉంటున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవటం దారుణం అన్నారు. ఈ సమస్యతో రాత్రి సమయంలో వచ్చే వాహనదారులకు అవి కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. ఇప్పటికైనా స్పందించి ఆవుల యజమానులకు చెప్పి అవి రోడ్లపైకి రాకుండా చూడాలని వారు వినకపోతే వాటిని బందీలదొడ్డికి తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

గురుకుల విద్యార్థినులకు వైద్య పరీక్షలు

సంగం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల కళాశాల విద్యార్థినులకు సోమ వారం వైద్య పరీక్షలు నిర్వహించారు. కళాశాలకు చెందిన 15మంది జ్వరాలతో వైద్యశాలకు వెళ్లారు. గమనించిన వైద్యాధికారి శ్రీనివాసులురెడ్డి కళాశాలకు చేరుకుని విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించి సాధారణ జలుబు, దగ్గు, జ్వరాలు మాత్రమేనని గుర్తించారు.

పేదలకు దుస్తుల పంపిణీ

బిట్రగుంట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బోగోలు పంచాయతీ బేతనీపేట దిసెంట్రల్ తెలుగు బాప్టిస్ట్ చర్చి వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం పారిశుధ్య కార్మికులు, పేదలకు దుస్తులు, భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నెల్లూరు పాస్టర్ వై.రత్నం, స్థానిక సంఘ కాపరి ఏఎస్ జేసఫ్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం చర్చి ఆవరణంలో నూతనంగా నిర్మించిన బాప్తీస్మము తొట్టి, అదనపు భవనాన్ని ప్రారంభించారు. సండేస్కూల్ చిన్నారులతో మినీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో బచ్చు నవీన్, కమిటీ సభ్యులు, సంఘస్తులు పాల్గొన్నారు.

విద్యా ఉపకరణాల అందజేత

కొండబిట్రగుంట డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం రామిశెట్టి వెంకటసుబ్బారావు ట్రస్ట్ సభ్యులు భోజన ప్లేట్లు, పాఠశాలకు మెగా మైకును ఎంఈవో జయమ్మ, నరసింహారావుల చేతుల మీదుగా హెచ్ఎం ప్రసాద్‌రావుకు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ కన్వీనర్ మెతుకు రాజేశ్వరి, విద్యాకమిటీ చైర్మన్ మధు, కౌసల్య, సహోపాధ్యాయిని విజిత ఉన్నారు.

శ్రీనివాస రామానుజన్‌కు ఘన నివాళి

ఉదయగిరి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జాతీయ గణిత దినోత్సవ వేడుకల్లో భాగంగా శ్రీనివాసరామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్.నారాయణస్వామి, వైస్ ప్రిన్సి పాల్ ఏ నరసింహులు, అధ్యాపకులు కేసీ విక్రమ్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నారాయణస్వామి

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఉదయగిరి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల వైద్యఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సీహెచ్‌వో శివకుమారి, హెచ్ఈ వెంకటసుబ్బయ్యలు సూచించారు. సోమవారం స్థానిక పాత సామాజిక ఆరోగ్య కేంద్రం భవనంలో వైద్యఆరోగ్య సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిబ్బందికి ఇచ్చిన లక్ష్యాలను పూర్తిచేయాలన్నారు. జ్వరపీడితులు ఉన్న గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటుచేసి ఇంటింటా సర్వే చేపట్టాలన్నారు. అనంతరం నెలవారీ నివేదికలు తనిఖీచేసి తగు సూచనలు, సలహాలు అందజేశారు.

మద్యం దుకాణాన్ని ఎత్తేయండి

● కలెక్టర్‌కు పోకూరు ఎస్సీ కాలనీవాసుల వినతి

వలేటివారిపాలెం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తమ కాలనీలో ఏర్పాటు చేసిన మద్యం షాపును ఎత్తివేయాలని స్థానిక ఎంపీటీసీ నూకతోటి విజయలక్ష్మీతో పాటు పలు ప్రజా సంఘాల నాయకులతో కలిసి సోమవారం నెల్లూరులో కలెక్టర్ ఆనంద్‌కు గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేసినట్లు పోకూరు ఎస్సీ కాలనీవాసులు తెలిపారు. మద్యం షాపును నివాస గృహాలు ప్రక్కనే పెట్టడంతో మందుబాబులు మద్యం సేవించి ఆ వైపు వెళ్లే మహిళలను దుర్భాషలాడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తలపల శివ కుమారి, జి. వెంకటేశ్వర్లు, జీవీబీ కుమార్, నూకతోటి వీరనారాయణ తదితరలు ఉన్నారు.

కందుకూరులో ఉత్తర బైపాస్ రోడ్డు



ఎమ్మెల్యే ఇంటూరిని సత్కరిస్తున్న చుండి సాగునీటి సంఘం సభ్యులు

కందుకూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఉత్తర బైపాస్‌రోడ్డు నిర్మించాల్సిన ఆవశ్యకతను ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు వివరించగా తక్షణం పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆర్థికశాఖకు సూచించినట్లు ఎమ్మెల్యే ఇంటూరి తెలిపారు. అలాగే నియోజకవర్గంలో అద్దె భవనాల్లో నడుస్తున్న ఉద్యాన కళాశాలకు చినలాటిరిపి వద్ద శాశ్వత భవనాల నిర్మాణానికి నిధులు మంజూరుకు కూడా హామీ ఇచ్చారని తెలిపారు. నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లా నుంచి తిరిగి ప్రకాశం జిల్లాలో కలుపుతామన్న హామీ కూడా త్వరలోనే నెరవేరుతుందని చెప్పారు. రాళ్లపాడు ఎడమ కాలువ పొడిగింపు పనులకు నిధులు మంజూరు అవుతాయని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తానన్నారు. 2029 ఎన్నికల్లో తిరిగి విజయం సాధించటమే లక్ష్యంగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. 17ఏళ్లుగా కందుకూరు మున్సిపాలిటీకి ఎన్నికలు జరగకుండా చేస్తున్న పాపం ఎవరిదో చెప్పాలని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు దామా మల్లేశ్వరరావు, జనిగర్ల నాగరాజు, షేక్ రఫి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

గుండెపోటుతో మరణించిన గణేష్‌నగర్ టీడీపీ సీనియర్ నేత తిరువల్లూరి కృష్ణమాచారి కుటుంబసభ్యులను ఎమ్మెల్యే పరామర్శించి సానుభూతి తెలిపారు. ఆయన వెంట దామా మల్లేశ్వరరావు, రావూరి రామకోటయ్య, తలమంచి బ్రహ్మయ్య, కంచర్ల సుబ్బారావు తదితరులున్నారు.

● గుడ్లూరు: పాజర్ల మాజీ సర్పంచ్ ఉమ్మడి ప్రోలు కోటేశ్వరరావు మృతి పార్టీకి తీరనిలోటని శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరావు అన్నారు. సోమవారం ఎమ్మెల్యే పార్టీ నాయకులతో కలిసి స్వగ్రామానికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం మాజీ శాసనసభ్యులు పోతుల రామారావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో గుర్రం మాల్యాద్రి, మేకపో తుల రాఘవయ్య, చుండూరు ప్రసాద్, చిత్తూరి మల్లికార్జున, జనిగర్ల నాగరాజు, మేకల మాల్యాద్రి ఉన్నారు.

● వలేటివారిపాలెం: చుండి సాగునీటి సంఘం సభ్యులు మాలకొండ ఆలయ మాజీ చైర్మన్ చెరువుపల్లి మాల్యాద్రి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే సాగునీటి సంఘం చైర్మన్‌ను, సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు పసుపులేటి జయరాం, సభ్యులు మీనుగు మాల్యా ద్రి, చెరువుపల్లి మల్లికార్జున, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అనంతరం రాత్రి రాత్రి 8గంటల సమయంలో శింగమనేనిపల్లె ఎస్సీ కాలనీలో ముట్లూరి అనిల్ సహకారాలతో నిర్మించిన చర్చిని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా అనిల్‌ను అభినందించారు. కార్యక్రమంలో పాస్టర్లు జోసఫ్, యెహన్, గుర్రం లక్ష్మీనరసింహం, గౌడపేరు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అత్యధిక సభ్యత్వ నమోదు

ఏఎస్ పేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో అత్యధికంగా టీడీపీ సభ్యత్వాలు నమోదు చేసినట్లు మండల టీడీపీ అధ్యక్షుడు అబ్బూరి రమేష్‌నాయుడు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడారు. మంత్రి ఆనం ఆదేశాలతో సీనియర్ నాయకులు తాళ్లూరు గిరి నాయుడు, కాటంరెడ్డి రవీంద్రారెడ్డి పర్యవేక్షణలో అన్ని గ్రామాల నాయకుల చొరవతో 17వేల సభ్యత్వాలు నమోదు చేశామన్నారు.

'తప్పుడు ప్రచారం తగదు'

ఉలవపాడు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): తాను వైఎస్ జగన్ పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొని కేకు తిన్నట్లు ప్రచారం చేయడం వేసీపీ శ్రేణులకు తగదని కృష్ణాపురం నీటి సంఘం అధ్యక్షుడు కొల్లిబోయిన శేషయ్య సోమవారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలో సీనియర్ నా యకుడిగా కొనసాగుతున్నా అని, తన భార్య కొల్లి శేషమ్మ టీడీపీ మద్దతుదారులతో సర్పంచ్‌గా గెలిపొందిందని పేర్కొన్నారు. తనపై వైసీపీ నాయకులు, కార్యకర్తలు తప్పుడు ప్రచారం చేయడం తగదన్నారు.

ప్రజా విజ్ఞప్తుల దినం

అల్లూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించేందుకే ప్రజావిజ్ఞప్తుల దినం కార్యక్రమాన్ని ప్రతి సోమవారం నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు లక్ష్మీ నారాయణ తెలిపారు. సోమవారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో ప్రజల నుండి ఆయన అర్జీలను స్వీకరించారు. వీటిలో భూ సమస్యల పైనే అర్జీలు వచ్చినట్లు తెలిపారు.

ఆర్థిక సాయం

జలదంకి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన జలదంకి హేమలత కుటుంబానికి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ రూ.15వేలను ఆర్థికసాయం ప్రకటించారు. మొత్తాన్ని సోమవారం నేతలు నిమ్మల పల్లి రామ్‌చైతన్య, గంటా అశోక్ మృతురాలి తండ్రి బండ్లమూడి చంద్ర మౌళికి అందజేశారు.

క్రిస్మస్ వేడుకలకు చర్చిల ముస్తాబు



విద్యుత్ వెలుగులో సియోన్ ప్రార్థనా మందిరం

ఆత్మకూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): క్రిస్టియన్ పేటలోని సెంటినరీ తెలుగు బాప్టిస్టు చర్చి, సెంటల్ తెలుగు బాప్టిస్టు చర్చి, సియోన్ ప్రార్థనా మందిరాలు క్రిస్మస్ వేడుకలకు ముస్తాబయ్యాయి. క్రిస్మస్ ట్రీలను ఏ ర్పాటుచేసి చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఎక్కడ చూసినా క్రిస్మస్ సందడి కనిపిస్తోంది. వస్త్ర దుకా ణాలు కళకళలాడుతున్నాయి. వెన్నవాడ, కరటంపాడు, వెంకట్రావుపల్లి, బి.చిరువెళ్ళ చర్చిల్లో బుధవారం క్రిస్మస్ వేడుకల్లో సామూహిక ప్రార్థనలు చేసేందుకు తగిన ఏర్పాట్లు పూర్తిచేశారు.



ఆత్మకూరులో విద్యుత్ వెలుగులతో శోభిల్లుతున్న సెంటినరీ తెలుగు బాప్టిస్టు చర్చి

కందుకూరును 'ప్రకాశం'లో చేర్చాలని ధర్నా

కందుకూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు కందుకూరు నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో చేర్చాలని యాదవ జేఏసీ అధ్యక్షుడు మిరియం శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో ప్రజా సంఘాల నాయకులు చేపట్టిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. అధికారంలోకి వందరోజుల్లోనే నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో కలుపుతామని చెప్పిన చంద్రబాబునాయుడు 200రోజులు గడిచినా పట్టించుకోవటం లేదని విమర్శించారు. ఈ విషయంపై అలసత్వం చేస్తే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మిరియం శ్రీనివాసులు



తనిఖీ చేస్తున్న ఏడీఏ దేవసేనమ్మ

ఎరువుల దుకాణాల తనిఖీ

ఆత్మకూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సిండికేట్ ఫార్మర్స్ కోఆపరేటివ్ సొసైటీ, గ్రోమోర్ సెంటర్‌లో ఎరువుల నిల్వలను సోమవారం ఆత్మకూరు ఏడీఏ దేవసేనమ్మ తనిఖీ చేశారు. స్టాకు రిజిస్టరు, బిల్లు పుస్తకాలు, ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఎరువులు, విత్తనాలను అధీకృత డీలరు వద్దనే కొనుగోలు చేయాలని సూచించారు. మండలంలో 50 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని, రైతులకు అవసరమైనంత వరకు సరఫరా చేస్తామని తెలిపారు.

దోమల నివారణకు చర్యలు

కావలి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెంకులఫ్యాక్టరీ గిరిజన కాలనీ, వైకుంఠపురం కాలనీల్లో దోమల నివారణకు అధికారులు ఫాగింగ్ చేపట్టారు. కేవలం కాలువల్లోనే కల్వరుల ఉన్న దోమలను నివారించేందుకు చర్యలు తీసుకున్నారు.



ఫాగింగ్ చేస్తున్న మున్సిపల్ కార్మికులు

బిజ్జంపల్లిలో వైద్యశిబిరం ఏర్పాటు

ఉదయగిరి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిజ్జంపల్లి గ్రామంలో వైద్య ఆరోగ్య సిబ్బంది వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో 'గ్రామాల్లో జ్వరాల విజృంభణ' అనే కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన గండిపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారి శివకల్పన గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటుచేసి జ్వరపీడితులకు వైద్యసేవలు అందించారు. అనంతరం బిజ్జంపల్లి, కృష్ణారెడ్డిపల్లి, లింగంనేనిపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటా లార్వా, జ్వరపీడితుల సర్వే నిర్వహించారు. పలు నివాసాల్లో లార్వాను గుర్తించి తొలగించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యఆరోగ్య సిబ్బంది పిక్కిలి హసనయ్య, దేవి, అనురాధ, హజరత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఘనంగా జాతీయ రైతు దినోత్సవం

సీతారామపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేదగర్భ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో సోమ వారం జాతీయ రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వ హించారు. అనంతరం పాఠశాల విద్యార్థులు స్థానిక పొలాల్లో వరినాట్లు వేశారు. రైతులు పడే శ్రమ, కష్టం గురించి తెలుసుకున్నారు. రైతుల వేషధారణలో విద్యార్థులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పవన్‌కుమార్, ప్రిన్సిపాల్ నరేష్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



పొలంలో వరి నాటుతున్న చిన్నారులు


ఉపకరణాల పంపిణీకి
నేడు దరఖాస్తుల స్వీకరణ

ఉదయగిరి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సీ తారామపురం దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో లూయిబ్రెయిలీ జయంతి సందర్భంగా దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ కోసం మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు అదోని రమణ య్య, ఓవీ సుబ్బరాజులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వరికుంటపాడు, ఉదయగిరి, సీతారామపురం మండలాల్లోని దివ్యాంగులకు బస్సు పాసులు, ట్రైసైకిళ్లు, వీల్‌చైర్‌లు, అంధు లకు చేతికర్రలు, బధిరులకు వినికిడి యంత్రాలు వచ్చేనెల 4వ తేదీన ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం సెల్: 7337268192, 9492680279 అనే నెంబర్లను సంప్రదించాలని వారు కోరారు.

హెల్మెట్ ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ



సంగం: ర్యాలీలో పాల్గొన్న సీఐ వేమారెడ్డి



కావలి: మాట్లాడుతున్న సుందరరావు

సంగం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి):మండలకేంద్రంలో సీఐ వేమారెడ్డి, ఎస్ఐ రాజేష్ ఆధ్వర్యంలో హెల్మెట్ ఆవశ్యకతపై సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్‌లు ధరించి స్థానిక పోలీస్‌స్టేషన్ నుండి బస్టాండ్, పట్టణ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ప్రమాదాలు జరిగినా ప్రాణాపాయం నుంచి బయట పడవచ్చునని తెలిపారు. ు.

● కావలి: మోటారు వాహన చట్టం నిబంధనలను ప్రతిఒక్కరూ పాటించి ప్రమాదాలను నివారిద్దామని కావలి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ సుందరరావు తెలిపారు. స్థానిక మద్దూరుపాడు డీబీఎస్ ఇంజనీరింగ్ కాలేజీలో సోమవారం విద్యార్థులకు మోటారు వాహన చట్టాలు, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదా రులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఫోర్ వీలర్స్ వాహనదారులు సీట్ బెల్టు పెట్టుకోవాలన్నారు. లైసెన్స్ తీసుకోవాలని లేకపోతే చర్యలు తప్పవన్నారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులు ఎక్కించరాదని తెలిపారు. విద్యాసంస్థల బస్సులన్నీ సరైన ఫిట్‌నెస్‌తో ఉంటూ అనుభవం ఉన్న డ్రైవర్లను ఏర్పాటు చేసుకోవా లన్నారు. సమావేశంలో సహాయ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీబాయ్, డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ టీవీ రావు పాల్గొన్నారు.

అంబేడ్కర్ రచనలు పాఠ్యాంశాలుగా చేర్చాలి

ఉలవపాడు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ రచనలను 6వ తరగతి నుంచి పీజీ వరకు పాఠ్యాంశాలుగా చేర్చాలని పెద్దపట్టపుపాలెం హైస్కూల్‌లో 60మంది విద్యార్థులు చిరునామా రాసి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు పోస్టుకార్డులను పంపారు. ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ చేపట్టిన లక్ష కార్డుల ఉద్యమంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. అనంతరం గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని నిర్వహించి టాలెంట్ టెస్ట్, ముగ్గుల పోటీలు విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పధానోపాధ్యాయుడు సలీంభాష, గణిత ఉపాధ్యాయులు హరిప్రసాద్, నీరజ, భాస్కర్, కలీల్ భాషా, శరత్, కోటేశ్వరరావు, అనురాధ, బాలయ్య పాల్గొన్నారు.

జ్వరాలు ప్రబలకుండా చర్యలు

● ఇన్‌చార్జి ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్

ఇంటర్వ్యూ...

అనంతసాగరం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో జ్వరాల తీవ్రత తగ్గించేలా చర్యలు తీసుకొంటామని, ఇందుకోసం వైద్యసిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని ఇన్‌చార్జి ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్ తెలిపారు.



? సోమశిల, అనంత సాగరం, మంచాలపల్లిలో పందుల బెడద నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటారు

! ఈ గ్రామాల్లో పందులు ఎక్కువగా ఉన్నట్లు నా దృష్టికి రాలేదు. సిబ్బందిని అప్రమత్తం చేసి నిర్మూలనకు చర్యలు తీసుకొంటాం.

? కొన్ని సచివాలయాల్లో పీల్డ్‌వర్క్ అంటూ విధులకు డుమ్మా కొడుతున్న సిబ్బందిపై చర్యలు ఉంటాయా.

! ఇన్‌చార్జి బాధ్యతలు తీసుకొన్నప్పటి నుంచి సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నా. ఉద్యోగులు ఉదయం 10-30 నుంచి సా యంత్రం 5 గంటల వరకు విధులు నిర్వహించాలి. పీల్డ్‌వర్క్‌కు వెళితే మూమెంట్ రిజిష్టర్‌లో వివరాలు ఉండాలి. అలా లేని పక్షంలో వారి జీతం కట్ అవుతోంది.

? పారిశుధ చర్యలు చేపట్టడం లేదని, ఫాంగింగ్ చేయడం లేదని ప్రజలు ఆరోపిస్తు న్నారు..

! అన్ని గ్రా మాల్లో డీవార్మింగ్ చేయి స్తున్నాం. పారిశు.ధ్యంపై దృష్టి పెట్టాం. దోమ ల వ్యాప్తి చెందకుండా ఫాంగింగ్ చేయిస్తాం.

? పంచాయతీరాజ్ సి బ్బంది కొరతతో పనులెలా సాగుతాయి.

! సిబ్బంది కొరత ఉన్న విషయం వాస్తవమే. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశాం. ఉన్న వారితో ప్రణాళికాబద్ధంగా పనులు పూర్తి చేస్తున్నాం.

సంగమేశ్వరాలయ మాజీ చైర్మన్ మృతి

సంగం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సంగమేశ్వ రాలయ మాజీ చైర్మన్ జక్కంపూడి సుబ్బానాయుడు (75) చెన్నై వైద్యశాలలో చికిత్స పొందుతూ సోమ వారం తెల్లవారుజామున మృతిచెందారు. మూడురోజుల కిందట సుబ్బానాయుడు వంట చేయడానికి గ్యాస్ పొయ్యి వెలిగించడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో తీవ్ర గాయాలకు గురికాగా చికిత్స నిమిత్తం చెన్నై వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. ఉదయం టీ పెట్టుకుని సిలిండర్ ఆపకపోవడంతో లీక్ అయిన మధ్యాహ్నం స్టౌ వెలిగించడంతో మంటలు వ్యాపించి ఉంటాయని బంధువులు భావిస్తున్నారు. ఆమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాజకీయాలకతీతంగా రావాలి

ఉదయగిరి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలకతీతంగా వెలుగొండ ప్రాజెక్టు పూర్తిచేసేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని వెలుగొండ సాధన సమితి నాయకులు దస్తగిరి అహ్మద్, నారాయణరెడ్డి పేర్కొన్నారు. స్థానిక కోట్నీస్ వైద్యశాలలో సోమవారం వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిలో భాగంగా వెలుగొండ ప్రాజెక్టు సాధన, మానవ విలువల చైతన్య ప్రచార వేదిక నిర్మాణం కోసం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఉదయ గిరిలో మానవ విలువల చైతన్య ప్రచార వేదిక నిర్మాణానికి వచ్చేనెలలో ప్రకాశం, నెల్లూరులో అఖిలపక్ష సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫడ్స్ రమణయ్య, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పార్లపల్లిలో రెవెన్యూ సదస్సు

కొండాపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పార్లపల్లిలో సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సులో నాలుగు వినతులు అందినట్లు తహసీల్దారు కోటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ కన్వీనర్ ఎం.ఓంకారం, గ్రామ కమిటీ అధ్యక్షుడు కొమ్మి కొండలరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న అధికారులు